ఆదివారం
20-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 299
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రూ.263 కోట్లు పలికిన డైనోసార్ శిలాజం

న్యూయార్క్: ఓ పురాతన డైనోసార్ శిలాజాన్ని వేలం వేయగా దాని ధర 30.5 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.263 కోట్లు పలికింది. న్యూయార్క్‌లోని సోథిబే సంస్థ ఇటీవల అరుదైన వస్తువుల వేలాన్ని ఏర్పాటు చేసింది. అందులో డైనోసార్ శిలాజం ఉంది. ప్రపంచంలో అత్యంత విలువైన మూడో డైనోసార్ అస్థిపంజరంగా ఇది నిలిచింది. శిలాజాన్ని ఎవరు కొన్నారన్న విషయాన్ని భద్రతా కారణాల రీత్యా సోథిబే బయటపెట్టలేదు. ఇది 150 మిలియన్ సంవత్సరాల క్రితం నాటిదని నిర్వాహకులు చెబుతున్నారు. అంగారక గ్రహం నుంచి తెచ్చిన పెద్ద రాయిని కూడా వేలం వేయగా ధర 5.3 మిలియన్ డాలర్లు (రూ.45 కోట్లు) పలికిందని వెల్లడించారు. కాగా, గతేడాది జులైలో అపెక్స్ అనే మరో డైనోసార్ శిలాజం 44.6 మిలియన్ డాలర్లు (రూ.380 కోట్లు) పలికింది.

పార్లమెంటు వేళ విదేశాలకు మోదీ

న్యూఢిల్లీ: పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ విదేశీ పర్యటనలకు వెళ్లడం సర్వసాధారణమైంది. విపక్షాల నుంచి విమర్శలు వస్తున్నప్పటికీ మోదీ పట్టించుకోవడం లేదు. తాజాగా ప్రధాని మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో మోదీ పర్యటించనున్నట్లు తెలిపాయి. గతేడాది మోదీపైనా, లక్షద్వీప్‌పైనా మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. విభేదాల

- మిగతా 2 లో

చైనా 'మెగా డ్యామ్' పనులు ప్రారంభం

బీజింగ్: ప్రపంచంలోనే అత్యంత భారీ జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనా ప్రారంభించింది. శనివారం మొదలైన ఈ ప్రాజెక్టు పనుల కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొన్నారు. టిబెట్‌లోని యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్ర) నదిపై చేపడుతోన్న ఈ ప్రాజెక్టు కోసం చైనా దాదాపు 1.2 ట్రిలియన్ యువాన్‌లు (సుమారు రూ.14 లక్షల కోట్లు) ఖర్చు పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్, బంగ్లాదేశ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ చైనా మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు

- మిగతా 2 లో



రెచ్చిపోయిన కన్వారియాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కన్వారియాలు రెచ్చిపోయారు. మీర్జాపూర్ రైల్వే స్టేషన్‌లో సీఆర్పీఎఫ్ జవాన్‌పై దౌర్జన్యానికి దిగారు. జవాన్‌ను కింద పడేసి కాళ్లతో కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. దీంతో వారిని అరెస్ట్ చేశారు. మీర్జాపూర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న కన్వారియాలతో రైలు టికెట్లు కొనే విషయంలో సీఆర్పీఎఫ్ జవాన్‌తో వాగ్వాదం జరిగింది. వారంతా కలిసి జవాన్‌పై దాడికి దిగారు. అక్కడున్న వారు జోక్యం చేసుకుని జవాన్‌ను కాపాడారు.

ఇదీ లోకం!

చాలా టెన్షనుగా ఉంది, కేసు హియరింగు అయ్యాక మందు కావాలయ్యా!

కాలుష్యకారక పరిశ్రమలు
ఓఆర్ఆర్ వెలుపలకు తరలించండి

హౌసింగ్ బోర్డు ఇళ్ల విక్రయాలు సామాన్యులకు అందుబాటులో ఉండాలి

క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపల ఉన్న కాలుష్యకారక పరిశ్రమలన్నింటినీ ఓఆర్ఆర్ వెలుపలకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

అంబేద్కర్ సచివాలయంలో శనివారం ఆదాయ వనరుల సమీకరణ సమావేశం జరిగింది. మంత్రులు, కమిటీ సభ్యులైన ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. పరిశ్రమల తరలింపునకు విధి విధానాలు, తేదీలను రూపొందించాలని, తుది గడువును ఖరారు చేయాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ అధ్వర్యంలో రాజీవ్ స్వగృహ పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇళ్లు, హౌసింగ్ బోర్డు అధ్వర్యంలో ఉన్న ఖాళీ స్థలాల విక్రయాలకు సంబంధించి సమీక్షించారు. బహిరంగ వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సామాన్యులు, మధ్య తరగతి వర్గాలకు ఇళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ బోర్డు అధికారులకు సూచించారు. కమర్షియల్ ట్యాక్స్ శాఖలో 1.8 శాతం, స్టాంప్స్- రిజిస్ట్రేషన్ శాఖలో 3.6 శాతం, గనుల శాఖలో ఏడు శాతం ఆదాయం పెరుగుదల ఉన్నట్టు అధికారులు మంత్రులకు నివేదించారు. చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రదీప్ కుమార్ సుల్తానియా, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, మెట్రోపాలిటన్ ఏరియా నగర అభివృద్ధి శాఖ సెక్రటరీ ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్, గనుల శాఖ కమిషనర్ శశాంక, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, ఎండీ టీజీడీటీసీ వల్లూరు క్రాంతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

కులగణన డేటానే కాదు
మెగా హెల్త్ చెకప్

- బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయమే ధ్యేయం: రేవంత్
- సర్వేపై ప్రభుత్వానికి స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదిక

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ ప్రభుత్వానికి తమ నివేదికను సమర్పించింది. ఎంసీహెచ్ఆర్డీలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి అధ్వర్యంలోని నిపుణులు సమావేశమయ్యారు. చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కంచె అయిలయ్య, సభ్యులు ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డాక్టర్ సుఖదేవ్ తొరాట్, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ జీన్ డ్రెజ్, ప్రొఫెసర్ థామస్ పికెట్టి, ప్రవీణ్ చక్రవర్తి, సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తమ నివేదికను అందించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇది కేవలం డేటా కాదు... ఇది తెలంగాణ మెగా హెల్త్ చెకప్ అని అభివర్ణించారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులగణన సర్వే విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు ఈ నివేదిక ఉపయోగపడుతుందన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు... కారణాలపై నిపుణుల కమిటీ అధ్యయనం చేయాలని కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి సరైన సూచనలు ఇవ్వాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిపుణుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ సర్వే సైంటిఫిక్, అథెంటిక్, రిలయబుల్ అని అభిప్రాయపడ్డారు. తెలంగాణ నిర్వహించిన సర్వే దేశానికి రోల్ మోడల్ గా మారుతుందని అన్నారు. కమిటీ నివేదికలోని అంశాలను, సూచనలను కేబినెట్‌లో చర్చించి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుంది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను నిర్వహించింది. మొదటి దశలో 2024 నవంబరు ఆరో తేదీ నుంచి డిసెంబరు 25 వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. రాష్ట్రంలో మొత్తం జనాభా సమాచారం సేకరించేందుకు ప్రతి జిల్లాలో ప్రతి 150 కుటుంబాలను ఒక బ్లాక్ గా ఎంచుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లతో శాస్త్రీయంగా సర్వే చేయించింది. మొదటి విడతలో 96.9 శాతం కుటుంబాలను సర్వే చేసి ఆయా వివరాలను 36 రోజుల్లో డేటా ఎంట్రీ చేయించింది. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రెండో విడతలో వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. సర్వే ప్రకారం రాష్ట్రంలో 1,15,71,457 గృహాలు ఉన్నాయి. 1,12,36,849 (97.10శాతం) కుటుంబాల నుంచి 3,55,50,759 మంది తమ వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సమగ్ర కుల గణన సర్వే ఫలితాల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలు 61,91,294 మంది (17.42శాతం), ఎస్టీలు 37,08,408 మంది (10.43శాతం), బీసీలు 2,00,37,668 మంది (56.36శాతం),

- మిగతా 2 లో

గూగుల్, మెటాకు
ఈడీ నోటీసులు

బెట్టింగ్ యాప్ కేసులో 21న విచారణకు రావాలని ఆదేశాలు

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజాలు గూగుల్, మెటాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం నోటీసులు జారీ చేసింది. ఈనెల 21న విచారణకు హాజరవ్వాలని ఆదేశించింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన కేసుల దర్యాప్తును ముమ్మరం చేసిన క్రమంలో ఈ మేరకు నోటీసులు ఇచ్చింది. ఈ యాప్‌లతో మనీలాండరింగ్, హవాలా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గూగుల్, మెటా సంస్థలు తమ మాధ్యమాల్లో ఇలాంటి యాప్‌లకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు ఈడీ ఆరోపించింది. బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలకు స్లాట్లు కేటాయించడం, వెబ్ లింక్‌లు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొంది. మహదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ సహా అనేక కుంభకోణాల కేసులపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో బాలీవుడ్ సెలబ్రిటీలను విచారించింది. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ సహా ప్రముఖులపై అభియోగాలు ఉన్నాయి. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లలో 29 మంది టాలీవుడ్ సినీనటులు, యూట్యూబర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేసింది.

పంటలకు సమృద్ధిగా సాగునీరు

- ఆధునిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ
- నీటిపారుదలశాఖ భూముల పరిరక్షణ
- విపత్తుల్లో నష్ట నివారణకు ప్రణాళిక
- నీటి సామర్థ్యం పెంపునకు కాలువల్లో పూడికతీత
- సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వానాకాలం... యాసంగి పంటలకు ప్రణాళికాబద్ధంగా సాగునీరు అందిస్తూ అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. వ్యవసాయశాఖాధికారులతో నీటిపారుదల శాఖాధికారులు సమన్వయం చేసికున్నందునే తెలంగాణా రాష్ట్రం 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించి భారత దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఖరీఫ్ పంటకు నీటి విడుదలతో పాటు ఆధునిక పరిజ్ఞానంతో ఎస్.ఎల్.బీ.సీ పునరుద్దరణ, నీటిపారుదలశాఖ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అంబేద్కర్ సచివాలయంలో ఆశాఖాధికారులతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ సాగునీటి కోసం ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదని సూచించారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలన్నారు. భారీ వర్షాలు సంభవిస్తే ఎదురయ్యే పరిణామాలపై ముందస్తు బందోబస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాన ఆనకట్టాల తో పాటు జలాశయాలు, కాలువలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు వీలుగా సన్నద్ధం కావాలన్నారు. కాలువలకు గండ్లు పడకుండా ప్రణాళికాబద్ధంగా

- మిగతా 2 లో

బ్రహ్మోత్సవాలకు
ఇస్రో సేవలు

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్ : శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల ప్రణాళికల రూపకల్పనలో ఇస్రో సేవలను వినియోగించుకునేలా టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. కొన్నేళ్లుగా ముఖ్య వాహన సేవలో పాల్గొంటున్న భక్తుల సంఖ్యను టీటీడీ సుమారుగా లెక్కిస్తోంది. అయితే సెప్టెంబరు 24న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సావాల్లో నిర్వహించే గరుడోత్సవం రోజున మాడవీధుల్లో బయట ఎంత మంది భక్తులు శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉందనే విషయమై అత్యాధునిక శాటిలైట్ల ద్వారా గుర్తించి సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేసే వీలు కలుగుతుందని టీటీడీ అధికారులు భావిస్తున్నారు.

హైకోర్టు సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు.

త్రిపుర హైకోర్టు సీజేగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తెలంగాణకు వచ్చారు. ప్రస్తుతం హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ సుజయ్ పాల్ కోల్‌కతా హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ ఏకే సింగ్ 1965, జులై ఏడో తేదీన జన్మించారు. ఆయన దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు ఉత్తర ప్రదేశ్ హైకోర్టు న్యాయవాదిగా, 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా, 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. 2023 ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. తాజాగా ఆయనను తెలంగాణ హైకోర్టుకు సీజేగా నియమిస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. దీన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. కాగా తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన తర్వాత జస్టిస్ ఏకే సింగ్ ఏడవ చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ జితేందర్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు, డీజీపీ, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు హాజరయ్యారు.

విప్లవకారుల భౌతికకాయాలంటే
బీజేపీ నేతలకు భయం

- సమాజాన్ని కాపాడేది కమ్యూనిస్టులే
- హామీలు నెలవేర్చకుంటే పోరుబాటే: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: విప్లవకారుల భౌతికకాయాలకు బీజేపీ నేతలు భయపడుతున్నారని, హతమార్చిన తర్వాత వాటిని కుటుంబీకులకు అప్పగించేందుకు జంకుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మరణించిన తర్వాత కూడా విప్లకారులు ప్రజలను చైతన్యవంతులను చేస్తారనే భయంతో బీజేపీ నేతలు ఆందోళన చెందుతున్నారన్నారు. విప్లకారులను ఏరివేయడం ఎవరితరం కాదన్నారు. సీపీఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభలు శనివారం మధిరలోని పోటు ప్రసాద్ నగర్ (రెడ్డి గార్డెన్స్) లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత పార్టీ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు ఎగురవేశారు. మృతవీరుల స్మారక స్థూపాన్ని రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ఆవిష్కరించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ బీజేపీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రశ్నించే వారిని లేకుండా చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. మావోయిస్టులను తుదముట్టిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రగల్భాలు పలుకుతున్నారనీ, ప్రజలపక్షాన పనిచేసే కమ్యూనిస్టులను లేకుండా చేయడం ఎవరితరం కాదని అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతం -విశ్వవ్యాపితమైందన్నారు. ప్రపంచంలో సగం జనాభా కమ్యూనిస్టుల పాలనలోనే ఉన్నారని, దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే భారత దేశంలో కూడా గణనీయమైన స్థానాలు దక్కుతాయని పేర్కొన్నారు. బూర్జువా పార్టీల అంతిమ లక్ష్యం అధికారమేనని, కమ్యూనిస్టులకు మాత్రం ప్రజాభ్యుదయం, సమాజమార్పు, ఆర్థిక అసమానతలులేని సమాజ నిర్మాణమే లక్ష్యం అన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే అనేక చట్టాలు రూపొందాయన్నారు. ఇప్పుడు బీజేపీ ఆ చట్టాలను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుందని కూనంనేని తెలిపారు. మతోన్మాద శక్తులపై పోరాడేందుకు కమ్యూనిస్టులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అప్పులున్నాయని రాష్ట్ర ప్రభుత్వం హామీల

- మిగతా 2 లో

హైజాకర్ల రక్షణకు పాకిస్థాన్ చట్ట సవరణ

ఇస్లామాబాద్: ఉగ్రవాదులకు, హైజాకర్లకు ఆశ్రయం కల్పించిన వారికి మరణశిక్షను రద్దు చేసేందుకుగాను పాకిస్థాన్ చట్టాన్ని సవరించింది. సంబంధిత బిల్లుకు పాక్ సెనెట్ ఆమోదం లభించింది. పాక్ పీనల్ కోడ్ చట్టాల ప్రకారం హైజాకర్లకు ఆశ్రయం కల్పిస్తే గరిష్ఠంగా మరణశిక్ష విధించాలి. మహిళలను వేధించడం, వివస్త్రను చేస్తే గతంలో ఉన్న ఏడేళ్ల శిక్షను 1983లో జియా ఉల్‌హక్ హయాంలో మరణశిక్షగా మార్చారు. ఈ తరహా నేరాల్లో శిక్ష తగ్గించాలని డిమాండ్ల క్రమంలోనే క్రిమినల్ చట్ట సవరణ బిల్లు 2025ను తెచ్చారు. అందులో హైజాకర్లకు ఆశ్రయం కల్పించడం, మహిళలను బహిరంగంగా వివస్త్రను చేయడం వంటి నేరాలకు శిక్ష తగ్గించే ప్రతిపాదనలకు

పాక్ సెనెట్ ఆమోదం తెలిపింది. మరణశిక్షను రద్దు చేసి యావజ్జీవ శిక్ష విధించేలా చట్టాన్ని సవరించింది. అత్యంత తీవ్రమైన నేరాలకు మాత్రమే మరణశిక్ష విధించేలా మార్పు జరిగింది. ఈ బిల్లు త్వరలో చట్టరూపం దాల్చనుంది. విపక్షాలు అభ్యతరాలు వ్యక్తం చేసినాగానీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏకపక్షంగా బిల్లును తీసుకొచ్చింది.

300కుపైగా డ్రోన్లతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి

కీవ్: కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు కొనసాగుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా 300కి పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారని.. వారిని కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులను రష్యా ప్రయోగించిందని

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఒకరు చనిపోయారని, చాలా మంది గాయాలపాలైనట్లు తెలిపారు. భారీగా ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని జెలెన్‌స్కీ తెలిపారు. యుద్ధ సమయంలో తమకు అండగా ఉంటూ.. ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర దేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కీవ్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సాయం

ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా ఆయుధ సాయం చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం కీవ్‌కు ఎంబిఏ1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ వెల్లడించారు. ఉక్రెయిన్‌పై రష్యా చట్టవిరుద్ధమైన, అనైతిక దండయాత్రకు వ్యతిరేకంగా ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

ఐదు యుద్ధ విమానాలను కూల్చేశారు: ట్రంప్

వాషింగ్టన్/న్యూదిల్లీ: భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల్లో ఐదు యుద్ధ విమానాలను కూల్చివేశారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధ దేశాలు యుద్ధానికి కాలుదువ్వుతుంటే మేము కలగజేసుకుని.. వాణిజ్యం ద్వారా పరిష్కరించాం. దాడులు ఆపకపోతే వాణిజ్య ఒప్పందం చేసుకోమన్నాం. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే తీవ్రమైన చాలా యుద్ధాలను ఆపడం మాకు గర్వకారణం' ట్రంప్ అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను కూల్చినట్లు పాకిస్థాన్ చెబుతోంది కానీ, అందుకు ఆధారాలు చూపలేదు. యుద్ధ విమానాల కూల్చివేత అంశంలో భారత్ త్రివిధ దళాల అధిపతి అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతీయ వైమానిక దళానికి చెందిన యుద్ధ విమానాలను కోల్పోయినట్లు పేర్కొన్నారు. కానీ పాకిస్థాన్ చెబుతున్నట్లు ఆరు విమానాలను కోల్పోలేదన్నారు. కూలిన విమానాల సంఖ్యను మాత్రం ఆయన వెల్లడించలేదు.

బోల్సనారోపై ఆంక్షలు... ఆ జడ్జి అమెరికా వీసా రద్దు

సావో పౌలో: బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో కదలికల్ని గమనించడం కోసం ఆయన కాలికి ఎలక్ట్రానిక్ పరికరాన్ని అమర్చాలని ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని అమెరికా తీవ్రంగా పరిగణించింది. ఇందుకోసం ఆదేశించిన జడ్జి అమెరికా వీసాను రద్దు చేసింది. బోల్సనారోపై ఆంక్షలు విధించిన జడ్జికి మద్దతు తెలిపిన న్యాయమూర్తులు, వారి కుటుంబ సభ్యులకూ వీసా ఆంక్షలు వర్తిస్తాయని అమెరికా స్పష్టం చేసింది. తన మిత్రుడైన బోల్సనారోపై బ్రెజిల్ న్యాయవ్యవస్థ అన్యాయంగా వ్యవహరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంతకుముందు వ్యాఖ్యానించారు. బోల్సనారోపై బ్రెజిల్ సుప్రీం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఆరోపించారు. న్యాయస్థానం చర్యలు బ్రెజిలియన్ల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే కాకుండా అమెరికన్లను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నంగా పేర్కొన్నారు. 2022 ఎన్నికల్లో ఓటమిని అంగీకరించని బోల్సనారో తిరుగుబాటుకు కుట్రపన్నారనే ఆరోపణలున్నాయి. రాత్రిపూట ఇల్లు విడిచి వెళ్లరాదని, విదేశీ రాయబారులతో మాట్లాడరాదని సర్వోన్నత న్యాయస్థానం ఆయనను ఆదేశించింది. సామాజిక మాధ్యమాలు వినియోగించరాదని, తన కుమారుడు ఎడ్వర్డో బోల్సనారోతో పాటు ఇతర నిందితులతో మాట్లాడకూడదని తేల్చిచెప్పింది. ఆయన నివాసం, పార్టీ కార్యాలయాల్లో సోదాలకు అనుమతించింది. యాంకిల్ మానిటర్ ధరించాలని ఆదేశించింది. .

మన ఎంపీలు బీజేపీకి బానిసలు: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : టీడీపీ, వైసీపీ, జనసేన ఎంపీలు పేరుకే... వీళ్లంతా బీజేపీకి బానిసలే అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కన్నా స్వప్రయోజనాలే ముఖ్యమని, రాష్ట్ర హక్కుల కన్నా... వీరికి మోదీ మెప్పు మిన్న అని ఎద్దేవా చేశారు. పదవులు అనుభవించడంపై ఉన్న శ్రద్ధ విభజన హామీలపై లేదన్నారు. తమ నోరును హక్కుల కోసం కాకుండా మోదీ జపానికి మాత్రమే వాడతారని మండిపడ్డారు. నమ్మి ఓటేస్తే మతపిచ్చి పార్టీకి ఊడిగం తప్పా ఉద్ధరించింది శూన్యమని అన్నారు. మోదీ చేతిలో 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ ఎంపీలు రబ్బర్ స్టాంప్‌లు ఉంటూ దుయ్యబట్టారు. బీజేపీ కోసం పని చేసే కీలుబొమ్మలుగా అభివర్ణించారు. హోదాపై అడిగే ధైర్యంలేదు. రాజధానికి నిధులు అడిగే సత్తా లేదు. పోలవరాన్ని ముంచుతుంటే ఎదురు తిరిగే ధైర్యం లేదని అన్నారు. అడ్డికి పావుసేరు కింద విశాఖ స్టీల్‌ను అమ్ముతున్నా... పౌరుషం ఉండదన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్ర హక్కులపై గళం విప్పకుండా... బీజేపీ అక్రమ బిల్లులకు గొర్రెల్లా తల ఊపడం తప్పా మన ఎంపీలకు ఏమి చేతకాదని అన్నారు. ఈ రాష్ట్ర బిడ్డలే అయితే పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర హక్కులపై నిలదీయాలని, మోదీ మోసాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. విభజన హామీలపై నోరు విప్పాలని, తిరుపతి వేదికగా ఇస్తామని చెప్పిన ప్రత్యేక హోదా ఏమైందని అడగాలని పేర్కొన్నారు. కేంద్రం బాధ్యతగా అమరావతికి నిధులు కాకుండా అప్పులు ఎందుకు ఇస్తున్నారో సమాధానం చెప్పమనండి. జీవనాడి పోలవరం ఎత్తు 41.15 మీటర్లకు కుదించి ఎందుకు జీవం తీశారని ఉభయ సభలను స్తంభింపజేయండని కోరారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఉండదని మోదీ చేత అధికారిక ప్రకటన చేయించాలని షర్మిల డిమాండ్ చేశారు.

రోజాను అవమానించిన భానుప్రకాశ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలి

వైఎస్ జగన్ ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైసీపీ నేత, మాజీ మంత్రి రోజాపై నగరి టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఖండించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో ట్వీట్ చేశారు. 'మాజీ మంత్రి రోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయం. తెలుగుదేశం పార్టీలో దారుణంగా మారిన దుష్ట సంస్కృతికి ఆ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ గట్టిగా మాట్లాడుతున్నందుకు, వాటిని ప్రశ్నిస్తున్నందుకూ ఓర్చుకోలేక, రెండుసార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ పని చేసిన నా సోదరి రోజాను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. తమను విమర్శించే మహిళల గొంతు నొక్కడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీలో ఒక తంతుగా మారిన అత్యంత హేయమైన సంస్కృతికి ఇది ఒక నిదర్శనం. వ్యక్తిత్వ హననం ద్వారానే చంద్రబాబు తన రాజకీయ జీవితం కొనసాగిస్తున్నారు. నిజం చెప్పాలంటే ఒక మహిళపై అత్యంత హేయంగా ఆరోపణలు చేసి, దుష్ప్రచారం చేసి ఆయన ఉన్నత పదవి పొందారు. అప్పటి నుంచే వ్యక్తిగత దాడులు, స్త్రీలను ద్వేషించే తత్వం తెలుగుదేశం పార్టీకి ఒక బ్రాండ్‌గా మారింది. ధైర్యంగా మాట్లాడే మహిళలను భయపెట్టి వారి నోరు మూయించడానికి నిస్సిగ్గుగా అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు విమర్శించడాన్ని ఆ పార్టీ నాయకులు ఒక ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఆ కోవలోనే గత ఏడాది కాలంగా అనేక మంది మహిళా నాయకురాళ్లను వారు దారుణంగా వేధించారు, అవమానించారు. తనపై ఒక ఎమ్మెల్యే చేసిన అత్యంత హేయమైన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడానికి రోజా వెళ్లగా, వాస్తవాలు స్పష్టంగా కళ్లెదుటే కనిపిస్తున్నా పోలీసులు తిరిగి ఆమెపైనే సందేహాలు వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎంత దారుణంగా మారింది? టీడీపీ గూండాలను రక్షించేందుకు వారు ఏ స్థాయిలో తమ బాధ్యత, కర్తవ్యాన్ని మర్చి వ్యవహరిస్తున్నారన్నది చూపుతున్నాయి. నిజానికి ఒక్క రోజా విషయంలోనే కాదు. మాజీ మంత్రి విడదల రజని, కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు మా పార్టీకి చెందిన అనేక మంది నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో కూడా చాలా అవమానకర ఘటనలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయింది. వారికి కనీస గౌరవ, మర్యాదలు దక్కడం లేదు. వారికి ఏ విధంగానూ న్యాయం జరగడం లేదు. ఇకనైనా మాజీ మంత్రి రోజాను దారుణంగా అవమానించిన ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' అని జగన్ డిమాండ్ చేశారు.

నేడు, రేపు వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఆది, సోమవారాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటన చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్లు, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల వద్ద నిలబడరాదని హెచ్చరించారు. అల్లూరి సీతారామ రాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. అటు తెలంగాణలోనూ కొన్ని ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. బీరంగూడ, ఆర్సీపురం, మియాపూర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, చాంద్రాయణగుట్ట, బాలాపూర్, శంషాబాద్, రాజేంద్రనగర్‌లో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నేరస్థులను ఊడ్చేద్దాం

చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర-తిరుపతి: ప్రతి ఒక్కరూ ఇంటిలో చెత్తను ఊడ్చి పారవేసినట్లే... రాజకీయాల్లో సైతం నేర చరిత్ర కలిగిన వారిని ఊడ్చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి జిల్లాలో ముఖ్యమంత్రి విస్తృతంగా పర్యటించి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రజా వేదిక వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ వైసీపీ పాలనలో ఎవరికైనా స్వేచ్ఛ ఉండేదా అని ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య జరిగితే తొలుత గుండెపోటు అని ప్రచారం చేసి తర్వాత నాపై నింద వేశారని అన్నారు. మా రాజకీయ జీవితంలో ఎన్నడూ హత్యా రాజకీయాలు చేయలేదని స్పష్టం చేశారు. గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. చివరకు ప్రజల భూములను లాక్కునేందుకు ప్రయత్నించారని అన్నారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం, మత కలహాలు, రౌడీయిజం లేకుండా చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. బంగారు పాలెం వద్ద పార్టీ కార్యకర్త తీసుకువచ్చిన మామిడి కాయలను రోడ్డుపై పారబోసి జగన్ పులివెందుల రాజకీయం చేశారని ధ్వజమెత్తారు. మామిడి రైతులకు కేజీకి నాలుగు రూపాయలు ప్రభుత్వం తరపున చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి నెలా ఒక కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. వాట్సప్ గవర్నెన్స్ తీసుకువచ్చి ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరం చేశామన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే అందరూ స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ఐదు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణాంధ్రగా మారాలంటే స్వచ్ఛాంధ్రగా మారాలని, ఇందుకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. రాష్ట్రంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికడతామని అన్నారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాల్లో డిసెంబరులోగా 120 మైక్రాన్ మందం లోపు వాటిని నిషేధిస్తామని తెలిపారు. రాయలసీమకు నీటిని తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. త్వరలో బాలాజీ రిజర్వాయర్, వేణుగోపాల సాగర్ నిర్మించడంతో పాటు మల్లెమడుగు, మూలపేట చెరువు, ఆరనియార్ ప్రాజెక్టులను ఆధునీకరిస్తామని, తద్వారా తిరుపతి జిల్లాను సస్య శ్యామలం చేసి సొంత జిల్లా రుణం తీర్చుకుంటానని అన్నారు. అలాగే నూతన పరిశ్రమలు తీసుకువచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి సత్యప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు. కాగా శనివారం తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబు ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట మండలం తూకివాకం గ్రామం వద్ద సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ ప్లాంట్ ద్వారా వస్తున్న ఆదాయాన్నివాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి కపిలతీర్థం చేరుకుని పుష్కరిణి శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. కపిలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అనేక స్టాల్స్‌ను సందర్శించారు. ప్లాస్టిక్ రహిత బ్యాగులు, ప్లాస్టిక్ రహిత బాటిళ్ల వాడకంలో మెప్మా మహిళలు రూపొందించిన ప్రత్యామ్నాయ వస్తువులను ప్రశంసించారు.

మద్యం కేసులో ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్

7 గంటల పాటు విచారించిన సిట్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : మద్యం కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టయ్యారు. ఈ కేసులో ఏ-4గా ఉన్న ఆయనను సిట్ శనివారం రాత్రి 8 గంటల సమయంలో అరెస్ట్ చేసింది. దీనికి ముందుగా ఆయనను విజయవాడలోని సిట్ కార్యాలయంలో అధికారులు విచారించారు. అనంతరం ఆయనకు ముందస్తు నోటీసులు అందజేసి అరెస్ట్ చేశారు. ఈ సమాచారాన్ని కూడా ముందుగానే ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ కేసులో అరెస్ట్ కాకుండా ముందస్తు బెయిల్ పొందేందుకు మిథున్ రెడ్డి ప్రయత్నించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయగా... శుక్రవారం సుప్రీం కోర్టు కూడా ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో ఆయన అరెస్ట్‌కు అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మిథున్ రెడ్డి శనివారం ఉదయం దిల్లీ నుంచి నేరుగా విజయవాడ వచ్చి సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సిట్ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దాదాపు 7 గంటల పాటు ఆయనను అధికారులు విచారించారు. మద్యం పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర వహించినట్లు అధికారులు ప్రాథమిక సాక్ష్యాలు సేకరించారు. దీంతో ఇందులో మిథున్ రెడ్డి పాత్రపై ముందుగా సిద్ధం చేసిన ప్రశ్నలనే అధికారులు వివిధ కోణాల్లో అడిగి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా షెల్ కంపెనీల నుంచి అంతిమ లబ్ధిదారుకు స్కాం సొమ్ము ఎలా చేర్చారన్న దానిపై మిథున్ రెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది.

300 పేజీలతో ప్రాథమిక ఛార్జిషీట్ కోర్టుకు సమర్పించిన సిట్

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై దాదాపు 300 పేజీలతో ప్రిలిమినరీ ఛార్జ్‌షీట్‌ను సిట్ అధికారులు కోర్టుకు సమర్పించారు. దీనితో పాటు వందకు పైగా ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ పరికరాలను జతచేశారు. మొత్తం రూ.62 కోట్లు సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 268 మంది సాక్షులను విచారించినట్లు ఛార్జ్‌షీట్‌లో వెల్లడించారు. 11 మంది వాంగ్మూలాలు, రిమాండ్ రిపోర్టులు, ఇతర పత్రాలను దీనికి జతచేశారు. వివిధ బ్యాంకులు, ఆస్పత్రులు, బంగారం షాపులు, రియల్ ఎస్టేట్ కంపెనీల్లో పెట్టుబడుల వివరాలకు సంబంధించిన స్టేట్‌మెంట్‌లను కూడా స్వాధీనం చేసుకుని ఛార్జ్‌షీట్‌లో సిట్ పొందుపరిచింది. మద్యం ముడుపులు షెల్ కంపెనీల ద్వారా రావడం, బ్లాక్‌ను వైట్‌గా మార్చడం తదితర అంశాలను వెల్లడించింది. 20 రోజుల్లో మరో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని సిట్ తెలిపింది. దర్యాప్తు కీలక దశలో ఉందని, త్వరలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

కీలక నిందితుల అరెస్ట్

ఈ కేసులో సుమారు 40 మంది నేతలు, అధికారుల పాత్రను సిట్ గుర్తించగా, 12 మంది కీలక వ్యక్తులను అరెస్ట్ చేసింది. 2019 తర్వాత నూతన మద్యం పాలసీని అమల్లోకి తెచ్చిన వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనా కాలంలో సుమారు రూ.3,200 కోట్ల అక్రమాలు జరిగినట్లు సిట్ గుర్తించింది. మద్యం తయారీ, విక్రయాలు, నేరుగా ఆర్థిక లావాదేవీలు మాత్రమే జరపడం వంటి వాటిల్లో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు సేకరించింది. ఎంపీ మిథున్ రెడ్డి మద్యం పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర వహించినట్లు భావిస్తున్నారు. మిథున్ రెడ్డితో కలిపి ఇప్పటి వరకు సిట్ 12 మందిని అరెస్ట్ చేసింది. వీరిలో జగన్ సర్కారులో మాజీ ఐటీ సలహాదారుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఏ-1 నిందితునిగా ఉన్నారు. ఆయన ఏప్రిల్ 21, 2025న అరెస్ట్ అయ్యారు. ఆ తర్వాత ఎ-6గా ఉన్న సజ్జల శ్రీధర్ రెడ్డి (స్నైడ్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ) ఏప్రిల్ 26, 2025న అరెస్ట్ అయ్యారు. ఇక బి.చాణక్య (ఎ-8), పి.దిలీప్, (రాజశేఖర్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు), గోవిందప్ప బాలాజీ, (భారతీ సిమెంట్స్ డైరెక్టర్), మే 13, 2025న మైసూరులో అరెస్ట్ అయ్యారు. అలాగే రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎంఓ కార్యదర్శి కె.ధనుంజయ రెడ్డి, మే 16, 2025న అరెస్ట్ అయ్యారు. మాజీ ఓఎస్డీ పి.కృష్ణమోహన్ రెడ్డి మే 16, 2025న అరెస్ట్ అయ్యారు. ఇలా ఇప్పటికి మొత్తం 12 మంది జైలు పాలయ్యారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది.

మాజీ మంత్రి నారాయణస్వామికి నోటీసులు

మద్యం కేసులో మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి పి.నారాయణస్వామికి కూడా సిట్ నోటీసులు జారీ చేసింది. సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడ సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొంది.

చైనా 'మెగా డ్యామ్' పనులు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

కనిపిస్తోంది. 'చైనా యాజియాంగ్ గ్రూపు' పేరుతో కొత్తగా ఓ సంస్థను ఏర్పాటు చేసి... ఈ ప్రాజెక్టు బాధ్యతలు దానికి అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం ఐదు డ్యామ్‌లు ఉండనున్నాయి. టిబెట్‌లోని నైంగ్చీ నగరంలో భారీస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా దీన్ని చేపడుతున్నారు.

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్టు

భారీ ఖర్చుతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలవనుంది. దీనిద్వారా ఏటా 300 బిలియన్ కిలోవాట్-అవర్స్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇది చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా మూడురెట్లు పెద్దది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో నిటారుగా పడటం వల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశాలున్నాయి. హిమాలయాల్లో టిబెట్ నుంచి అరుణా చల్‌ప్రదేశ్‌కు నది గమనంలో వంపు తిరిగే చోట ఈ డ్యామ్ నిర్మిస్తున్నారు. భారీ డ్యామ్ నిర్మాణం వల్ల ఇక్కడి భౌగోళిక ప్రదేశానికి, పర్యావరణానికి తీరని నష్టం కలగవచ్చనే అభిప్రాయాలున్నాయి. దీనివల్ల అరుణాచల్‌తోపాటు అసోం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ రెండు దేశాల మధ్య ఘర్షణ సంభవిస్తే చైనా ఈ డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదలచేస్తే అక్కడి భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనిపై భారత విదేశాంగశాఖ ఇటీవల స్పందిస్తూ ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ కొనసాగిస్తామని, తమ దేశ ప్రయోజనాలు కాపాడుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది.

ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువున ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచిం చింది. తన నిర్ణయాన్ని సమర్థించుకున్న చైనా... ఈ ప్రాజెక్టు విషయం లో అనేక శాస్త్రీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని, భారత్, బంగ్లాదేశ్‌పై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపదని తెలిపింది.

పార్లమెంటు వేళ విదేశాలకు మోదీ

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. జులై 23-24 తేదీలలో మొదట బ్రిటన్‌లో జరగనున్న భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై జరిగే చర్చల్లో మోదీ పాల్గొంటారని, ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. బ్రిటన్ ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25-26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు.

మెగా హెల్త్ చెకప్

(మొదటిపేజీ తరువాయి)

ఇతర కులాలకు చెందిన వారు 56,13,389 మంది (15.89శాతం) ఉన్నారు. ఈ సర్వే వివరాల నివేదికను ప్రభుత్వం అసెంబ్లీకి సమర్పించింది. సర్వే ఫలితాలను అధ్యయనం చేసి విధాన నిర్ణయాలను రూపొందించేందుకు వీలుగా సర్వే డేటాను విశ్లేషించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి సుదర్శన్‌రెడ్డి అధ్వర్యంలో 11 మంది సభ్యులతో స్వతంత్ర్య నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాంఘీక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఈ.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ. శరత్ పాల్గొన్నారు.

పంటలకు సమృద్ధిగా సాగునీరు

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించాలన్నారు. విపత్తులు సంభవిస్తే తక్షణమే నష్టానివారణ చర్యలకు అధికారులు పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. సంబంధిత శాఖలతో సమీక్షించుకుంటూ నష్టనివారణకు కృషి చేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్ఎల్‌బీసీని పునరుద్ధరిస్తున్నట్టు వెల్లడించారు. ఇది తెలంగాణా రాష్ట్రానికి జీవనాడిగా మారుతుందని చెప్పారు. జాతీయ భౌగోళిక పరిశోధనా సంస్థ (ఎన్.జి.ఆర్.ఐ), భారత భూగర్భ సర్వే సంస్థ(జీఎస్ఐ) సహకారంతో పనులు చేపట్టబోతున్నట్లు వివరించారు. పనులలో ఆటంకాలు ఎదురు కాకుండా ఏరియల్ లిడార్ సర్వేకు ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తలతో సాంకేతిక విధానాలను రూపొందించామన్నారు. సొరంగం పనులలో అపారమైన అనుభవం కలిగిన మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ హర్పల్‌సింగ్ ను నీటిపారుదల శాఖకు గౌరవ సలహాదారుగా నియమిస్తున్నట్లు తెలిపారు. నీటి సామర్థ్యం పెంపొందించేందుకు చేపట్టిన పూడిక తీత పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు ఇంజినీరింగ్ రీసెర్చ్ లాబొరేటరీ సంస్థలకు చెందిన భూముల ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. పురపాలక సంఘం, పోలీస్ అధికారులను వినియోగించుకుని నీటిపారుదలశాఖ భూములన్నింటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఈ స్థాయి నుంచి ఈఎన్‌సీల వరకు రెండు నెలల్లో ఫించన్ల ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. నీటిపారుదలశాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారు అదిత్యా దాస్‌నాథ్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఈఎన్‌సీలు అంజాద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేశ్‌బాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలకు భయం

(మొదటిపేజీ తరువాయి)

అమలులో జాప్యం చేస్తే సీపీఐ పోరుబాట పట్టక తప్పదని హెచ్చరించారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో నాన్చివేత ధోరణి మానుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ బలానికి అనుగుణంగా పొత్తులు కుదిరితే కలిసిపోటీ చేస్తామని, లేదంటే ఒటరిపోరుతో తమ సత్తా చాటుతామన్నారు. ఓటమి తర్వాత కొందరు నాయకులు వేరుదారులు వెతుక్కుంటారని, అదే దారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పయనిస్తోందన్నారు. చారిత్రక పోరాటాలు సీపీఐ సొంతం అని ఎమ్మెల్సీ నెల్లికంట సత్యం అన్నారు. స్వాతంత్ర్యానంతరం అనేక పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నేతృత్వం వహించిందని, ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా ఉద్యమ కేంద్రంగా భాసిల్లిందని పేర్కొన్నారు. వందేళ్లలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్వహించామని, సుదీర్ఘ పోరాటాలు కమ్యూనిస్టు పార్టీని చిరస్థాయిగా నిలిపాయని వివరించారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు బీజేపీ తలవంచక తప్పదలేదని తెలిపారు. మతోన్మాదం, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని నెల్లికంటి పిలుపునిచ్చారు. జమ్ముల జితేందర్ రెడ్డి, మందడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఎంగల ఆనందరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ఎర్రా బాబు, ఎస్ కే జానిమియా ఏపూరి లతాదేవి , కొండపర్తి గోవిందరావు , సిద్దినేని కర్ణకుమార్, కర్నాటి రామమోహన్ రావు, బెజవాడ రవిబాబు, ఎం.ఎ. రహీమ్, పుట్ల కొండలరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో గ్రౌండింగ్ పూర్తి చేయాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : కట్టంగూరు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండలానికి మంజూరైన గృహాలలో వచ్చే బుధవారం నాటికి 50 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె కట్టంగూరు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రౌండింగ్ కానీ గ్రామాలలో వెంటనే ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రౌండింగ్లో పురోగతి లేనట్లయితే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆదివారం, సోమవారం 2 రోజులు ఇంకా ఎక్కువగా పనిచేసి పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. ఏపీఓతో వన మహోత్సవంపై సమీక్షిస్తూ వనమహోత్సవం కింద మండలానికి నిర్దేశించిన లక్ష్యం ప్రకారం గుంతల తవ్వకం, మొక్కలు నాటడం సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఆన్లైన్ వివరాలన్నీ ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. నల్గొండ ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్, కట్టంగూర్ ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

జిడికె 11ఇంక్లైన్ గని జిఎం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: జిడికె 11 ఇంక్లైన్ గని ని అర్జీ వన్ జిఎం డి.లలిత్ కుమార్ శనివారం ఆకస్మిక తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన గనిలో ఉత్పత్తి, ఉత్పధకతను, గనిలో తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి సమీక్షించారు. అనంతరం గనిలోని 3 సీమ్ ఎల్.హెచ్.డి సెక్షన్ సోని పని స్థలాలను పరిశీలించారు.గని లోని ఎల్.హెచ్.డి సెక్షన్‌లోని అన్ని పని స్థలాలలో వెంటిలేషన్ ఇన్స్ట్రుమెంట్స్‌తో గాలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నడకదూర భారం తగ్గించడానికి ఫోర్ సిమ్ టు డిప్ మ్యాన్ రైడింగ్ చైర్ లిఫ్ట్ త్వరగా స్టార్ట్ చేయాలని కార్మికులు జిఎంను కోరారు. రెండు నెలలలో మ్యాన్ రైడింగ్ స్టార్ట్ చేపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కష్టమైన పని పరిస్థితిలో కార్మికులు పని చేస్తున్నందుకు ఆయన వారిని అభినందించారు. ఉద్యోగులు ఆహారపు అలవాట్లు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని కోరారు. రక్షణ సేఫ్టీకి సంబంధించిన ఏర్పాట్లు చూడాలని గని అధికారులకు, సూపర్వైజర్లకు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ చిలక శ్రీనివాస్, గని మేనేజర్ బి.మల్లేశం, గని వర్క్స్ మెన్ ఇన్స్పెక్టర్ యాస శ్రీనివాస్, గని అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ జి.నరేష్, ఏఐటీయు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఆగస్టు 13న హైదరాబాదులో జరిగే చేయూత పింఛన్ దారుల మహా గర్జనను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చింత సతీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవెల్లి అరుణ్ మాదిగ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు చింత సతీష్ విచ్చేసి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ఆరు గ్యారంటీల పథకాలలో చేయుత పెన్షన్ దారులైన వికలాంగులకు 4000 రూపాయల నుండి 6000 రూపాయల వరకు పెంచుతామని వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు గీతా కార్మికులకు 2000 రూపాయల నుండి 4000 రూపాయలకు పెంచుతామని నేటికీ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న పెంచుతామన్న పెన్షన్లు పెంచకపోవడం దారుణమని ఆయన అన్నారు. ఆగస్టు 13న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే చేయూత పింఛన్ దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధికార ప్రతినిధి పేరెల్లి బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ హమ్మద్ ఖాన్, సీనియర్ నాయకులు చెక్క లక్ష్మణరావు, వెంకటయ్య, ప్రదీప్, గోపి, శివ, అబ్బాస్, వేణు, సతీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్, మోదీ విధానాలతో దేశ ప్రజలకు ప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: అమెరికా అధ్యక్షులు ట్రంప్ పెడుతున్న ఆంక్షలను తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రధాని మోదీ సామ్రాజ్యవాదానికి అతిపెద్ద బానిసగా వ్యవహరిస్తున్నాడని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు విమర్శించారు. శనివారం మెదక్‌లో సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. సాయిబాబా మాట్లాడుతూ ట్రంపు మోడీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు దేశ ప్రజలకు ప్రమాద ఘంటికలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గాన్ని బానిసల్ని చేయడం కోసమే మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తుంది. డబుల్ ఇంజన్ సర్కార్లతో పాటు విపక్ష రాష్ట్ర ప్రభుత్వాలు సైతం మద్దతు తెలుపుతూ లేబర్ కోడ్లు అమలు చేసేందుకు పని గంటలు పెంచుతూ జీవోలు జారీ చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని 10 ఏళ్ల టీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కనీస వేతనాలు పెంచకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7-9 తేదీలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు మెదక్ జిల్లా కేంద్రంలో జరగనున్నాయి. కార్మిక పోరాటాలకు శక్తిని, ఆక్సిజన్, సత్తువను ఇచ్చే ఉమ్మడి మెదక్ జిల్లా ఐదవ రాష్ట్ర మహాసభలకు అతిధ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సిఐటీయు అంటే ఒక సంఘం కాదని దేశంలోని అన్ని కార్మిక సంఘాల్ని సంఘటన చేసే శక్తి అని ఆయన పేర్కొన్నారు. గత మూడేళ్ల కాలంలో ప్రజలు, కార్మికుల ఆర్థిక సామాజిక పరిస్థితులు ఏమిటి అనేది మాహాసభల్లో చర్చించి పోరాట కర్తవ్యాలు నిర్దేశించుకుంటామని అన్నారు. జెండాలు ఎన్ని ఉన్నా కార్మిక వర్గానికి సిఐటీయు జెండా మాత్రమే అండగా నిలుస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఆర్ది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజా సంఘాల నాయకులు బి. మల్లేశం, జీ.సాయిలు, కే. రాజయ్య, జయరాజు, మాణిక్యం, మల్లారెడ్డి, గోపాల స్వామి, ఎల్లయ్య, భాస్కర్, బాలమణి, నర్సమ్మ, కే. మహేందర్ రెడ్డి, మల్లేషం, నాగరాజు, సంతోష్, కృష్ణ, పాండురంగారెడ్డి, భాగారెడ్డి, బండ్ల స్వామి, టీఎస్జీట జిల్లా అధ్యక్షులు నరేందర్, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన సీపీఐ ఖమ్మం జిల్లా మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : సిపిఐ ఖమ్మం జిల్లా 23వ మహాసభలు శనివారం పోటుప్రసాద్ నగర్(రెడ్డి గార్డెన్స్) లో ఘనంగా ప్రారంభమయ్యాయి. 20 మండలాలతో పాటు ఖమ్మం నగరం, మూడు మున్సిపాలిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ 600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రతినిధులంతా ఎర్రచొక్కాలు, ఎర్ర చీరలు ధరించి రావడంతో మహాసభ ప్రాంగణం అరుణ వర్ణాన్ని పులుముకుంది. ఉదయం 8 గంటల నుండే ప్రతినిధుల నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. మహాసభలో ప్రారంభ సూచికగా సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్సి పువ్వాడ నాగేశ్వరరావు అరుణపతాకాన్ని ఆవిష్కరించగా, అమరవీరుల స్మారక జ్యోతిని మహ్మద్ మౌలాన జోహార్ జోహార్ అనే నినాదాల నడుమ ప్రారంభించారు. గత మహాసభలు జరిగిన వైరా నుండి అఖిలభారత యువజన సమాఖ్య కార్యకర్తలు అమర జ్యోతిని తీసుకురాగా, సిపిఐ నాయకులు ఆ జ్యోతిని అందుకున్నారు. మహాసభల ప్రారంభం కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్సి నెల్లికంటి సత్యం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా తదితరులు పాల్గొనగా, సంతాప తీర్మానాన్ని సిద్దినేని కరుణ కుమార్ ప్రవేశపెట్టారు. మహాసభల -ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా వ్యవహరించిన కర్నాటి రామ్మోహన్ రావు అధ్యక్షోపన్యాసాన్ని చేశారు. కార్యదర్శి నివేదికను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్టారు. సభ ప్రారంభానికి ముందు -అధ్యక్ష వర్గం తీర్మానాల కమిటీ మహాసభల స్టీరింగ్ కమిటి అర్హతల కమిటి మినిట్స్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతినిధుల ఆమోదాన్ని తీసుకున్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న సభల్లో తొలిరోజు పలు తీర్మానాలు ఆమోదం పొందాయి. వివిధ మండలాలు, పట్టణ బాధ్యులు కార్యదర్శి నివేదికపై చర్చల్లో పాల్గొన్నారు. అధ్యక్ష వర్గంగా జమ్ముల జితేందర్ రెడ్డి, మండడపు రాణి, అజ్మీరా రామ్మూర్తి, దొండపాటి రమేష్, మేకల శ్రీనివాసరావు, ఎంగల ఆనందరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘ అధ్యక్ష కార్యదర్శులు కర్నాటి రామ్మోహన్ రావు, కార్యదర్శి బెజవాడ రవి, బాధ్యులు ఊట్ల కొండలరావు, ఎంఎ రహీం పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలకు తరలిరావాలి

విశాలాంధ్ర - వనపర్తి : కీలకమైన సిపిఐ జిల్లా మహాసభలు జూలై 23 24 తేదీల్లో వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలో జరుగు తాయని జిల్లా నలుమూలల నుంచి నేతలు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటిసి జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీరామ్, పట్టణ కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. శనివారం వనపర్తి సిపిఐ ఆఫీసులో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేసిన అనంతరం పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడారు. 11 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతు ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోసం చేసిందన్నారు. ఆర్ గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రుణమాఫీ రైతు భరోసా తదితర పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పాలమూరు రంగారెడ్డి భీమా కేఎల్ఐ నెట్టెంపాడు కోయిల్ సాగర్ తదితర ప్రాజెక్టులు పూర్తి కాలేదని, పలు సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటిని సాధించేందుకు పోరాట రూపాలను మహాసభలో నిర్ణయించడం జరుగుతుందన్నారు. మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనం సాంబశివరావు వస్తున్నారని జిల్లా నేతలు కార్యకర్తలు ప్రజలు సానుభూతిపరులు శ్రేయోభిలాషులు జిల్లా నల్గొండ నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్మిక సభ్యులు కళావతమ్మ, సిపిఐ పట్టణ సహకార కార్యదర్శి గోపాలకృష్ణ, మాజీ సహాయ కార్యదర్శి ఎర్రకురుమన్న ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, లక్ష్మీనారాయణ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలకు ప్రతిరూపం దొడ్డ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : సామాన్య ప్రజల హృదయాలలో మట్టి మనిషిగా ఎదిగి మానవతా విలువలకు ప్రతిరూపంగా దొడ్డ నారాయణ రావు నిలిచారని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శనివారం నాడు నేరేడుచర్ల మండల కేంద్రంలో స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చిలుకూరు మాజీ ఎంపీపీ దొడ్డా నారాయణరావు సంతాప సభ నిర్వహించిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ధనుంజయ నాయుడు మాట్లాడుతూ సుమారు 39 సంవత్సరాలు ప్రజా ప్రతినిధిగా ఉన్నప్పటికీ ఏనాడు కూడా అవినీతికి తావులేని సపరిపాలన అందించేందుకు తన యావత్ జీవితం కృషి చేశారని, చిలుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ గా పనిచేసిన కాలవలు సుమారు 1400 ఎకరాల భూములను నిరుపేదలకు అందేలా కృషి చేసిన మహనీయుడి సంతాప సభ కార్యక్రమం ఈనెల 21వ తేదీ చిలుకూరులో ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏపీ సిపిఐ కార్యదర్శి రామకృష్ణ స్థానిక మంత్రివర్యులు నలమాధ ఉత్తమ కుమార్ రెడ్డి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్థానిక శాసన సభ్యురాలు నలమాద పద్మావతిరెడ్డి అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులు హాజరవుతున్నారన్నారు. సభకు సిపిఐ పార్టీతో పాటు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయవలసిందిగా ధనుంజయ నాయుడు కోరారు.కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి పట్టణ సిపిఐ కార్యదర్శి యల్ల బోయిన సింహాద్రి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్ ఏఐటీయుసి మండల అధ్యక్షుడు ఊదర వెంకన్న ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ కళమ్మ వాసు పాల్గొన్నారు.

ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : మండలంలోని కొరటికల్ గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు అంశాలను ఆమె స్వయంగా పరిశీలించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు, పదాలు చదివించారు. ఆపై హైస్కూల్ తరగతులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి, పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, వారి విషయావగాహన పరీక్షించారు. బోర్డు పరీక్షలకు ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి నోట్‌బుక్స్, యూనిఫాంలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వంట గదిని పరిశీలించి, వంట మనుషులు అనుభవం, భోజన మెనూ వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు శుచి, శుభ్రతలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. పాఠశాల ప్రాంగణంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. నీరు పోసిన కలెక్టర్, ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి పి. రామారావు, మండల ప్రత్యేక అధికారి రాజనర్సయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

సిఎంఆర్ నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: సిఎంఆర్ నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. రబీ 2023-24 సీఎంఆర్ డెలివరీ సంబంధించి నర్సాపూర్ లోని సాయికృష్ణ రైస్ మిల్లును పౌరసరఫరాల అధికారి నిత్యానందం, అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ అబ్దుల్ నిసార్‌తో కలిసి సీఎంఆర్ పెండింగ్‌పై పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రబీ (యాసంగి) 2023-24 సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 67 మిల్లులకు 2,52,013 మెట్రిక్ టన్నుల ధ్యానాన్ని కేటాయించడం జరిగిందన్నారు. ఇందుకుగాను మిల్లర్లు 1,70,791 మెట్రిక్ టన్నుల బియ్యానికిగాను 1,64,826 మెట్రిక్ టన్నుల బియ్యం, (96.51%) ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 5,965 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో అనగా ఈనెల 27 తేదీలోపు డెలివరీ చేయాలన్నారు. లేనిచో సదరు మిల్లులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైస్ మిల్లర్ యజమానులు, సివిల్ సప్లై అధికారులు సమన్వయంగా పని చేసి నిర్ణీత గడువులోగా సీఎంఆర్‌ను డెలివరీ చేయాలని ఆదేశించారు.

పాల్వంచ డిఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని పాల్వంచ పట్టణ కేంద్రంలో ఉన్న డిఎస్పి కార్యాలయాన్ని ఎస్పీ రోహిత్ రాజు శనివారం సందర్శించినారు. ఈ సందర్భంగా ఆయన సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరా లను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిం చాలని సూచించారు. సబ్ డివిజన్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎటువంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డిఎస్పి కార్యాలయ పరిసరాలను పరిశీ లించి కార్యాలయ ఆవరణలో ఎస్పీ మొక్కలను నాటారు. డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, పాల్వంచ అశ్వరావుపేట సిఐలు సతీష్, నాగరాజు రెడ్డి, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యమ నాయకురాలు మంజులను ఆదుకోవాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : విద్యార్థి దశ నుంచే అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొని అలుపెరుగని జీవితాన్ని కొనసాగిస్తున్న నాయకురాలు జాడి మంజుల తీవ్ర అనారోగ్యంతో మంచాల పద్దారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రైటర్ బస్తి ఏరియాలో భర్త జంపన్నతొ నివాసముంటు న్నారు. పేద కుటుంబానికి చెందిన దళిత ఉద్యమకారిణి అయినా మంజుల కుటుంబం ఆర్థికంగా అంతగా లేకపోవడంతో చికిత్స కోసం ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటుంది. గత కొంత కాలంగా గుండె, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు భర్త జంపన్న తెలిపారు. మంజుల చిన్న తనం నుండే ఉద్యమాల్లో చాలా చురుకుగా వుంటూ చదువుల్లో కూడా మంచి విద్యార్థినిగా వుంటూ పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశారు. విద్యార్థి సంఘం పిడిఎస్‌యులో సుదీర్ఘ కాలం పనిచేసి, ప్రస్తుతం పి ఓ డబ్ల్యు మహిళా సంఘంలో పనిచేస్తు న్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జిల్లాలో జరిగిన అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆమె తనదైన ముద్ర వేసుకున్నారు. ఉద్యమ నేత జంపన్నను ఆమె పెళ్లి చేసుకున్నారు. జంపన్న జర్నలిస్ట్‌గా కొత్తగూడెంలో పని చేస్తున్నారు. వీరికి బాబు పుట్టిన తర్వాత ఈ సమస్య ఉత్పన్నమైందని చెప్తున్నారు. భర్త జంపన్న, కొందరు బంధువులు కలిసి చేతనైన కాడికి వైద్యం చేయిస్తున్నారు. వైద్యానికి స్తోమత లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. నెల క్రితం టీఎన్జీవో అధ్యక్షులు, ఉద్యమ కారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య ఈ విషయం తెలిసి వెంటనే స్పందించి హైదరాబాద్‌లో ఉన్న మహావీర్ హాస్పిటల్‌కు స్వయంగా దగ్గర ఉండి పంపించారు. మీడియా మిత్రులు అందరూ ఈమధ్య ఆర్థిక సహాయం కొంత అందించారు. తనకు సహాయం అందించిన ప్రతి వారికి మంజుల కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ లోని మహావీర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన చికిత్స కోసం తోటి ఉద్యమ మిత్రులు, శ్రేయోభిలాషులు, సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సాయం చేయదలచిన వారు ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ కొండా జంపన్న-మంజుల 9640542368, 9704732305 కి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగుజిల్లాలోని ట్రాన్స్ జెండర్లకు సంక్షేమం కొరకు నిరుద్యోగులైన ట్రాన్స్‌జెండర్లకు, తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు రంగ సంస్థల్లో ఉపాధి కల్పించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ములుగు జిల్లా సంక్షేమ అధికారి టి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వివిధ రంగాలలో అనగా డ్రైవింగ్, ఫోటో అండ్ వీడియోగ్రఫీ, బ్యూటీషియన్, జనపనార సంచుల తయారీ, టైలరింగ్, లాజిస్టిక్స్ తదితర రంగాలలో నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న ట్రాన్స్‌జెండర్లకు ఈనెల 23లోగా ఆన్లైన్‌లో గల డిపార్టుమెంటు వెబ్‌సైట్ http://wdsc.telangana.gov.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్తగూడెం...

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా నూతన ఆవిష్కరణలు చేస్తున్న క్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆల్ ఇండియా రేడియో కొత్తగూడెం కేంద్రం ద్వారా ప్రత్యక్ష ప్రసారంలొ వివరించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి వినూత్న ఆలోచనతో, ప్రజలతో నేరుగా పరస్పర చర్య కోసం ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8:30 గంటల నుండి 9:30 గంటల వరకు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలకు లైవ్ ఫోన్ కాల్‌ల ద్వారా కలెక్టర్‌తో నేరుగా మాట్లాడే అవకాశాన్ని కల్పించడంతో వివిధ మండలాల నుంచి ఎన్నో ప్రశ్నలు, అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. ప్రజలు ఆరోగ్యం, విద్య, గ్రామీణ రహదారులు, తాగునీటి సమస్యలు, రేషన్ కార్డుల జారీ, పెన్షన్ జాప్యం, వ్యవసాయ సవాళ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి కీలక అంశాలను కలెక్టర్ తొ ప్రస్తావించారు. కలెక్టర్ ప్రతి అంశాన్ని ఓపికగా, ఆసక్తిగా వినడంతోపాటు సమస్యలపై తక్షణ స్పందన ఇవ్వడం గమనార్హం. ప్రజలతో నేరుగా మాట్లాడే ఈ తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందిస్తామని స్పష్టం చేసారు. వ్యవసాయం వ్యర్థం కాదని, అది జీవనాధారం అని కలెక్టర్ స్పష్టం చేశారు. యువత అందరూ ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా ఉన్న భూములను సద్వినియోగం చేసుకుంటూ ఆయిల్ ఫామ్, మునగ సాగు, చేపల పెంపకం వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ హెడ్ కోలిపాక శంకర్ రావు, సిబ్బంది ప్రభాకర్, ఆనంద్, సుమన్, కోటేశ్వర రావు, కట్ట రామకృష్ణ, శ్రీనివాస్, మహిళా రేడియో జాకీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానాల్లో అన్ని పోస్టులు భర్తీ చేసాం...

విశాలాంధ్ర - భద్రాచలం : ఏజెన్సీలోని వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో వున్నా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టులు భర్తీ చైతన్య కాకుండా ఔషధాలు కూడా అందుబాటులో ఉంచామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది, నిర్వహణ పనితీరు చాలా బాగుందన్నారు. శనివారం తన ఛాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఏజెన్సీ ఏరియాల్లోని ఆసుపత్రుల పనితీరుపై ఆయన చర్చించారు. భద్రాచలం, పాల్వంచ, చర్ల, మణుగూరు, ఇల్లందు, బూర్గంపాడు, అశ్వరావుపేట సి హెచ్ సి లలో అన్ని రకాల వైద్య పరీక్షలకు డాక్టర్ల నియామకం జరిగిందన్నారు. అందులో పనిచేసే డాక్టర్లు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని కొనియాడారు. అన్ని డిసీజులకు సంబంధించిన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి చాలావరకు గ్రామాలలో వ్యాధుల తీవ్రత తక్కువగా ఉందని గుర్తించామన్నారు. పీహెచ్సీలు, సిహెచ్‌సిలలో డయాలసిస్ ట్రీట్మెంట్‌తో పాటు నార్మల్ డెలివరీలు అయ్యేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రతిరోజు ఓపికి సంబంధించిన పేషెంట్ల వివరాలు తప్పనిసరిగా రికార్డులలో పొందుపరచాలన్నారు. డిసిహెచ్ఎస్ రవిబాబు మాట్లాడుతూ త్వరలో చర్ల సిహెచ్ లో కొత్తగా ఆపరేషన్ థియేటర్ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని తప్పకుండా రావాలని పిఓ రాహుల్ ను కోరారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరిడెంట్ రామకృష్ణ, ఆర్ ఎం ఓ సంతోష్, నర్సింగ్ పర్యవేక్షకురాలు యశోదా, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు ప్రభుత్వాసుపత్రిలోని కాన్పులపై ప్రత్యేక శ్రద్ధ

విశాలాంధ్ర - ఇల్లందు: ఈ మధ్య కాలంలో ఇల్లందు ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఈ క్రమంలోనే కరకగూడెం మండలం మద్దెల గూడెంకి చెందిన చీమల లావణ్య ప్రసవం కోసం పుట్టినిల్లు ఇల్లందు మండలం సుదిమళ్ల కి వచ్చింది. నొప్పులతో ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం చేరారు. ఆమెను పరీక్షించిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ప్రియాంక నార్మల్ డెలివరీ చేసి మగ బిడ్డకి పురుడు పోశారు. అయితే మొదటి కాన్పు ఆపరేషన్ కాగా రెండో కాన్పు నార్మల్ డెలివరీ అవడం పట్ల అందుకు వైద్యులు, వైద్య సిబ్బంది చొరవ చూపడం వల్లే ఇలా సాధ్యమైందని అభినందనలు వ్యక్తమౌతున్నాయి. సాధారణంగా మొదటి కాన్పు ఆపరేషన్ చేస్తే రెండోవ కాన్పు కూడా ఆపరేషన్ చేస్తారనే వాదనలు వున్నాయి. కానీ ఇల్లందు వైద్యులు, సిబ్బంది ఆపరేషన్ లేకుండా రెండో కాన్పు సుఖప్రసవం చేయడం తొ తొలగిపోయాయి. చొరవ తీసుకుని నార్మల్ డెలివరీకి కృషి చేసిన డాక్టర్ ప్రియాంక, నర్సింగ్ ఆఫీసర్ అనూష లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, డిసిఎచ్ఎస్ డాక్టర్ రవి బాబు అభినందించారు.

వంశీకృష్ణకు రూ.50 వేల ఆర్థిక సాయం : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : పేదింటి విద్యార్థికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కెరమెరి మండలం నిషాని గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి కుమారుడు ఆత్రం వంశీకృష్ణకు చెన్నై లో ఐ ఐ టి సీటు వచ్చినందున ఉన్నత చదువుల కోసం 50 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలలో చదివి అత్యున్నత విద్యాసంస్థ చెన్నై ఐ ఐ టి లో సీటు సంపాదించడం గర్వకారణం అని, గిరిజన యువతకు ఆదర్శనీయమని. వంశీకృష్ణ చదువులో మరింత రాణిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: మంత్రి దనసరి అనసూయ, సీతక్క ఆదేశాల మేరకు గోవిందరావు పేట మండల కేంద్రంలోని సోమలగడ్డ పి.ఎస్.ఆర్. గార్డెన్స్ యందు శనివారం గోవిందరావుపేట, చల్వాయి, పసర, లక్నవరం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స తీసుకున్న 16 మందికి, మందుల ఖర్చుల నిమిత్తం, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన చెక్కులు పంపిణీ చేసిన్నట్లు, కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులపై డాకుల అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల, మహిళా, యువనాయకులు, కార్యకర్తలు, గోవిందరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషనే ప్రధానాంశం

ప్రతి ఎన్నికల్లోనూ ఏదో ఒక అంశం ప్రధానంగా చర్చలోకి వస్తూ ఉంటుంది. ఈ అంశాన్ని అధికార పక్షం లేదా ప్రతిపక్షాలు ప్రస్తావించవచ్చు. కానీ మరో రెండున్నర నెలల్లోగా బిహార్ శాసనసభ ఎన్నికల వాతావరణం ఇప్పటి నుంచే వేడెక్కింది. అయితే ఇదివరకటి లాగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశమేదీ చర్చకు రావడం లేదు. ఓటర్ల జాబితా తయారీ, ఆ జాబితా సిద్ధం చేసే బాధ్యత ఉన్న ఎన్నికల కమిషన్ బీహార్ శాసనసభ ఎన్నికలలో ప్రధానాంశం అయిపోయింది. బీహార్ మొదటి నుంచి మండల్ రాజకీయాలకు వేదిక. ఈ ప్రాతిపదిక మీదే కుల సమీకరణలూ ఉంటాయి. కుల సమీకరణలను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో బీజేపీ ఆరితేరి పోయింది. బీజేపీకి అత్యంత ప్రీతిపాత్రమైన మతతత్వమూ ఉండనే ఉంది. కానీ ఇవేవీ ప్రధాన సమస్యలుగా లేవు. ఓటర్ల జాబితా సిద్ధం చేయడంలో ఈ సారి ఎన్నికల కమిషన్ వినూత్న విధానాన్ని అనుసరిస్తోంది. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చాలని ప్రయత్నించే వారు అసలు వారు భారత పౌరులా కాదా అని తేల్చే పనిని ఎన్నికల కమిషన్ నెత్తికెత్తుకుంది. ఎన్నికలను నిర్వహించడం, పర్యవేక్షించడం, సమన్వయ పరచడం మాత్రమే ఎన్నికల కమిషన్‌కు ఉన్న రాజ్యాంగ నిర్దేశం. కానీ ఎన్నికల కమిషన్ కూడా మోదీ సర్కారు జేబు సంస్థగా మారిపోయింది కనక పౌరులు ఎవరు కాని వారు ఎవరు అని తేల్చే పనిలో పడింది. పౌరులెవరో నిర్ణయించే అధికారం కేంద్ర హోం శాఖ పరిధిలోకి వస్తుంది. అయినా ఎన్నికల కమిషన్ ఈ బాధ్యత తీసుకుంది. పౌరులెవరో నిర్ణయించడానికి ఎన్నికల కమిషన్ అడుగుతున్న పత్రాలు సైతం వివాదాస్పదంగా తయారైనాయి. ఓటర్ల నమోదు కార్యక్రమం వచ్చే 25వ తేదీ నాటికి పూర్తి కావాలి. ఆ తరవాత జాబితా తయారవుతుంది. అభ్యంతరాలు, ఆక్షేపణలు పరిశీలించి తుది జాబితా సిద్ధం చేయాల్సి ఉంటుంది. జనం తమ పేర్లు నమోదు చేయించుకోవడానికి ఈ సారి రెండు ఫారాలు నింపాల్సి ఉంటుంది. ఇదీ కొత్త సూత్రమే. అయితే చాలా మందికి ఒకే పత్రం అందిందనీ, ఓటర్ల తరఫున చాలా మంది పేర్లను ఓటర్ల జాబితా తయారు చేసే సిబ్బందే నింపేస్తున్నారని, సంతకాలు కూడా వారే చేసేస్తున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఈ వాస్తవాలను సాక్ష్యాలతో సహా బయట పెట్టిన ప్రసిద్ధ పత్రికా రచయిత అజిఅంజుం మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఎన్నికల సంఘం తన అసలు రంగు బయటపెట్టుకుంది. మరి కొన్ని పత్రికలు కూడా జరుగుతున్న అవకతవకలను ఎండగట్టాయి. వాటి మీద ఏం చర్య తీసుకుంటారో తెలియదు. వాస్తవాలు బయట పెట్టే వారి మీద చర్య తీసుకోవడం ఎటూ అంతిమంగా వీగిపోతుంది. కానీ పౌరులెవరో, కానివారెవరో తేల్చడానికి ఎన్నికల కమిషన్ తరఫున పని చేసే సిబ్బంది పూర్తి చేసే అవకాశమే ఎక్కువగా ఉంది. బీహార్‌లో ఎన్డీయే కూటమి గెలవడం మోదీ పలుకుబడికి చాలా అవసరం. ప్రస్తుతం బీజేపీ అక్కడ నితీశ్ కుమార్ నాయకత్వంలోని జేడీ(యూ)తో కలిసి అధికారంలో ఉంది. ఎవరి మద్దతూ లేకుండా బీజేపీ సంపూర్ణ మెజారిటీ సాధించాలన్నది మోదీ నాయకత్వంలోని బీజేపీ లక్ష్యం. ఈ క్రమంలో నితీశ్ నేతృత్వంలోని జేడీ(యు) అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేయడానికి బీజేపీ ఏ మాత్రం సంకోచించదు. వివిధ రాష్ట్రాలలో తాము పొత్తు పెట్టుకున్న స్థానిక పార్టీలను విచ్ఛిన్నం చేయడం, చిందరవందర చేయడం, ఆ పార్టీలను చీల్చడంలో బీజేపీ ఆరితేరి పోయింది. గత శాసనసభ ఎన్నికలలోనే నితీశ్ పార్టీ గణనీయంగా బలహీన పడడానికి బీజేపీ కుటిల రాజకీయాలే కారణం. నితీశ్ కుమార్ పిల్లి మొగ్గల వ్యవహారం ఎట్లా ఉన్నా ఆయన లేకపోతే బీజేపీ నావ గట్టెక్కడమూ సులభ సాధ్యమేమీ కాదు. ఇప్పటికే 7.11 కోట్ల ఫారాలు అందాయని ఎన్నికల కమిషన్ చెప్తోంది. ఇదివరకు ఉన్న ఓట్లర్లలో 36.86 లక్షల మంది పేర్లను తొలగించేశామని ఇది మొత్తం ఓటర్లలో 4.67 శాతం అని కమిషన్ అంటోంది. ఇందులో మృతి చెందిన వారు, శాశ్వతంగా బీహార్ వదిలిపోయిన వారు, అనేక చోట్ల ఓటర్ల జాబితాల్లో పేర్లు ఉన్న వారు ఉన్నారట. మృతుల విషయం వదిలేస్తే మిగతా రెండు వర్గాల వారిని తేల్చడంలో ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించిందని చెప్పడానికి వీలు లేదు. ముసాయిదా జాబితాను ఆగస్టు ఒకటిన ప్రచురిస్తారు. ఆ తరవాత అభ్యంతరాలు, ఆక్షేపణలు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ అంతా సెప్టెంబర్ 25 కు పూర్తి అవుతుందట. జాబితా ఆ తరవాత వారం రోజుల్లోగా వెల్లడిస్తారట.

పౌరసత్వ అంశాన్ని నిర్ధారించే బాధ్యతను ఎన్నికల కమిషన్ తలెత్తుకోకుండా ఉంటే ఈ వ్యవహారం అంతా ప్రశాంతంగా జరిగిపోయేది. ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమేదో ప్రధానాంశంగా చర్చకు వచ్చేది. ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న వైఖరి పౌరసత్వాన్నే కాక ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ అంశం సుప్రీంకోర్టు దాకా వెళ్లింది. అయితే సుప్రీంకోర్టు ఓటర్ల జాబితా సవరణను నిలిపి వేయలేదు. నిజానికి ఎన్నికల కమిషన్ వైఖరిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన వారు నిలిపి వేయాలని కోరలేదు. పిటిషనర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలన్నింటికీ ఎన్నికల కమిషన్ తక్షణం సమాధానం చెప్పే స్థితిలో ఉండాల్సింది. అలా లేనందువల్ల ఈ అంశాన్ని వచ్చే 28వ తేదీన మళ్లీ విచారించనుంది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న దాఖలాలు లేవు. అందువల్ల ప్రతిపక్షాల అభ్యంతరాలేమైనప్పటికీ ఓటర్ల జాబితా మోదీ సర్కారు సైగల మేరకు సిద్ధమై పోతుంది. విదేశీయులు అక్రమంగా బీహార్‌లోకి ప్రవేశించారు. కనక వారిని ఏరి వేయాలన్నది మోదీ సర్కారు వ్యూహం. నిజానికి అలా జరిగి ఉంటే ఏరివేయడాన్ని అభ్యంతర పెట్టలేం. కానీ బీజేపీ అసలు లక్ష్యం అక్రమంగా ప్రవేశించిన వారి సాకుతో ముస్లిం ఓటర్ల మీద వేటు వేయడమే. పౌరసత్వ నిర్ధారణకు ఎన్నికల కమిషన్‌కు అధికారం ఉందో లేదో అన్న అంశాన్ని సుప్రీంకోర్టు ఏ మేరకు పరిగణిస్తుందో లేదో ఇప్పుడే చెప్పలేం. పౌరసత్వ నిర్ధారణ బాధ్యత ఎన్నికల కమిషన్‌ది కాదు అన్న మాట సుప్రీంకోర్టు నోట వినిపించకపోతే భవిష్యత్తులో ప్రజాస్వామ్యం గాఢాంధకారంలో మునిగిపోతుంది. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని దేశమంతటా చేపడ్తారట. సరిహద్దులో ఉన్న రాష్ట్రాలలో పౌరులెవరో నిర్ధారించే పని కొనసాగితే ఇబ్బందులు తప్పవు. మిగతా చోట్ల పౌరసత్వ నిర్ధారణ ప్రధానాంశం కాకపోవచ్చు.

నిబద్ధత గల ప్రజా సేవకుడు
దొడ్డ నారాయణరావు

సిద్ధాంత నిబద్ధత, ఆచరణీయత, అణకువ, నిరాడంబరత అనే నాలుగు గుణాల కలయికకు ప్రతీక దొడ్డ నారాయణరావు. దాదాపు ఏడున్నర దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు కార్యకర్తగా, ప్రజా ప్రతినిధిగా, నాయకునిగా సమాజ సేవకు, ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని హెచ్చిస్తూ నిరంతరం ప్రజా సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తు ప్రజా సేవయే పరమావధిగా పాటుపడిన నాయకుడు నారాయణరావు. దొడ్డ నారాయణ రావు సమాజ సహజ మిత్రులు. తన నడవడిక ద్వారా, సిద్ధాంత నిబద్ధత వల్ల, తన ఆచరణాత్మక జీవన విధానం ద్వారా అన్ని పార్టీల వారికి, సకల వర్గాల వారికి గౌరవనీయులుగా స్థానం పొందారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంత నిబద్ధతతో, పార్టీ నియమావళిని తూ.చ. తప్పక పాటిస్తూ, సాదాసీదా జీవనంతో నిరంతరం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ... పరిష్కార మార్గాన్ని చూపించిన మహనీయుడు. అందుకే నేటి కమ్యూనిస్టు కార్యకర్తలకు, యువతకు మార్గదర్శి. తన సుదీర్ఘ పార్టీ ప్రయాణంలో కనబరిచిన ఉద్యమతీరు, పాటించిన వ్యవహారాలు ఆచరించి చూపిన మహా వ్యక్తి. అందుకే నేటి యువతరానికి మార్గదర్శకుడు.

కుటుంబ నేపథ్యం: ఉమ్మడి నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకా లోని చిలుకూరు గ్రామంలో దొడ్డ నారాయణరావు ఒక సామాన్యమైన పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన వారు. వీరి తండ్రి దొడ్డ అప్పయ్య గారికి ఎనిమిది మంది సంతానం. నారాయణ రావు ఆరవ సంతానం. స్వగ్రామంలో ప్రాథమిక పాఠశాలలోనే 4 వ తరగతి వరకు చదువు కున్నారు. వీరి భార్యా సక్కుబాయి గత సంవత్సరమే మృతిచెందారు. వీరికి ముగ్గురు కుమారులు వారు రమేష్, సురేశ్, శ్రీధర్. వీరు తండ్రి బాటలోనే నడుస్తున్నారు. నారాయణరావు మూడవ అన్న, మాజీ శాసన సభ్యులు దొడ్డ నర్సయ్య గారు తెలంగాణ సాయుధ పోరాటంలో దళ కమాండర్‌గా ప్రముఖ పాత్ర పోషించారు.

రాజకీయ ప్రస్థానం: 1941లో 8వ ఆంధ్ర మహాసభ రావి నారాయణ రెడ్డి గారి అధ్యక్షతన చిలుకూరులో జరిగినది. ఆ ప్రాంతంలో భూస్వాము లకు, జాగీర్‌దారి, పెత్తందారి, దొరల ఆగడాలకు, బలవంతపు లేవిగళ్ల, శిస్తువసూళ్లకు, వ్యతిరేకంగా దున్నేవానికి భూమి కావాలని, వెట్టిచాకిరి విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ పిలుపులో పాల్గొంటూ చురుకైన పాత్ర పోషించారు. నిజాం రాచరిక వ్యవస్థకు, రజాకార్ల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపుతో 1947 నుంచి 1951 వరకు వారి సోదరుడు దొడ్డ నర్సయ్య గారితో కలిసి సాయిధ పోరాటంలో కొరియర్‌గా పాల్గొన్నారు. స్వాతంత్రానంతరం ఇండియన్ యూనియన్ సైన్యం, పోలీసులు కమ్యూనిస్టు దళాలపై తీవ్రమైన నిర్బంధాన్ని, అరెస్టులు చేపడుతున్న సందర్భంలో రహస్యంగా కృష్ణ పట్టి ప్రాంతంలో అటు నుంచి అమరవాది అడవులలో సంవత్సరంపాటు గడుపుతూ...1951లో సెప్టెంబర్‌లో సాయుధ పోరాటం విరమిస్తున్న సందర్భంలో వారు సత్తెనపల్లి ప్రాంతానికి వెళ్లి 1952 ఎన్నికల్లో ఆనాడు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

1962లో ఇండియా- చైనా యుద్ధ సందర్భంలోనూ అరెస్టు అయ్యారు. కమ్యూనిస్టు ఉద్యమం చీలిన సందర్భంగా(1964-67) కొంతకాలం సీపీఎంతోను, ఆటు తర్వాత సీపీఐ ఎంఎల్ (1968-71)తోను, సీపీఐ ఎంఎల్ నుంచి విడిపోయి హుజూర్ నగర్ ప్రాంతీయ కమ్యూనిస్టు పార్టీ (1971-73 వరకు) నడుపుతూ,1974 లో దొడ్డ నర్సయ్య గారితో పాటు హుజూర్‌నగర్ ప్రాంతీయ కమిటీ సభ్యులు మొత్తం సీపీఐ లో చేరారు. సీపీఐ హుజూర్‌నగర్ తాలూకా కార్యవర్గ సభ్యులుగా, కోదాడ తాలూకా కార్యదర్శిగా (1983-86) బాధ్యతలో ఉన్నారు. నిజాం సాయుధ పోరాటంలోనూ, దేశ స్వాతంత్ర పోరాటంలోనూ చురుకైన పాత్ర పోషించినందుకు వారిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి స్వాతంత్ర్య సమరయోధు లుగా కేంద్ర ప్రభుత్వం పెన్షన్ అందిస్తున్నది. తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల స్మారక ట్రస్టు సభ్యులుగా పనిచేశారు. ప్రజా జీవితం :పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన 1959 నుంచి 1984 వరకు 25 సంవత్సరాలు చిలుకూరు గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించారు. కోదాడ సమితికి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. మండల వ్యవస్థ ఏర్పాటు కాగానే చిలుకూరు మండలానికి అధ్యక్షులుగా ఎన్నికై రెండు టర్మ్‌లు సేవలందిం చారు. పార్టీలో నిర్వహించిన బాధ్యతలు: దొడ్డ నారాయణ రావు సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శిగా (1998-2001), నల్గొండ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా (2001-2009), నల్లగొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా(1995-98), సీపీఐ నల్లగొండ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా 2014 వరకు కొనసాగారు. మండలం, గ్రామాల అభివృద్ధి కొరకు నిరంతరం సేవలందించారు. దొడ్డ నారాయణ రావు గారు వయసురీత్యా స్వచ్ఛందంగా పార్టీ ప్రజా సంఘాల్లో ఉన్న బాధ్యతల నుంచి తగ్గారు. 1985లో రాష్ట్ర ప్రభుత్వ పిలుపుతో నిరక్షరాస్యత నిర్మూలన... అందరికి విద్య చదువువెలుగు కార్యక్రమాలలోను, మద్యపానం... ఆరోగ్యానికి హానికరం అంటూ మద్యాన్ని సేవించకండి... ఆరోగ్యాన్ని నాశనం చేసుకోకండి అంటూ విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఉత్తమ కమ్యూనిస్టు, నీతి నిజాయితీకి నిలువుటద్దం, సౌమ్యుడు, స్నేహశీలి... నిరంతరం ప్రజా శ్రేయస్సు కొరకు పాటుపడుతున్న వ్యక్తి దొడ్డ నారాయణరావు. ఆయన ఆదర్శవంతమైన జీవితం గడిపారు. దొడ్డ నారాయణరావు గారు అనారోగ్య కారణంగా జులై 11న (96) తుది శ్వాస విడిచారు. జులై 21 సోమవారం దొడ్డ నారాయణరావు గారి సంస్మరణ సభ చిలుకూరు గ్రామంలో నిర్వహిస్తున్నారు.

ఉజ్జిని రత్నాకర రావు

సీపీఐ సీనియర్ నాయకులు, సెల్: 490952646

రాష్ట్రంలో కరువు ఛాయలు కమ్ముకుంటున్నాయా!

కేవీవీ ప్రసాద్
ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

రాష్ట్రంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాగే నైరుతీ రుతుపవనాలు వ్యవసాయానికి అత్యంత కీలకం. వర్షాకాలంలో అత్యంత కీలకమైన జులై మాసం వేసవి ఎండలను మరిపిస్తోంది. 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదౌతూ అన్నదాతలను కలవరపెడుతోంది. దాదాపు 14 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. 7 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదై రాష్ట్రంలో కరువు ఛాయలు అలుము కుంటున్నాయి. మరో 10 రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే ఇప్పటివరకు వేసిన పంటలు పూర్తిగా ఎండుముఖం పట్టే అవకాశాలే ఎక్కువ.

ఈ పరిస్థితిలో వాతావరణశాఖ ప్రకటనతో రైతుల్లో ఆశలు చిగురుస్తు న్నాయి. రాజస్థాన్, జార్ఖండ్, బీహార్ పరిసరాల్లో ఏర్పడిన వాయుగుండం, అల్పపీడన ప్రభావంతో మన రాష్ట్రంలో సైతం చెదురుమదురు నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. అయితే వాతావరణం మాత్రం ఎండలతో మండిపోతూ ఉక్కపోత కొనసాగుతోంది. రోజు కమ్ముకుంటున్న మేఘాలను చూసి రైతులు ఆశగా ఆకాశం వైపు చూడటం కొద్దిసేపటికే మేఘాలు మాయం కావటంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో అన్నదాతలు అనేక గ్రామాల్లో కనిపించని దేవతలకు మొక్కుతూ పూజలు చేస్తున్నారు. వానమ్మ వానమ్మ వానమ్మో! ఒక్కసారన్నా వచ్చిపోవే వానమ్మ అంటూ ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో తమ ఇష్ట దైవాలకు పూజలు చేస్తున్నారు. కప్పలతో ఊరేగింపులు, సామూ హిక వనవాసాలుచేస్తూ పాత కాలపు ఆచారాలనే నమ్ముతూ వర్షాలు కురవకపోతాయా అని ఆశగా ఎదురుచుస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే ఈ సంవత్సరం వర్షాలు కురిసి వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందని వాతావరణశాఖ పేర్కొంది. అనుకున్న ప్రకారమే మే 24న కేరళను నైరుతీ రుతుపవనాలు 8 రోజులు ముందుగానే తాకాయి. మే 26న మన రాష్ట్రంలో ప్రవేశించడంతో రైతులు ఆనందంతో వ్యవసాయ పనులు ప్రారంభించారు. అయితే నైరుతి రుతుపవనాలు ముఖం చాటేయటంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యవసాయానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులు ముఖ్యంగా మెట్ట వ్యవసాయం సాగించే రాయలసీమ, ప్రకాశం తదితర జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాభావంతో దుక్కులు దున్నటం, విత్తనాలు ఎండబెట్టడం లాంటి పనులు సాగలేదు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయటం ఆలశ్యమైంది. రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. 14 జిల్లాల్లోని సుమారు 400 మండలాలకు పైగా " డ్రై స్పెల్స్" ఏర్పడ్డాయని తెలుస్తున్నది.

జూన్ 1 నుంచి జులై 17 వరకు 166.9 మి.మి. వర్షపాతం నమోదు కావాల్సి ఉంటే నమోదైంది కేవలం 112.68 మి.మీ. మాత్రమే 32.49 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 14 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. కడప జిల్లాలో 61.93 శాతం, అన్నమయ్య జిల్లాలో 56.26 శాతం, చిత్తూరు జిల్లా 26.31, శ్రీ సత్యసాయి జిల్లాలో 57.72, తిరుపతి జిల్లాలో35.96, నంద్యాల జిల్లాలో 28.71, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 54.57, పల్నాడు జిల్లాలో 56.16, గుంటూరు జిల్లాలో46.69, పశ్చిమగోదావరి జిల్లాలో 33.1, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 43.27, శ్రీకాకుళం జిల్లాలో 22.98, బాపట్ల జిల్లాలో 32.47 శాతం తక్కువ వర్షపాతం కురిసింది. దీంతో గత ఖరీఫ్ కాలంలో ఇప్పటి వరకు జరిగిన వివిధ పంటల సాగుకన్నా ప్రస్తుత సీజన్‌లో నంద్యాల, అనంతపురం, అన్నమయ్య, కడప, చిత్తూరు, పల్నాడు, బాపట్ల, గుంటూరు, కృష్ణా, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పంటల సాగు తగ్గింది. అయితే ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాల ప్రభావంతో మన రాష్ట్రంలో మానవ నిర్మిత దేవాలయాలుగా పేరొందిన శ్రీశైలం, తుంగభద్ర, నాగార్జునసాగర్, పులిచింతల, వెలిగోడు, సోమశిల, కండలేరు తదితర సాగునీటి ప్రాజెక్టులలో నీరు సమృద్ధిగా చేరటం కొంత ఊరట కలిగిస్తున్న మాట వాస్తవం. అయితే వాతావరణం అత్యధిక వేడిగా వుండటంతో ఆయా ప్రాజెక్టుల పరిధిలో కూడా సాగు ఆశాజనకంగా లేదు. కొన్ని ప్రాంతాల్లో పోసిన నారుమళ్లు ఎండు ముఖం పట్టాయి. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడే రైతులు ముఖ్యంగా మెట్ట వ్యవసాయం సాగించే రాయలసీమ, ప్రకాశం తదితర జిల్లాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాభావంతో దుక్కులు దున్నటం, విత్తనాలు ఎండబెట్టడం లాంటి పనులు సాగలేదు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు వేయటం ఆలశ్యమైంది. 2025 ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు 31.16 లక్షల హెక్టార్లుకాగా ఈ నెల 16వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 9.67 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 7.21 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగైంది. 2024 జులై 16 నాటికి అనేక పంటల సాగు విస్తీర్ణం 7.35 లక్షల హెక్టార్లు కాగా ప్రస్తుతం ఇప్పటి వరకు సాగైంది 7.21 లక్షల హెక్టార్లు. అయితే రాష్ట్రంలో వరి పంట గత ఖరీఫ్‌లో జులై16 నాటికి 2.81 లక్షల హెక్టార్లు సాగు జరిగితే ప్రస్తుత సీజన్‌లో ఇప్పటి వరకు 3.21 లక్షల హెక్టార్లలో సాగైంది. సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు సమృద్ధిగా ఉండటం మే నెల చివరిలో, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాల ప్రభావంతో వరిసాగు ప్రస్తుతానికి పెరిగింది. ఇది సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ ఆవశ్యతకను నొక్కి చెబుతున్నది. దశాబ్దాలుగా ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడాన్ని గమనించాల్సి ఉన్నది.

జిల్లాలవారిగా పంటల సాగు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో జులై 16 నాటికి గత సంవత్సరం కన్నా పెరిగింది. మిగిలిన జిల్లాలన్నింటిలో సాగు తగ్గింది. అదే విధంగా జొన్న, మొక్కజొన్న, రాగి, మిల్లెట్స్, ఉలవలు, కంది, శనగ, వేరుశనగ పంటలసాగు తగ్గింది. చెరకుసాగు గత కొన్ని సంవత్సరాలుగా గణనీయంగా తగ్గటాన్ని పరిగణలోకి తీసుకోవాల్సి ఉన్నది. నూనె ఉత్పత్తుల పంటల సాగు గత సంవత్సరం 1,38,394 హెక్టార్లలో జరిగితే ప్రస్తుతం 72,848 హెక్టార్లలో మాత్రమే సాగైంది. రాయలసీమ జిల్లాల్లో అత్యధికంగా సాగుచేసే వేరుశనగ సాగు గణనీయంగా తగ్గటం గమనించదగ్గ విషయం. గత సంవత్సరం జులై 1 నాటికి 1,20,689 హెక్టార్లలో సాగైతే ఈ ఏడాది 55,588 హెక్టార్లలో మాత్రమే సాగైంది.

రాష్ట్రంలో ఏర్పడిన వర్షాభావ పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. 14 జిల్లాల్లోని సుమారు 400 మండలాలకు పైగా " డ్రై స్పెల్స్" ఏర్పడ్డాయని తెలుస్తున్నది. 21 రోజులపాటు వరుసగా వర్షం పడకపోతే ఒక "డ్రై స్పెల్స్"గా గుర్తిస్తారు. ఈ నెలాఖరు వరకు వర్షాలు సక్రమంగా పడకుండా ఇదే పరిస్థితి కొనసాగితే మన రాష్ట్రంలో ఖరీఫ్ వ్యవసాయం ప్రమాదంలో పడినట్లే. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులపైన తద్వారా రైతుల ఆదాయం పైన ప్రతికూల ప్రభావం పడే అవకాశాలున్నాయి. ఈ స్థితిలో జులై 11న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్ రాయలసీమ జిల్లాల వర్షాభావ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ, శాశ్వత ఉపశమన చర్యలు చేపట్టేందుకు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఇండోనేసియా తరహా ఒప్పందంతో ముప్పే

ఎం కోటేశ్వరరావు

అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ విధించిన వాణిజ్య ఒప్పంద బెదిరింపు గడువు ఆగస్టు ఒకటవ తేదీ దగ్గరపడుతున్నది. ఏం చేస్తే దేశీయంగా ఏ పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందో అన్న ఆందోళనలో ప్రధాని నరేంద్రమోదీ ఉన్నారు. జులై 21వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. ఆపరేషన్ సిందూర్‌తో పాటు వాణిజ్య ఒప్పందం గురించి ప్రతిపక్షాలు నిలదీసే అవకాశం ఉంది. రెండు దేశాల లావాదేవీలలో పైచేయిగా ఉన్నా ఒకటికి పదిసార్లు మన వారు ట్రంప్ గడప తొక్కటమే ఒక బలహీన సూచన. వాణిజ్య చర్చల్లో డొనాల్ట్ ట్రంప్‌తో జాగ్రత్తగా ఉండండి, ముఖ్యంగా విదేశీ సబ్సిడీలు ఎక్కువగా ఉండే వ్యవసాయరంగంలో కుదుర్చుకొనే ఒప్పందాలు దేశంలోని చిన్న రైతులకు హానికరంగా ఉంటాయని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ హెచ్చరించారు. పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఎలాంటి ఆటంకాలులేని వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు హాని కలిగిస్తాయన్నారు. బహుశా ఇండోనేసియా ఒప్పందం గురించి ఉప్పంది ఉంటుంది.

మన దేశంలోకి బయటి నుంచి మరిన్ని పాల ఉత్పత్తులను స్వాగతించటం కంటే ఆ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల పెంపుదలకు ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించాలని రాజన్ చెప్పారు. అమెరికా పన్నులతో ఆరు నుంచి ఏడు శాతం మధ్య ఉన్న మన జీడీపీ వర్తమాన వృద్ధి రేటు స్వల్పంగా తగ్గుతుం దని, చైనా వస్తువులపై పన్నులు ఎక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయంగా మన ఎగుమతులు పెరగవచ్చని అన్నారు. ఇప్పుడు ప్రధాని నరేంద్రమోదీ స్థితి అదేనా? సూటిగా చెప్పాలంటే మన మార్కెట్‌ను తెరవాలని ట్రంప్ వత్తిడి తెస్తుంటే మన జనాలు ఎలా స్పందిస్తారో అని మోదీ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. జులై తొమ్మిదవ తేదీలోగా ఒప్పందంపై సంతకాలు జరగాల్సిందే అని వత్తిడి చేసిన డొనాల్డ్ ట్రంప్ ఆగస్టు ఒకటవ తేదీ వరకు గడువు పొడిగించాడు. ఒప్పందం కుదిరిందన్నట్లుగా ఎప్పటి నుంచో పదేపదే

చెబుతున్నప్పటికీ మన పాలకులు మౌనం తప్ప మాటలేదు.

భారత్‌తో కుదిరే ఒప్పందం ఇండోనేసియాతో కుదిరిన దానికి ప్రతిబింబంగా ఉంటుందని ట్రంప్ సూచన ప్రాయంగా చెప్పారు. ఆగస్టు ఒకటవ తేదీలోగా ఒప్పందానికి రాకుంటే ఇండోనేసియా ఉత్పత్తులపై 32 శాతం దిగుమతి పన్ను విధిస్తామని లేఖా బెదిరింపులో పేర్కొన్నాడు. పద్దెనిమిది బిలియన్ల డాలర్ల మేర వాణిజ్య మిగులుతో ఉన్న ఇండోనేసియాతో కుదిరిన ఒప్పందం ప్రకారం 32కు బదులు 19శాతం పన్ను విధిస్తారు. అయితే అమెరికా వస్తువులపై ఇండోనేసియాలో ఎలాంటి పన్నులు ఉండవని ట్రంప్ చెప్పారు. పశుపెంపకదారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులను సులభంగా ఇండోనేసియాలో అమ్ముకోవచ్చని అన్నాడు. అయితే ఒప్పంద వివరాలు ఇంకా వెల్లడి కాలేదు గానీ, నామ మాత్ర పన్నులు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇది ఇండోనేసియాకు నష్టదాయకమని నిపుణులు వ్యాఖ్యానించారు. పరస్పర లబ్ధిచేకూర్చే నూతన యుగం అని ఒప్పందం గురించి ఇండోనేసియా నేత ప్రభువు వర్ణించగా కొత్త పన్నుల విధానంతో గణనీయ మొత్తంలో పెట్టుబడులను ఆకర్షిస్తామని, ఎగుమతులు పెరుగుతాయని వాణిజ్యమంత్రి బుడి సంతోసో అన్నాడు. ఒప్పందం ప్రతికూలంగా ఉంటుందని ఒక ఇండోనేసియా అధ్యయన సంస్థ డైరెక్టర్ భీమా యుధిష్టిర చెప్పారు. ఎగుమతులు పెరిగినా అమెరికా నుంచి దిగుమతులు ఇబ్బడిముబ్బడి అవుతాయన్నాడు. వియత్నాం పోటీ సామర్థ్యం ఎక్కువ, రెండు దేశాలకు పన్నుల్లో ఇండోనేసియాకు ఒక శాతమే తక్కువ గనుక పోటీలో నష్టపోతామని చెప్పాడు. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులు స్థానికంగా ఉత్పత్తి చేసేవే అయితే గనుక దేశీయ పరిశ్రమలకు దెబ్బ అని ప్రొఫెసర్ విశాంతి చెప్పారు. స్థానిక వస్తువుల బదులు విదేశీ వస్తువులతో మార్కెట్‌ను నింపితే ప్రతికూలమే అని అమె అన్నారు.

అమెరికన్లు తమ దగ్గర గుట్టలుగా పడిఉన్న కోడి కాళ్లను మన దేశానికి ఎగుమతి చేయాలని ఎప్పటి నుంచో చూస్తున్నారు. అమెరికాతో పోలిస్తే మన దేశంలో కోడి మాంసం ధర తక్కువ. అందువలన అంతకు మించి ఎక్కువ ఉంటే దిగుమతి చేసుకున్న సరకును కొనుగోలుచేసే అవకాశం లేదు. కనుక మన ధరలకు సమానంగా ఉండేట్లు చూస్తారు. అందుకు అమెరికా ప్రభుత్వం పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తుంది, మన ప్రభుత్వం దిగుమతులపై సుంకాన్ని గణనీయంగా తగ్గించాల్సి ఉంటుంది. అదే జరిగితే మన కోళ్ల పరిశ్రమ కుదేలే. తమ కోడి మాంస ఉత్పత్తులకు మార్కెట్ తెరవాలని, దిగుమతి పన్ను తగ్గించాలని అమెరికా పదేళ్ల క్రితమే మోదీ సర్కార్ మీద వత్తిడి తెచ్చింది. దాన్ని మన యావత్ పరిశ్రమ వర్గాలు వ్యతిరేకించాయి. వెనక్కు తగ్గిన కేంద్రం తరువాత ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల పేరుతో టర్కీ, బాతు మాంసంపై ఉన్న 30శాతం పన్నును ఐదు శాతానికి తగ్గించింది. కోళ్ల ఉత్పత్తులపై వందశాతం పన్ను అమలు చేస్తున్నారు. చిన్నా, పెద్ద రైతులు, వారి మీద ఆధారపడినవారు కోళ్ల పెంపకంలో 30లక్షల మంది ఉన్నారు. అమెరికా తెస్తున్న వత్తిడిలో జన్యుమార్పిడి మొక్కజొన్నల దిగుమతి కూడా ఒకటి. ఇది కూడా మన రైతాంగాన్ని దెబ్బతీసేదే. మొక్క జొన్నల దిగుమతి అనుమతించాలని కోళ్ల పరిశ్రమవారు, కూడదని సాగు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇది మిత్ర వైరుధ్యం. ఎవరి లాబీ బలంగా ఉంటే వారి ప్రయోజనం నెరవేరే అవకాశం ఉంది, అయితే దానికి ప్రతికూల ఫలితాలను కూడా పాలక పార్టీ అనుభవించాల్సి ఉంటుంది. శ్రీలంకలో కోడి మాంస ఉత్పత్తుల దిగుమతులను అనుమతించటంతో అక్కడి పరిశ్రమ దెబ్బతిన్నది. ఇప్పుడు మొక్కజొన్నల దిగుమతి కోసం పరిశ్రమ, వద్దంటూ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దిగుమతి చేసుకున్న సరకు కిలో ధర 0.43 నుంచి 0.46 డాలర్లు గిడుతున్నది, తమకు 0.56 డాలర్లు వస్తే తప్ప గిట్టుబాటు కాదు గనుక దిగుమతులు వద్దని, దిగుమతి సుంకం పెంచాలని రైతులు అంటున్నారు. కోళ్ల పరిశ్రమ దీన్ని వ్యతిరేకిస్తున్నది. ప్రస్తుతం కిలోకు 0.08 డాలర్లు దిగుమతి పన్ను ఉందని, ఇంకా పెంచితే కోడి మాంసం, గుడ్ల ధరలు పెరుగుతాయని, తమకు గిట్టుబాటు కాదని వారంటున్నారు.

అమెరికా పాడి ఉత్పత్తులకు మనం ద్వారాలు తెరిస్తే సగటున 15శాతం మేరకు పాల ధరలు పతనమై ఏటా రు.1.8లక్షల కోట్లు నష్టం వస్తుందని, దానిలో రైతులు రు.1.03లక్షల కోట్లు నష్టపోతారని భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) అధ్యయనం హెచ్చరించింది. భారీ మొత్తంలో దిగుమతులు పెరిగి కోట్లాది మంది రైతుల జీవితాలు దెబ్బతింటాయని పేర్కొన్నది. (పాడి పరిశ్రమపై ఎనిమిది కోట్ల మంది ఆధారపడి ఉన్నారని ఒక అంచనా) పాల ధరలు తగ్గితే గిరాకీ 1.4 కోట్ల టన్నులు పెరుగుతుందని, అదే సమయంలో 1.1 కోట్ల టన్నుల సరఫరా తగ్గు తుందని, రెండింటి మధ్య తేడా 2.5 కోట్ల టన్నులను దిగుమతుల ద్వారా పూడ్చుకోవాల్సి ఉంటుందని, చిన్న డెయిరీలు, రైతులు తీవ్రంగా దెబ్బతింటారని కూడా ఎస్‌బీఐ హెచ్చరించింది. అమెరికా జన్యు మార్పిడి ఉత్పత్తులతో ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయని పేర్కొన్నది. వాణిజ్య ఒప్పందం కుదిరితే జపాన్, మలేసియా, దక్షిణ కొరియా నుంచి అమెరికాకు రసాయనాల ఎగుమతులు తగ్గి మన ఎగుమతులు మరొక శాతం పెరుగుతాయని జీడీపీ 0.1శాతం పెరుగు తుందని, దుస్తుల ఎగుమతులు ఆరు నుంచి 11శాతానికి పెరుగుతాయని చెప్పింది. జనరిక్ ఔషధాలతో పాటు ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు ప్రస్తుతం ఉన్న ఒక బిలియన్ నుంచి మూడు బిలియన్ డాలర్ల వరకు పెరుగు తాయని పేర్కొన్నది. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం రెండంచుల పదును గల కత్తి వంటిదని కూడా హెచ్చరిం చింది. అమెరికా పాడి ఆవులకు ఇచ్చే మేతలో జంతు సంబంధిత అంశాలు లేవని నిర్ధారిస్తూ హామీ ఇవ్వాలని భారత్ గతంలో పేర్కొన్నది. ఇప్పుడు దానికి కట్టుబడి ఉందా లేదా అన్నది ఒక చర్చ సాగుతున్నది. మొత్తం మీద వ్యవసాయం, అనుబంధ పాడి, కోళ్ల పెంపకం వంటి వాటి మీద ఏం జరుగుతుందో అన్న అనుమానం, భయం రైతాంగంలో ఉన్నాయి. ట్రంప్ చెప్పినట్లు ఇండోనేసియా మాదిరి మనతో ఒప్పందం ఉంటే అది కచ్చితంగా ముప్పే.

విశాలాంధ్ర

5

ఆదివారం

20 జులై 2025

యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

ఆరుగురి దుర్మరణం

మథుర: ఉత్తరప్రదేశ్‌లోని మథురాలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి మొదట డివైడర్‌ను ఢీకొట్టి... పల్టీలు కొడుతూ మరో వాహనాన్ని బలంగా ఢీకొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో కారులోని ఆరుగురు వ్యక్తులు ఘటనా స్థలంలోనే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

పాక్ ఉదాసీనతపై ప్రశ్నించా: శశిథరూర్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి కారణమైన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'ను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఎక్స్ వేదికగా శనివారం స్పందించారు. అమెరికా చర్యను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత అఖిలపక్ష పర్యటనలో భాగంగా థరూర్ అమెరికా వెళ్లారు. ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్‌పై అమెరికా ఎందుకంత ఉదాసీనత చూపిస్తుందని తాను అధికారులను ప్రశ్నించానని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అమెరికాతో కలిసి పనిచేస్తున్నామని పాక్ చెప్పిన మాటలను కూడా ప్రస్తావించినట్లు వెల్లడించారు. కాబూల్ విమానాశ్రయంలో 23 మందిని బలిగొన్న అబ్బేగేట్ బాంబు దాడికి కారణమైన నిందితుడు ఇటీవల లొంగిపోవడంపైనా మాట్లాడానన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాక్ ఎంత చిత్తశుద్ధితో ఉందనేది భారత్‌కు తెలుసని, ఎందుకంటే తమకు ఎదురైన అనుభవాలు అలాంటివని అక్కడి అధికారులకు వివరించానన్నారు. అమెరికా చర్య రెండు దేశాల మధ్య ఉన్న వివిధ అభిప్రాయభేదాల తొలగింపునకు మొదటి అడుగుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఐక్యరాజ్యసమితిలో టీఆర్ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఇది సాయపడుతుందన్నారు.

పోలీస్ కొడుకు కారు రేస్... ఇద్దరి మృతి

అహ్మదాబాద్: ఒక పోలీస్ కుమారుడు... కార్ రేసులో పాల్గొని ఇద్దరు పాదచారుల మృతికి కారకుడయ్యాడు. ఈ ఘటన గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... క్రైమ్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) అనిరుద్ధ సింగ్ వజుభా గోహిల్ కుమారుడైన హర్షరాజ్ (20)కు కారు రేస్ అంటే పిచ్చి. పలుమార్లు తన స్నేహితులతో కలిసి రేస్‌లలో పాల్గొన్నాడు. అతడు క్రెటా కారు నడపగా... ఎరుపు రంగు బ్రెజ్జాను స్నేహితుడు నడిపాడు. 120 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో కలియాబీడ్ ప్రాంతంలో రద్దీగా ఉండే రోడ్డులో వాహనాన్ని హర్షరాజ్ నడిపాడు. వాహనంపై అదుపు కోల్పోయి రోడ్డుపై నడుస్తున్న ఇద్దరిని బలంగా ఢీకొట్టాడు. వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. మృతులను భార్గవ్ భట్ (30), చంపాబెన్ వాచాని (65)గా గుర్తించారు. మరోవైపు రోడ్డుపై జారుకుంటూ వెళ్లి ఒక స్కూటర్‌ను ఢీకొట్టింది. టైర్లు పగలడంతో ఆ స్కూటర్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న తండ్రి ... పోలీస్ అధికారి అనిరుద్ధ సింగ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. కుమారుడు హర్షరాజ్‌ను కొట్టి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు అతడిని కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది.

పాక్‌తో మ్యాచ్‌లకు తొందరెందుకు?

బీసీసీఐపై ప్రియాంక చతుర్వేది ఆగ్రహం

న్యూఢిల్లీ: వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీకి బీసీసీఐ అనుమతించడాన్ని శివసేన యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది తప్పుబట్టారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో ఎలాంటి సంబంధాలు ఉండవని కేంద్రం చెప్పిన విషయాన్ని ఆమె భారత క్రికెట్ బోర్డుకు గుర్తు చేశారు. పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకోక ముందే పాకిస్థాన్‌తో మ్యాచ్‌లు ఆడటం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ దేశంతో ఎలాంటి సంబంధాలు లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, బీసీసీఐ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుంటే మోదీ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రియాంక చతుర్వేది ప్రశ్నించారు. తమ వారిని కోల్పోయిన కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయి ఉంటే బీసీసీఐ, ఐసీసీలు తమ డబ్బు గురించి ఆలోచించడం వారి నైతికతను ప్రశ్నిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆటగాళ్లకు సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా.. వరల్డ్ ఛాంపియన్స్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో భాగంగా ఆదివారం భారత్ ఛాంపియన్స్-పాకిస్థాన్ ఛాంపియన్స్ మధ్య బర్మింగ్‌హామ్ వేదికగా మ్యాచ్ జరగనుంది. యువరాజ్ సింగ్ నాయకత్వంలో భారత్ తలపడనుంది. శిఖర్ ధావన్, సురేశ్ రైనా, అంబటి రాయుడు, గుర్కీరత్ సింగ్, యూసఫ్ పఠాన్, స్టువర్ట్ బిన్నీ, ఇర్ఫాన్ పఠాన్, రాబిన్ ఉతప్ప, హర్భజన్ సింగ్, పీయూశ్ చావ్లా, వినయ్ కుమార్, వరుణ్ ఆరోన్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్ భారత జట్టులో ఉన్నారు.

ఒడిశాలో మరో దారుణం

బాలికకు నిప్పంటించిన ముగ్గురు దుండగులు

మృత్యువుతో పోరాడుతున్న బాధితురాలు

భువనేశ్వర్: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బాలికలు, మహిళలపై నేరాలు-ఘోరాలు పేట్రేగిపోతున్నాయి. భరతమాత అంటూ గొప్పలు చెప్పుకునే కమనాధుల పాలనలో స్త్రీజాతికి రక్షణ కరువైపోయింది. గడప దాటితే క్షేమంగా ఇంటికి చేరుకుంటారన్న భరోసా లేకుండా పోయింది. ఇటీవల కాలంలో ఒడిశాలో నేరాలు పెరుగుతున్నాయి. 20ఏళ్ల కాలేజీ విద్యార్థిపై పది మంది కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన మరువక ముందే ఆ రాష్ట్రంలో మరో దారుణం జరిగింది. స్నేహితురాలి ఇంటికి వెళతున్న 15 ఏళ్ల బాలికను ముగ్గురు దుండగులు అడ్డుకొని... ఆమెకు నిప్పంటించి పరారైన అమానవీయ ఘటన పూరీ జిల్లా బయాబర్ గ్రామంలో చోటుచేసుకుంది. శరీరమంతా కాలిపోవడంతో ఆమె మృత్యువుతో పోరాడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో ఆమెకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధితురాలు 12వ తరగతి విద్యార్థిని. తన స్నేహితురాలి పుస్తకాలను తిరిగి ఇచ్చేందుకు ఉదయం 8.30 గంటలకు బయల్దేరిన ఆమెను ముగ్గురు అడ్డుకున్నారు. బలవంతంగా భార్గవి నది సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి... అక్కడ నుంచి పారిపోయారు. ఈ మేరకు పోలీసు అధికారి వెల్లడించారు. మంటల్లో కాలుతూ అరుస్తున్న బాలికను చూసిన స్థానికులు వెంటనే స్పందించారు. మంటలు ఆర్పి, ఆమెను పిపిలీలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు పంపారు.

రంగంలోకి రెండు పోలీసు బృందాలు

సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు. వ్యక్తిగత శత్రుత్వం లేదా ప్రేమ కోణం లేదని బాలిక కుటుంబం చెప్పినట్లు వెల్లడించారు. పూరి ఎస్పీ పినక్ మిశ్రా మాట్లాడుతూ కొందరిని విచారించామని, ఇప్పటివరకు ఎవరిని అదుపులోకి తీసుకోలేదని చెప్పారు. బాలిక వీపు, పొట్ట తదితర శరీర భాగాలు బాగా కాలిపోయాయని పీపిలి ఎస్‌డీపీఓ దేవశీష్ మిశ్రా వెల్లడించారు. దోషులను పట్టుకునేందుకు రెండు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, ఘటనా స్థలం వద్ద ఇళ్లలోని సీసీటీవీల ఫుటేజిలు పరిశీలిస్తున్నామని చెప్పారు.

దోషుల అరెస్టు, కఠిన చర్యలకు ఆదేశం

దోషులను త్వరగా పట్టుకోవాలని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు ఉప ముఖ్యమంత్రి, మహిళా-శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ప్రవతి పరిందా వెల్లడించారు. ఈ ఘటనపై 'ఎక్స్' మాధ్యమంగా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 15 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలిసి షాక్‌కు గురైనట్లు తెలిపారు. ఆమెకు ఎయిమ్స్‌లో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని, వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు.

మహిళలకు భద్రతలేదు: నవీన్ పట్నాయక్



పట్టపగలే బాలికకు నిప్పంటించి చంపే ప్రయత్నం దారుణమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. ఈ ఘటనను ఆయన ఎక్స్ మాధ్యమంగా ఖండించారు. 'ఎఫ్ఎం కాలేజి విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకొన్న ఘటన జరిగి వారం గడవక ముందే ఇలాంటి మరో దారుణం వెలుగు చూసింది. నెలకిందట గోపాల్‌పూర్‌లోనూ భయానక ఘటన చోటుచేసుకుంది. మహిళలపై నేరాలు-ఘోరాలు నిత్య కృత్యాలుగా మారడం కలిచివేస్తోంది. పరిపాలనలో వ్యవస్థీకృత వైఫల్యానికి ఈ ఘటనలు అద్దంపడుతున్నాయి. బీజేపీ పాలనలో నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వారిలో శిక్షల భయంలేదు. మహిళలకు ఒడిశా పూర్తిస్థాయిలో అభద్రమైనదిగా మారిపోయింది' అంటూ నవీన్ ఆందోళన వ్యక్తంచేశారు. ఒడిశా ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నేరస్తులను సత్వరమే అరెస్టు చేస్తుందా అని ప్రశ్నించారు. మళ్లీ ఇలాంటి ఘోరాలు జరగకుండా చర్యలు తీసుకుంటుందా అని నిలదీశారు. ప్రభుత్వ స్పందన, న్యాయం కోసం రాష్ట్ర బాలికలు, మహిళలు వేచివున్నారని ఎక్స్‌లో నవీన్ పట్నాయక్ పేర్కొన్నారు.

మోదీ లేకపోతే 150 సీట్లు కూడా రావు

బీజేపీ ఎంపీ దూబే

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ కరిష్మా తమ పార్టీ సంప్రదాయేతర ఓటర్లను సైతం ఆకర్షించిందని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చెప్పుకొచ్చారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఇప్పుడు మోదీ మూడోసారి ప్రధానిగా ఉన్నారు. ఆయన మా నాయకుడు కాకపోయి ఉంటే బీజేపీకి 150 సీట్లు కూడా వచ్చేవి కాదు. మోదీ వచ్చాకే పేదల్లో ఎక్కువమందికి మా పార్టీపై నమ్మకం వచ్చింది. మేము నచ్చని వాళ్లు కూడా ఉన్నారు. అన్నీ అందరికీ నచ్చాలని లేదు. ఇది వాస్తవం. పార్టీకి మోదీ అవసరం. ఒక కార్యకర్తగా అది నేను నమ్ముతాను. ఆయన లేకపోతే పార్టీ ఈరోజు ఇంత బలంగా ఉండేది కాదు. ఆయన శరీరం అనుమతించినంతవరకు, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ అనే మన లక్ష్యాన్ని చేరుకునేవరకు మోదీ అవసరం ఉంది. ఆయన కరిష్మా పార్టీ సంప్రదాయేతర ఓటర్లను ఆకట్టుకుంది. ఆయన లేకుంటే వారు బీజేపీకి ఓటు వేసేవాళ్లు కాదు' అని చెప్పారు. ఈ సందర్భంగా 75 ఏళ్ల తర్వాత బీజేపీ నేతలు పదవీ విరమణ చేస్తారనే ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను దూబే తోసిపుచ్చారు. మోదీ అలా చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రధానిగా మోదీ వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ ముఖచిత్రం మారిపోయిందన్నారు. పార్టీ వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో, అనేక అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిందన్నారు. పార్టీ ఉనికి లేని రాష్ట్రాల్లోనూ తనదైన ముద్ర వేయగలిగిందన్నారు. 75 ఏళ్ల నిబంధన మోదీకి వర్తించదని దూబే చెప్పారు.

రాక్రే అనేది మహారాష్ట్ర గుర్తింపు: ఉద్ధవ్

ముంబై: ఠాక్రే కేవలం బ్రాండ్ కాదు... మహారాష్ట్ర, మరాఠీ ప్రజలు... హిందూ గర్వం, గుర్తింపు... కానీ కొంతమంది దానిని అంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. సేన (యూబీటీ)కి చెందిన పత్రిక 'సామ్నా'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఎన్నికల సంఘాన్ని విమర్శించారు. 'అది తన పార్టీ చిహ్నాన్ని స్తంభింపజేయవచ్చు లేదా వేరొకరికి ఇవ్వవచ్చు. కానీ తన తాత కేశవ్ ఠాక్రే, బాల్ ఠాక్రే సృష్టించిన పార్టీ పేరును ఇచ్చే హక్కు దానికి లేదు' అని అన్నారు. 'మరాఠీ నేలలో మా లోతైన మూలాలు అనేక తరాల నాటివి. శివసేన ప్రముఖ్ (బాల్ ఠాక్రే) కాలం నుంచి మరాఠీ ప్రజలతో సంబంధాలు బలంగా ఉన్నాయి. ఇప్పుడు నేను అక్కడే ఉన్నాను. ఆదిత్య (ఠాక్రే) అక్కడే ఉన్నాడు. ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ కూడా వచ్చాడు' అని ఆయన అన్నారు. ఠాక్రే అంటే నిరంతర పోరాటం అని పార్టీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ మొదటి భాగంలో ఆయన నొక్కి చెప్పారు. బీజేపీ తన పార్టీని అంతం చేయడానికి ప్రయత్నిస్తోందని, 2022లో శివసేనలో చీలికకు కారణమని ఠాక్రే ఆరోపించారు. కొంతమంది ఠాక్రే బ్రాండ్‌ను అంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఉద్ధవ్ అన్నారు.

ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం

బాఘేల్ కుమారుడి అరెస్ట్‌పై ప్రియాంక

న్యూఢిల్లీ: బీజేపీ ప్రజల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా శనివారం విమర్శించారు. అదానీ గ్రూప్‌నకు అడవులను అప్పగించారనే విషయాన్ని అసెంబ్లీలో లేవనెత్తబోతుండగా ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడిని ఈడీ అరెస్టు చేసిందని మండిపడ్డారు. 'ఛత్తీస్‌గఢ్‌లోని అన్ని అడవులను బీజేపీ ప్రభుత్వం అదానీ జీకి అప్పగించింది. పెసా చట్టం, ఎన్‌జీటీ ఆదేశాలను ధిక్కరిస్తూ అడవులను నాశనం చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ జీ ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తబోతున్నారు. ఆయనను ఆపడానికి, ఈడీ తెల్లవారుజామున ఆయన ఇంటిపై దాడి చేసి ఆయన కుమారుడిని అరెస్టు చేసింది' అని ప్రియాంక గాంధీ హిందీలో ఒక పోస్ట్‌లో తెలిపారు. గత 11 సంవత్సరాలలో ఇవి 'ప్రజల గొంతును అణిచివేయడానికి, ప్రతిపక్షాన్ని అణచివేయడానికి మార్గాలు అని దేశం అర్థం చేసుకుంది' అని అన్నారు. 'కానీ అలాంటి వ్యూహాలతో సత్యాన్ని అణచివేయడం, ప్రతిపక్షాలను భయపెట్టడం అసాధ్యం. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బఘేల్ జీకి గట్టిగా నిలుస్తాడు' అని ప్రియాంక పేర్కొన్నారు. మద్యం కుంభకోణంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడి కుమారుడు చైతన్య బఘేల్‌ను అరెస్టు చేసిందని అధికార వర్గాలు తెలిపాయి. తరువాత కోర్టు చైతన్యను ఐదు రోజుల ఈడీ రిమాండ్‌కు పంపింది. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని భూపేశ్ బఘేల్ ఆరోపించారు. తాను న్యాయవ్యవస్థను విశ్వసిస్తానని, వారితో సహకరిస్తానని నొక్కి చెప్పారు.

టీచర్ల వేధింపులకు మరో విద్యార్థిని బలి

లక్నో: ఒడిశాలో కీచక టీచర్ల వేధింపులు తట్టుకోలేక ఓ విద్యార్థిని నిప్పంటిచుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే ఉత్తరప్రదేశ్‌లో మరొక విద్యార్థిని బలైంది. టీచర్ల వేధింపులు తాళలేక గ్రేటర్ నోయిడాలోని శ్రద్ధా యూనివర్సిటీలో బీడీఎస్ చదువుతున్న విద్యార్థిని తన హాస్టల్ గదిలో శుక్రవారం ఉరి వేసుకుంది. ఆత్మహత్య చేసుకోవడానికి తన డిపార్ట్‌మెంట్‌లోని ఇద్దరు టీచర్లు కారణమని చెబుతూ వారి పేర్లను సూసైడ్ నోట్‌లో పేర్కొంది. దీంతో ఆ ఇద్దరు సస్పెండ్ అయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తునకు హై పవర్ కమిటీని వర్సిటీ ఏర్పాటు చేసింది. బాధితురాలి తల్లిదండ్రులతో వర్సిటీ యాజమాన్యం భేటీ అయింది. ఈ వ్యవహారంలో తగు చర్యలకు ఐదు రోజుల సమయం కోరింది. ఇదిలావుంటే, 'ఇద్దరు టీచర్లు నన్ను మానసికంగా వేధించారు. అవమానించారు. దీంతో చాలా కాలంగా మానసిక క్షోభను అనుభవిస్తున్నాను. నేను అనుభవించిన బాధ వాళ్లకూ తెలియాలి. ఇక నేను జీవించలేను' అని సూసైట్ నోట్ పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ చేస్తామంటూ తమ బిడ్డను ఇద్దరు టీచర్లు బెదిరించారని బాధితురాలి తల్లి వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇద్దరు టీచర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించారు.

విద్యార్థుల నిరసన: తోటి విద్యార్థి ఆత్మహత్యపై వర్సిటీ రగిలిపోయింది. విద్యార్థులు క్యాంపస్‌లో ఆందోళనకు దిగారు. దోషులపై కఠిన చర్యలకు డిమాండ్ చేశారు.

జస్టిస్ యాదవ్‌ను అభిశంసించాలి

సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్

న్యూఢిల్లీ: నోట్ల సంచుల కేసులో జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలన్న డిమాండ్‌కు అన్ని పార్టీలు మద్దతిస్తున్నాయని, అదేవిధంగా జస్టిస్ శేఖర్ యాదవ్‌ను కూడా అభిశంసించాలని సీపీఎం నాయకుడు జాన్ బ్రిట్టాస్ శనివారం అన్నారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉండగా తన నివాసం అవుట్‌హౌస్‌లో సగం కాలిపోయిన నగదు బస్తాలు దొరికినప్పటి నుంచి జస్టిస్ వర్మ కేసును ఎదుర్కొంటున్నారు. అయితే జస్టిస్ వర్మ ఈ ఆరోపణలను ఖండించారు. తానుగానీ, తన కుటుంబ సభ్యులు గానీ స్టోర్‌రూమ్‌లో డబ్బు నిల్వ చేయలేదని నొక్కి చెప్పారు. 'న్యాయవ్యవస్థ సమగ్రతను, పారదర్శకతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాము. జస్టిస్ వర్మను అభిశంసించాలని మేము కోరుకుంటున్నాము. ఆ అభిశంసన ప్రక్రియలో భాగం కావాలనే మా కోరికను ఇప్పటికే వ్యక్తం చేశాము' అని జాన్ బ్రిట్టాస్ అన్నారు. జస్టిస్ యాదవ్‌ను అభిశంసించాలని డిమాండ్ చేస్తూ ఒక నోటీసు రాజ్యసభ చైర్మన్ వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పారు. 'జస్టిస్ శేఖర్ యాదవ్‌కు సంబంధించి రాజ్యసభ చైర్మన్ వద్ద ఒక నోటీసు పెండింగ్‌లో ఉంది. ఆయన చేసిన వ్యాఖ్యలన్నీ రాజ్యాంగ ప్రాథమిక అంశాలకు విరుద్ధంగా ఉన్నాయి. అందువల్ల ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి పరిశీలిస్తుందని నేను భావిస్తున్నాను' అని బ్రిట్టాస్ పీటీఐకి తెలిపారు. జస్టిస్ శేఖర్ యాదవ్ గత సంవత్సరం ఒక సమావేశంలో ద్వేషపూరిత ప్రసంగం చేశారనే ఆరోపణలతో రాజ్యసభలో అభిశంసన నోటీసును ప్రతిపక్ష ఎంపీలు ప్రవేశపెట్టారు. మణిపూర్‌కు బడ్జెట్ కేటాయించే బాధ్యతను పార్లమెంటుకు అప్పగించడం దురదృష్టకరం అని సీపీఎం నాయకుడు అన్నారు. 'మణిపూర్ బడ్జెట్‌ను ఆమోదించాల్సి రావడం దురదృష్టకరం. పార్లమెంటు అక్కడ మళ్లీ రాష్ట్రపతి పాలనను పొడిగించాల్సి వచ్చింది. మన ప్రధాన మంత్రికి చాలా దేశాలు సందర్శించడానికి సమయం ఉంది. కానీ మణిపూర్‌ను సందర్శించడానికి లేదా మణిపూర్ సమస్యను పార్లమెంటుకు తీసుకురావడానికి సమయం లేదు' అని ఆయన విమర్శించారు.

24వ సారి పేలిన 'ట్రంప్ క్షిపణి'

పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలి: జైరాం రమేశ్



న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య పోరులో ఐదు యుద్ధ విమానాలను గాల్లోనే పేల్చి వేశారంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడంపై కాంగ్రెస్ మండిపడింది. గత 70 రోజులుగా ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలపై స్పష్టతిచ్చేందుకుగాను ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రకటన చేయాలని శనివారం డిమాండ్ చేసింది. 'అనేక యుద్ధాలు ఆపినందుకు గర్వపడుతున్నాం. భారత్-పాకిస్థాన్ పోరు సమయంలో ఐదు యుద్ధ విమానాలను గాల్లోనే పేల్చివేశారు' అని ట్రంప్ వెల్లడించారు. భారత్-పాకిస్థాన్ మధ్య పోరు తీవ్రరూపం దాల్చుతుండటంతో అణు యుద్ధానికి దారితీసే ప్రమాదాన్ని పసిగట్టి వాణిజ్యపరంగా దానిని ఆపినట్లు ఆయన చెప్పారు. ఆయుధాల ప్రయోగాన్ని ఆపకపోతే వాణిజ్య ఒప్పందం జరగదని తేల్చి చెప్పినట్లు ట్రంప్ వెల్లడించారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ 'ట్రంప్ క్షిపణి' 24వ సారి పేలిందని దుయ్యబట్టారు. ట్రంప్ పదేపదే అవే ప్రకటనలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై భారత్ స్పష్టతివ్వాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో ప్రధాని నిర్దిష్టమైన ప్రకటన చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అణ్వస్త్రాలు కలిగివున్న రెండు దేశాల మధ్య యుద్ధాన్ని ఆపినట్లు ట్రంప్ మళ్లీ చెప్పుకున్నారు. అయితే ఈ సారి కొత్తగా ఐదు యుద్ధ విమానాలను కూల్చివేశారని చెప్పి సంచలనం సృష్టించారు' అని కాంగ్రెస్ నేత వ్యాఖ్యానించారు. '2019 సెప్టెంబరులో హౌడీ మోదీ, 2020 ఫిబ్రవరిలో నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాలతో చాలా ఏళ్లుగా తమ మధ్య స్నేహం, ఆలింగనాలపర్వాన్ని కొనసాగించిన మోదీ... ట్రంప్ గత 70 రోజులుగా చేస్తున్న వ్యాఖ్యలపై పార్లమెంటులో స్పష్టమైన ప్రకటన చేయాలని జైరాం రమేశ్ అన్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తమ వల్ల సాధ్యమైనట్లు ట్రంప్ చెప్పడంపై మోదీ సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ చాలా రోజులుగా డిమాండ్ చేస్తుండటం విదితమే.

రాజ్యాంగాన్ని చంపేస్తున్న మోదీ: ఖడ్గే

మైసూరు: దేశ రాజ్యాంగాన్ని ప్రధాని మోదీ ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే శనివారం వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ- ఆర్ఎస్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను దేశ ప్రజలు ప్రతిఘటిస్తారని నొక్కిచెప్పారు. మైసూరులో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు కర్నాటక ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ఖడ్గే ప్రసంగిస్తూ బీజేపీ-ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. 'రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ- ఆర్ఎస్ఎస్ అంటున్నాయి. కానీ దేశ ప్రజలు అలా ఎప్పటికీ జరగనివ్వరు. అందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించవు. రాజ్యాంగాన్ని మార్చడం లేదా తిరగరాయడం కుదరదు' అని ఖడ్గే అన్నారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు అవకాశం ఇస్తే మీ హక్కులను కోల్పోతారని ప్రజలను హెచ్చరించారు. 'రాజ్యాంగం ఉంది కాబట్టే మోదీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కాగలిగారు. పార్లమెంటులో అడుగు పెట్టే ముందు రాజ్యాంగానికి నమస్కరించారు. మోదీ ఇప్పుడు అదే రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు. రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ-ఆర్ఎస్ఎస్ రోజూ యత్నిస్తున్నాయి' అని ఖడ్గే వ్యాఖ్యానించారు. 42 దేశాలలో పర్యటించిన మోదీకి మణిపూర్‌కు వెళ్లే తీరిక లేదని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ లక్ష్యంగానే వాద్రాపై చర్యలు

గాంధీ కుటుంబం, కాంగ్రెస్ లక్ష్యంగా రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీటు దాఖలైందని ఖడ్గే వ్యాఖ్యానించారు. వాద్రాపై చర్యలు కక్షపూరితమైనవని, గాంధీ కుటుంబాల పరువు తీసే ప్రయత్నమని దుయ్యబట్టారు. దేశంలో కోర్టులు ఉన్నాయని, బీజేపీ ప్రయత్నాలు ఫలించబోవని ఖడ్గే అన్నారు. వాద్రాకు తమ మద్దతు ఎప్పుడు ఉంటుందని చెప్పారు. వాద్రాను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. 'ల్యాండ్ జిహాద్'కు కాంగ్రెస్ మద్దతిస్తున్నట్లు బీజేపీ చేస్తున్న ఆరోపణలపై విలేకరి అడిగిన ప్రశ్నకు 'ల్యాండ్ జిహాద్ ఏమిటో నాకు తెలియదు. నాపై చర్యలు తీసుకోవాలనుకుంటే రమ్మనండి, నేను స్వాగతం చెబుతా. వాళ్లు ఎప్పుడు చర్యలు తీసుకుంటే... నా స్పందన అప్పుడే వస్తుంది' ఖడ్గే అన్నారు.

ఆప్ ఎమ్మెల్యే అన్మోల్ రాజీనామా

చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఖరార్ నియోజకవర్గం ఎమ్మెల్యే అన్మోల్ గగన్ మాన్ తన పదవికి రాజీనామా చేశారు. రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్ కుల్తార్ సింగ్ సాంధ్వాన్‌కు తన రాజీనామా లేఖ సమర్పించినట్టు చెప్పారు. బరువెక్కిన హృదయంతో రాజకీయాలు విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మాన్ తెలిపారు. తన రాజీనామాను స్పీకర్ ఆమోదించాలని కోరారు. పార్టీకి బెస్ట్ విషెస్ తెలిపారు. పంజాబ్ ప్రజల అంచనాలకు తగినట్టుగా పాలన అందిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. మాన్ 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఖరార్ నియోజకవర్గం నుంచి గెలిచారు. భగవంత్ మాన్ మంత్రివర్గంలో కీలక శాఖలు నిర్వహించారు. పర్యాటకం, సాంస్కృతిక శాఖ, పెట్టుబడుల ప్రోత్సాహకం, లేబర్ అండ్ హాస్పిటాలిటీ శాఖలు నిర్వహించారు. గత ఏడాది మంత్రివర్గ విస్తరణలో ఆమెకు మంత్రి వర్గంలో చోటుదక్కలేదు. రాజకీయాల్లోకి రాకముందు పంజాబీ సింగర్‌గా ఆమె మంచి పేరు తెచ్చుకున్నారు.

రాయిటర్స్, వాల్‌స్ట్రీట్‌కు పైలెట్ల లీగల్ నోటీసు



న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి పైలెట్లు కారణమంటూ అంతర్జాతీయ మీడియా కథనాలను పైలెట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. తుది నివేదిక రాక ముందే ఎలా తప్పుడు కథనాలు ప్రసారం చేస్తారంటూ యూనియన్లు మండిపడ్డాయి. తాజాగా ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు పైలెట్ సంఘాలు లీగల్ నోటీసులు పంపించాయి. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ప్రాథమిక నివేదికను పాశ్చాత్య మీడియా తప్పుగా అర్థం చేసుకుందని పైలెట్ సంఘాలు ధ్వజమెత్తాయి. మీడియా కథనాలను అమెరికా దర్యాప్తు సంస్థ ఎన్‌టీఎస్‌బీ కూడా తీవ్రంగా ఖండించింది. ఊహాజనిత కథనాలు ప్రసారం చేస్తున్నారంటూ కొట్టిపారేసింది. ఈ నేపథ్యంలో పైలెట్ సంఘాలు మండిపడుతున్నాయి. అంతర్జాతీయ మీడియా క్షమాపణ చెప్పాలని యూనియన్లు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలెట్స్... ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌కు లీగల్ నోటీసు జారీ చేసింది. కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌లో... పైలెట్లలో ఒకరు మరొకరిని ఎందుకు కట్-ఆఫ్ చేశావని అడుగుతున్నట్లు వినబడింది. మరొక పైలెట్ తాను అలా చేయలేదని ప్రతిస్పందించాడని ప్రాథమిక నివేదిక తెలిపింది. అయితే విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్ దర్యాప్తు అధికారులతో మాట్లాడుతూ విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పెద్ద శబ్దం రావడంతో ఆగిపోయిందని చెప్పాడు. ఆకుపచ్చ, తెలుపు లైట్లు మిణుకుమిణుకుమంటున్నాయని పేర్కొన్నాడు. విమానం కూలిపోకుండా చూసేందుకు పైలెట్లు తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు రమేశ్ తెలిపాడు. కానీ అంతలోనే కూలిపోయిందని చెప్పాడు.

విశాలాంధ్ర హైదరాబాద్

కుల గణన దేశ దిశను మారుస్తుంది

దేశంలో ఎక్కడా ఇలాంటి సైంటిఫిక్ సర్వే జరగలేదు

ఎస్ఈఈఈపిసి సర్వే నివేదిక సమర్పణ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే, సర్వే ఆధారంగా విశ్లేషణ ఈ దేశ దిశను మారుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం సాయంత్రం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల భవనంలో ఎస్ ఈఈఈపీసీ సర్వే నివేదిక సమర్పణ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే సమాచారం ఆధారంగా స్వతంత్ర మేధావుల కమిటీ చేసిన అధ్యయనం చారిత్రాత్మకమైనదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రముఖులు, ఎలాంటి ముద్రలు లేని వివాదరహితులను కమిటీ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సర్వే దేశంలో ఇప్పటివరకు ఎక్కడ జరగలేదని ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం గర్వంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. భారత్ జూడో పాదయాత్రలో భాగంగా మా నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట మేరకు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపట్టిందని తెలిపారు. ఈ సర్వే చేపట్టాలని ఆ బాధ్యతలను మొదట ప్రణాళిక శాఖకు ఇవ్వడంతో కొత్త ఆందోళన చెందాము కుల సర్వే దేశంలో ఎక్కడా జరగలేదు. బీహార్‌లో జరిగిన న్యాయస్థానాల్లో బ్రేకులు పడ్డాయి అని వివరించారు. కుల సర్వే పై క్యాబినెట్ మొత్తం సీరియస్‌గా చర్చించి, ప్రశ్నాపత్రాలు రూపొందించి, లెక్కింపు, బ్లాక్‌ల ఏర్పాటు అన్ని కార్యక్రమాలు విజయవంతంగా ముగించుకొని సర్వే నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల సర్వేను అసెంబ్లీలో ప్రవేశపెడితే సభ్యులు అనేక రకాల ప్రశ్నలు అడిగారు తప్ప లోపం ఉందని ఎవరూ చెప్పలేదని డిప్యూటీ సీఎం వివరించారు. కుల గణన సమాచారం వచ్చిన తర్వాత ఏం చేద్దాం, భవిష్యత్తు ప్రణాళిక ఏంటి అని సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ సభ్యులు చర్చించి దేశంలోనే ఉన్నత స్థానంలో ఉన్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కంచ ఐలయ్య, ప్రవీణ్ చక్రవర్తి, తోరట్ వంటి మహామహులతో కమిటీ ఏర్పాటు చేసినట్టు వివరించారు. సమాజం పట్ల అనురాగం, నిబద్ధత, ప్రేమ ఉన్న వ్యక్తులు కమిటీలో సభ్యులుగా ఉన్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుల గణన కమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంతమంది రెడ్లు ఉన్నప్పటికీ ఎలాంటి భేదాలు లేకుండా అణగారిన వర్గాలకు ప్రయోజనం చేకూర్చాలని బాధ్యతతో పని చేయడంతో సర్వే నిర్వహణ, విశ్లేషణ కార్యక్రమంలో విజయవంతం అయ్యామని డిప్యూటీ సీఎం తెలిపారు. కమిటీ సభ్యులు పడిన కష్టం చెప్పడానికి తనకు మాటలు రావడంలేదని, సామాజిక న్యాయం, సమానత్వం, సంపద పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. విలువైన సమయాన్ని కేటాయించి నివేదికను విశ్లేషించిన మేధావులకు ధన్యవాదాలు వారి సూచనలను ప్రభుత్వం కచ్చితంగా వినియోగించుకుంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

మొబైల్ వలస సహాయ కేంద్రం ప్రారంభించిన మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని వలసదారుల, బడుగు, బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి వారి జీవనోపాధి అవకాశాలు పెంచేందుకు మద్దతుగా "మొబైల్ వలస సహాయ కేంద్రాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో ప్రారంభించారు. ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ వలస సంస్థ సంయుక్త కార్యాచరణగా రూపొందించబడినది. ఈ మొబైల్ వలస సహాయ కేంద్రం ద్వారా నిజామాబాద్, నారాయణపేట జిల్లాల్లో వలస వెళ్లుతున్న గ్రామీణ కుటుంబాలకు వలసకు ముందు, వలస సమయంలో, తిరిగి వచ్చాక వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత, సేవలు అందించబడతాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి.గోపీ, ఎఫ్ఏఓకు చెందిన అగ్రిబిజినెస్ స్పెషలిస్ట్ జగన్మోహన్ రెడ్డి, ఐవోఎం రాష్ట్ర సమన్వయకర్త జలజ, ఎన్ డబ్ల్యు డబ్ల్యు టి అధ్యక్షురాలు సిస్టర్ లిస్సీ జోసెఫ్, ప్రాజెక్ట్ అమలు బృందం తదితరులు పాల్గొన్నారు. డా. గోపీ, ఈ సంయుక్త కార్యక్రమ లక్ష్యాలను వివరించి, జిల్లాల స్థాయి అధికారులతో సమన్వయంగా శిక్షణలు నిర్వహించబోతున్నట్లు మంత్రికి తెలియజేశారు. వలస సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తూ మంత్రి మాట్లాడుతూ "ఈ వాహనాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి, ఎంపిక చేసిన ప్రాంతాల రైతులకు మట్టి పరిక్షలు, సేంద్రీయ వ్యవసాయ విధానాలపై, పశుపాలనపైన వర్చువల్ శిక్షణలు ఇవ్వాలి" అని సూచించారు. ఇకపై ఈ వాహనాల ద్వారా మొబైల్ మట్టి నమూనా పరీక్షలు మరియు పశుసేవల వంటి ఇతర సేవలు కూడా రైతులకు అందించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. యుఎన్ భాగస్వామ్య సంస్థల కృషిని మంత్రి ప్రశంసించారు. ఇక వలస వెళ్ళిన కుటుంబాలలో మహిళలు తరచూ ఇంటిలో ఒంటరిగా మిగిలిపోతున్నారు. అటువంటి మహిళలకు గ్రామాల్లోనే సేవలు అందించేందుకు ఈ మొబైల్ వాహనం ఉపయోగపడుతుంది. ఇది వారిని శక్తివంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని మంత్రి అన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : కమిషనర్

విశాలాంధ్ర - మొయినాబాద్ : గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని బీజాపూర్ హైవేపై ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, భవిష్యత్ తరాలను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. అదేవిధంగా గ్రామాలలో మురుగునీరు నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలించిన అదనపు కలెక్టర్

విశాలాంధ్ర - మేడిపల్లి : ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో భాగంగా శనివారం ఉదయం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 27, 28వ డివిజన్లో మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త పర్యటించారు. వారితో పాటు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, బోడుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు చీరాల నర్సింహ, బొమ్మక్ కళ్యాణ్, నాయకులు రాపోలు ఉపేందర్, తోటకూర రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస వరప్రసాద్‌ను సత్కరించిన శోభారాజు దంపతులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: చదువుతో పాటు లలిత కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూచిపూడి నాట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాటి తెలిపారు. మాదాపూర్ లోని అన్నమయ్యపురంలో శనివారం అన్నమయ్యపద కోకిల, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభరాజు దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శోభరాజు మాట్లాడుతూ దేశ విదేశాలలో ఉన్న వారికి ఆన్లైన్ కూచిపూడి తరగతుల ద్వారా నేర్పించడం సంతోషమన్నారు. భావితరాలకు లలిత కళల గొప్పతనాన్ని తెలుపుతూ విద్యార్థులను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. కూచిపూడి నాట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాటి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా కూచిపూడి నృత్యంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 300 మందికి పైగా శిక్షణ ఇచ్చానన్నారు.అందులో దాదాపు 20 మందికి పైగా గురువులుగా మారి వారు కూడా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తన శిష్య బృందాలతో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర ప్రముఖ దేవస్థానాలలో, యూనివర్సిటీలలో, ప్రముఖ ప్రాంతాలలో స్టేజి షోలను ఇచ్చినట్టు తెలిపారు. రవీంద్రభారతిలో చేసిన గోధాకళ్యాణం (కూచిపూడి యక్షగానం) నృత్యప్రదర్శన పలువురు ప్రముఖుల ప్రశంశలను పొందినట్టు పేర్కొన్నారు. చేసిన సేవలకు గాను నిసింబిత జ్ఞానపీఠ అవార్డు. ఉగాది పురస్కార అవార్డు, గురుసామ్రాట్, అదిత్య నాట్యనంది తదితర బిరుదులను అందుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. భరతవేద ఆర్ట్ అకాడమీ ద్వారా విద్యార్థులకు శిక్షణ తరగతులను అందిస్తు సామాజిక సేవా కార్యక్రమాలని మరిన్నీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్యపురం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4 కోట్ల భూమిని ప్రభుత్వానికి రాసిచ్చిన రైతు కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తన ఉదార స్వభావాన్ని మరోసారి చాటుకున్నారు. తన చిన్నాయన మల్లారెడ్డి ఇచ్చిన భూమి, అందులో నిర్మించిన భవనాన్ని వ్యవసాయ శాఖకు రాసిచ్చారు. యాచారం మండల కేంద్రంలోని 2 వేల గజాల భూమిని వ్యవసాయ శాఖకు కేటాయిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి భూమికి సంబంధించిన పత్రాలను అందించారు. ఆ భూమి విలువ బహిరంగ మార్కెట్లో 4 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. నెలరోజుల క్రితమే రైతు కమిషన్ బృందం, వ్యవసాయ అధికారులు కలిసి యాచారం మండలంలో పర్యటించారు. ఆ సమయంలో కోదండరెడ్డి ప్రభుత్వానికి ఇవ్వాలనుకున్న భూమిని అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి తోపాటు మార్కెటింగ్ అధికారులకు చూపించారు. ప్రస్తుతం ఆ స్థలంలో రైతు మిత్ర కమ్యూనిటీ భవనం ఉంది.

అందులో రైతులు వ్యవసాయ సామాగ్రి, ధాన్యం కొనుగోలు కేంద్రం, సీజన్ పంటలు నిలువ కోసం వాడుకుంటున్నారు. ఐతే ఇక ఆ స్థలాన్ని, ఆ స్థలంలో ఉన్న భవనాన్ని పూర్తిగా వ్యవసాయ శాఖకు రాసిస్తే.. రైతులకు మరింత మేలు జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోదండరెడ్డి తెలిపారు. ఇవాళ సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపిలకు ఈ విషయం చెప్పి స్థలానికి సంబంధించి పేపర్స్‌ను అందజేశారు. అదేవిదంగా యాచారం మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రైతు కమిషన్ కోరింది. దానికి సంబంధించి ప్రైవేట్ స్థలం యాచారం బస్టాండ్‌కు అనుకొనే ఉన్నట్లు కమిషన్ బృందం.. మంత్రికి వివరించారు. ఆ స్థలాన్ని సేకరించి మార్కెట్ను ఏర్పాటు చేయాలన్నారు. ఇక పలు అంశాలపై వ్యవసాయ మంత్రితో కమిషన్ చర్చించింది. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి, అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్ కుమార్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఏవో హరి వెంకట ప్రసాద్‌లు ఉన్నారు.

సీడీకే ఇండియాకు గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా గుర్తింపు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రముఖ ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సీడీకే, భారతదేశంలోని టాప్ 100 మధ్యస్థాయి కార్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' అనే ప్రపంచ ప్రసిద్ధ సంస్థ ఈ పురస్కారాన్ని అందజేసింది. కార్యాలయ సంస్కృతి, ఉద్యోగుల అనుభవం, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలను విశ్లేషించి, మార్కెట్‌లో అగ్రగామిగా నిలిచే సంస్థలను ఈ పురస్కారానికి ఎంపిక చేస్తారు. ఈ అవార్డు సీడీకే ఇండియా తన ఉద్యోగులకు స్వయంప్రతిపత్తి, స్పష్టత, సమగ్రతతో కూడిన వాతావరణాన్ని అందించడంపై దృష్టి సారించిందని తెలియజేస్తుంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్‌గా సీడీకేకి ఈ గుర్తింపు లభించడం మాకు గర్వకారణమని సీడీకే ఇండియా మానవ వనరుల సీనియర్ డైరెక్టర్ ఆశిష్ సక్సేనా పేర్కొన్నారు. మా టీం సభ్యులు ఎలా అభివృద్ధి చెందుతారో, ఎలా సహకారం అందిస్తారనే విషయంలో స్పష్టత ఉండేలా సమ్మిళితమైన, స్థిరమైన, స్కేలబుల్ ప్రక్రియలను మేము నిర్మించామన్నారు. మొదటిసారిగా 'టాప్ 100 ఇండియాస్ మిడ్-సైజ్ వర్క్‌ప్లేసెస్ 2025' గుర్తింపును సాధించడం మాకు మరింత గర్వకారణం. ఎందుకంటే ఆలోచనాత్మకమైన, స్థితిస్థాపకమైన కార్యాలయాన్ని సృష్టించాలనే మా నిబద్ధత ప్రజలకు స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని ఇది రుజువు చేస్తుంది" అని వారు తెలిపారు.

చందూనాయక్ హత్య కేసులో ఐదుగురు అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీపీఐ నేత చందూనాయక్ (50) హత్య కేసులో ఐదుగురు నిందితులను మలక్‌పేట పోలీసులు అరెస్ట్ అయ్యారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. బీహార్ నుంచి తుపాకులు తెచ్చి చందు నాయక్‌ను హత్య చేసినట్లు తేల్చారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాలివాహననగర్ పార్కులో వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తుండగా ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు కళ్లలో కారం చల్లి అనంతరం అతి దగ్గరి నుంచి కాల్పులు జరిపారు. చందు నాయక్‌ను వివాహేతర సంబంధం కారణంగా హత్య చేసినట్లు సమాచారం. వివాహేతర సంబంధం, గుడిసెలు కట్టడంతో పాటు వ్యక్తిగత కారణాలే ఈ హత్యకు ప్రధాన కారణంగా తెలుస్తుంది.

సామాజిక మార్పునకు స్ఫూర్తి ఆర్గనైజేషన్ కృషి అభినందనీయం

విశాలాంధ్ర - ఘట్కేసర్ : శాస్త్రీయ ఆలోచనతో సామాజిక మార్పు కోసం స్ఫూర్తి ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని సిఐ పి. పరుశురాం అన్నారు. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ ఆలోచనతో.. సామాజిక.. మార్పు కోసం మనం కార్యక్రమం ద్వారా చేపట్టు పది అంశాలపై రూపొందించిన పోస్టర్‌ను శనివారం ముఖ్య అతిథిగా సిఐ పి.పరుశురాం పాల్గొని ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంటోళ్ళ యాదయ్యతో కలసి ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నేడు పౌరులు సామాజిక బాధ్యత మరిచి, స్వార్థంతో జీవిస్తున్నారని అన్నారు. కళ్ళ ముందు ఏమిజరిగిన, తమ చుట్టు ఎలా ఉన్నా పట్టించు కోకుండా ఎవరైన వచ్చి చేస్తే బాగుంటుంది, వారే చేయాలి అనడం తప్ప తను ఏమి చేస్తున్నాను, తన బాధ్యత ఏమిటనేది మర్చి పోతున్నారని అన్నారు. స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సమాజ శ్రేయస్సు కోసం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ అను అంశాలపై క్షేత్ర స్థాయి నుండి ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తు ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు మేకల పద్మారావు మాట్లాడుతూ స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కరోన సమయంలో నిరుపేదలకు నిత్యావసర వస్తులు పంపిణీ చేయడం, వరదల సమయంలో వరదలకు ఇండ్లు మునిగిపోయి ఆకలి దప్పికలతో ఉన్న ఎంతో మంది నిరాశ్రయులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగిందని, భారత రాజ్యాంగం విలువలను తెలిపే విధంగా గడప గడపకు మన భారత రాజ్యాంగం కార్యక్రమం ప్లాస్టిక్ నివారణ ఇలా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, శాస్త్రీయ ఆలోచన కలిగిన వ్యక్తులు స్ఫూర్తి ఆర్గనైజేషన్ చేపట్టు కార్యక్రమంలో భాగస్వామ్యం కావలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకిరాం, ఎన్ ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ హరిప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూప, ఆర్గనైజేషన్ సభ్యులు మేకల సురేష్, వరికుప్పల లింగస్వామి, అనిల్ కుమార్, మీసాల రాజేష్ కుమార్, రాజు, నాగరాజు, చెన్నయ్య, పరుశురాం, లంబ రాజు, నరేష్, దశరథ్, సాయి సూరజ్, సంస్కృతి కళాశాల ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ సమస్యల పరిష్కారానికి హింసాత్మక చర్యలు సరికాదు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అల్వాల్‌లో బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ గూండా గిరి చేసి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులను తగువులాటలో దాడికి గురైన చిన్న యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సోషల్ వర్కర్ మండలి రాధాకృష్ణ యాదవ్, జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, వాళ్ళ ఇండ్లలోకి వెళ్ళి వారిని వారి కుటుంబాలను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ స్పీకర్ మధుసూదనచారి, మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మాజీ మంత్రి జోగు రామన్న, గంగుల కమలాకర్, రాజ్య సభ ఎం.పి వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, క్యామా మల్లేష్, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పరామర్శించారు. రాజకీయ సమస్యలను రాజకీయంగానే పరిష్కరించుకోవాలి, హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కాదని వారు అభిప్రాయపడ్డారు. బిఆర్ఎస్ కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్, సబితా అనిల్ కిషోర్ గౌడ్, హేమ శ్యామల, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్, నాయకులు బద్దం పరశురాం రెడ్డి, జీకే హనుమంతరావు, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, భాగ్యనంద్, ఉస్మాన్, వంశీ, లక్ష్మణ్ యాదవ్, శివ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, కార్యకర్తలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

23న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్తంగా జులై 23న జరిగే విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి అంటూ ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు నితీష్, ధర్మ తేజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, శిథిలావస్థ ప్రభుత్వ విద్యాలయాలను నూతన నిర్మాణం చేపట్టాలని, సొంత హాస్టల్ భవనాలను నిర్మించాలని, విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో అమలు పరచాలనీ, 25శాతం ఫ్రీ ఎడ్యుకేషన్ ఇవ్వాలని, పూర్తిస్థాయిలో ఎంఈఓ డిఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ఈ బందుకు విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ మద్దతు తెలియజేయాలని వారు కోరారు.

మహంకాళీ దేవాలయంలో మైనంపల్లి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి మహంకాళీ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్, నాయకులు లక్ష్మీ కాంత్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, చంద్ర శేఖర్, గుండా నిరంజన్,రాందాస్ సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి, సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, మహేందర్ గౌడ్, నాగేష్ గౌడ్, జీడి చరణ్ జీత్ గౌడ్, ఇందిరా ప్రియదర్శిని, ప్రభా, కనక లక్ష్మీ, శారద, సానాది శంకర్, కుట్టి శ్రీనివాస్, సందీప్ గౌడ్, వెంకటేశ్వర్ రావు, బ్రహ్మయ్య, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆధ్యాత్మిక మానసిక ప్రశాంతత ను చేకూర్చేవి ఆలయాలేనని శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి సభ్యులు అన్నారు. ఆనంద్ బాగ్ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పత్రిక సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ అనంతరం బ్రహ్మోత్సవాల కార్యక్రమ విశేషలను వివరించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శ్రావణ శుద్ధ దశమి గురువారం నుంచి శ్రావణ శుద్ధ పౌర్ణమి వరకు 05 ఆగస్టు నుండి 9 వరకు ఐదు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయం కార్యనిర్వాహణాధికారి ఎబి రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించెందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు. 5న కోయిల అల్వార్ తిరుమంజనం అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం పల్లకి సేవ స్వస్తి వాచకం శ్రీ విశ్వక్సేన ఆరాధన పుణ్యాహవాచనం రక్షాబంధనం, ఋత్విక్వరణం మృత్సం సంగ్రహం, అంకురార్పణ ధ్వజపటాది వాసం ఆరగింపు మంగళాశాసనం తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించబడును. 6న గరుడ హెూమం, 7న 10 గంటలకు ఎదుర్కోళ్ళు అనంతరం స్వామివారి కళ్యాణ మహెూత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు హనుమత్ సేవ రథోత్సవం నిర్వహించబడుతుంది. 8న సుదర్శన హెూమం మహా పూర్ణాహుతి చక్రస్నానం వసంతోత్సవం మహాకుంభ సంప్రోక్షణ అనంతరం ఆరగింపు, మంగళా శాసనం తీర్థ ప్రసాద గోష్ఠి, సాయంత్రం పుష్పయాగం ద్వాదశారాధన, సప్తావర్ణాలు, ధూపోత్సవం, డాలోత్సవం, దర్బార్ సేవ, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర కార్యక్రమాలు. 9న ఉత్సవాంత స్నపనం, అరవణి కైంకర్యం, ఆరగింపు మంగళా శాసనం, ఆచార్య ఋత్విక్ సన్మానం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించబడుతుంది. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులు, మాట్లాడుతూ ఆలయంలో పాంచరాత్ర ఆగమం ప్రకారం పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు, చార్యులు, ఆలయ క్లార్క్ సంద్ర సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాది శంకర్, పి గణేష్, ఎం, హేమంత్ కుమార్ జి శ్రీధర్, వి రవీందర్ రెడ్డి, వి అగోండ, అనిత, పద్మావతి, రత్నాకర్‌రావు, సురేష్ కుమార్ సింగ్ మాజీ చైర్మన్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, ఆలయ మాజీ ధర్మకర్త ఎమ్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగ శుభాకాంక్షలు



విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా ప్రజలందరికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటున్నాను అని, తెలియచేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గంలోని ప్రతి గుడికి బోనాల నిధులు మంజూరయేలా కృషి చేశానని, బోనాలు అంగరంగ వైభవంగా జరుపుకునేల బోనాలు నిర్వహించుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నానన్నారు. బోనాల సందర్భంగా ప్రతి గుడి వద్ద అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేశామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండ అన్ని రకాల వసతులు కలిపిస్తూ ప్రశాంత వాతావరణం కలిపించామని, బోనాలు ఎంతో అంగరంగ వైభవంగా జరిగేల అన్ని ఏర్పాట్లను చేశామని, బోనాల పండుగ మంచి ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని గాంధీ తెలియచేసారు.

పికిల్‌బాల్ కోర్టులు ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో ఉన్న సాంక్టా మారియా ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాద్‌లోని ప్రముఖ క్రీడా సంస్థ గేమ్‌పాయింట్‌తో కలిసి తమ క్యాంపస్‌లో ఐదు అత్యాధునిక పికిల్‌బాల్ కోర్టులను ప్రారంభించింది. ఈ కోర్టులను శుక్రవారం స్కూల్ చైర్మన్, అధ్యక్షుడు ఆరోగ్యరెడ్డి, ప్రిన్సిపల్ హేమలత సంజయ్ చేతుల మీదుగా ప్రారంభించబడ్డాయి. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, సిబ్బంది విద్యార్థులు స్నేహపూర్వక మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, సాంక్టా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్రీడా సంస్థ గేమ్‌పాయింట్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా పాఠశాల తరవాత ప్రొఫెషనల్ కోచింగ్ ప్రోగ్రామ్‌లు అందించనున్నట్లు పాఠశాల ఆధునిక క్రీడా వసతులను విశాల సమాజానికి అందుబాటులోకి తేర్చనున్నట్లు వెల్లడించారు. సెయింట్ మేరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ స్కూల్ చైర్మన్, అధ్యక్షుడు ఆరోగ్య రెడ్డి ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ ఈ కొత్త పికిల్‌బాల్ కోర్టులు ఆరోగ్యం, ఆనందం, సమాజ పరస్పర బంధాన్ని పెంపొందించేందుకు గొప్ప అడుగు. పాఠశాల తరవాత సమయాల్లో ఈ పికిల్‌బాల్ కోర్టులు సహా ఇతర ప్రామాణిక క్రీడా వసతులను గేమ్‌పాయింట్ నిర్వహించనున్నారు. గేమ్‌పాయింట్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ పాఠశాల సమయాలకు మించి క్రీడా మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి మేము భాగస్వామ్యం చేసుకున్న మూడవ పాఠశాల ఇది. సాంక్టా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ క్రికెట్ కోసం అద్భుతమైన సౌకర్యాలను అందిస్తుంది.

బిఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉంటా

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : శనివారం, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాథ్, సతీమణి మాగంటి సునీత గోపినాథ్‌ని యూసఫ్‌గూడాలోని క్యాంపు కార్యాలయంలో జూబ్లీహిల్స్ క్రిస్టియన్ ఫోరమ్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ప్రార్థన చేసి అన్ని వేళల బిఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ విద్య సాగర్, బిషప్ యేసు రాజు, బిషప్ ప్రేమ్ సాగర్, రాకేష్ క్రిస్టోఫర్, ఫోరమ్ పాస్టర్లు పాల్గొనడం జరిగింది.

కల్లు కంపౌండ్లను తొలగించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : కల్లు కంపౌండ్లను తొలగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల కల్లు నిషేధాన్ని వ్యతిరేకిస్తూ మొయినాబాద్ మండల కేంద్రంలో మండల గౌడ సంఘం అధ్యక్షులు బసవపురం ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లు గీత సంఘా లు రద్దు.. ఆబ్కారీ శాఖ నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం కూకట్పల్లి కల్తీ కల్లులో జరిగిన ఘటనపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోండి, హైదరాబాద్ మొత్తానికి కల్తీ కల్లు అని నిషేధించడం సరైన పద్ధతి కాదన్నారు. హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని కల్లు గీత సంఘాలు, టీఎఫ్టీలను రద్దు చేసి వాటి పరిధిలో కొనసాగుతున్న కల్లు దుకాణాలను ఎత్తేసేందుకు ప్రభుత్వం చర్చించినట్లు తెలిసిందన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున న్యాయం జరిగేదాకా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. చిలుకూరి గౌడ సంఘం అధ్యక్షులు సుభాష్ గౌడ్, సత్యనారాయణగౌడ్, నరసింహాగౌడ్, మల్లేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బసవరాజ్ గౌడ్, మహిపాల్ గౌడ్ తదితరులున్నారు.

నిరంతర అభ్యాసంతోనే కృత్రిమ మేధపై పట్టు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : కృత్రిమ మేధస్సు యుగంలో నిరంతర అభ్యాసం అవశ్యమని, తద్వారా యువతకు దానిపై పట్టు సాధించే వీలు కలుగుతుందని నాస్కామ్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కార్నిక్ ఉద్బోధించారు. హైదరాబాద్ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టభద్రులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించాలని, వేగంగా మారు తున్న వాతావరణానికి అనుగుణంగా మార్పులను అర్థం చేసుకుంటూ, అభివృద్ధి పథంలో సాగే మనస్తత్వాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడు ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, స్నాతకోత్తర పట్టాలను స్వీకరిస్తున్న వారంతా ఉన్నత లక్ష్యాలతో తమ కలలను నిజం చేసుకోవాలని సూచించారు. గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా మాట్లాడుతూ, సంక్లిష్టమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యార్థులను సన్నద్ధం చేయడానికి తమ దృష్టి అనువాద పరిశోధన, అంతర్ విభాగ (ఇంటర్ డిసిప్లినరీ) అభ్యాసంపై ఉందని తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 32 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. అత్యుత్తమ కృషికి గుర్తింపుగా ముగ్గురు విశిష్ట వ్యక్తులకు గీతం గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేసింది. కల్పకంలోని ఇందిరా గాంధీ అణు పరిశోధనా కేంద్రం (ఐజీసీఏఆర్) పూర్వ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకట్రామన్, భారతదేశ రక్షణ, అంతరిక్ష సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో అణు ఇంజనీరింగ్, విధ్వంసక రహిత మూల్యాంకనంలో తన మార్గదర్శక కృషికి గాను డాక్టర్ ఆఫ్ సైన్స్ (డీ.ఎస్సీ)ని అందుకున్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



విశాలాంధ్ర - మేడిపల్లి: విద్యార్థి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పీర్జాదిగూడలో నివాసముంటున్న జె. శ్రీనివాస్ తండ్రి, తల్లి సుధ ఇద్దరు కుమారులు ఉండగా వారిలో చిన్న కుమారుడు జంగిడి రామ్‌చరణ్ ఏ పందు వయస్సు 17 సంవత్సరాలు, ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేసి ప్రస్తుతం కాలేజీకి వెళ్ళకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ సందర్భంగా జులై 17 గురువారం ఉదయం ఫిర్యాదుదారు ఆయన భార్య తమ పనుల నిమిత్తం బయటికి వెళ్లగా ఇద్దరు కుమారులు ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో చిన్న కుమారుడు రామ్ చరణ్ తన అన్నతో కలిసి మేడ్చల్‌కు బోనాల జాతర కోసం స్నేహితులతో కలిసి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలు దేరాడు. రాత్రి 1 గంట వరకు రాకపోవడంతో ఫోన్ చేయగా అతని మొబైల్ స్విచ్ ఆఫ్ అని వస్తుండడంతో తెలిసిన వారిని బంధువులను అడగగా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడారం జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

మంత్రి సితక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆదివాసిల సంప్రదాయాలను, పూజారుల ఆలోచనలకు అనుగుణంగా మేడారం ఆధునికరణ పనులు చేపట్టాలని సీఎం.రేవంత్ రెడ్డి ఆదేశించారని రాష్ట్ర మంత్రి సీతక్క తెలిపారు. సీఎం ఆదేశానుసారం భక్తులకు సౌకర్యాలు కలిగించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని ఆధునికరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్లో ఉన్న కారణంగా సమావేశానికి రాలేకపోయారని వెల్లడించారు.

వారి సూచన మేరకు మేడారం ఆధునికరణ రాష్ట్రస్థాయి రెండో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలను చాటే విధంగా, సమ్మక్క సారలమ్మ తల్లుల ధీరత్వాన్ని ప్రతిబింబించే విధంగా ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను తీర్చిదిద్దుతామన్నారు. సమ్మక్క సారలమ్మల ప్రధాన గద్దెల్లో ఎలాంటి మార్పులు చేయకుండా పరిసరాలను భక్తుల ఆకాంక్షల మేరకు, పూజారుల ఆలోచనల మేరకు విశాలంగా తీర్చిదిద్దుతామని వివరించారు. పూజారుల ఆలోచనలు కనుగుణంగానే మేడారం మాస్టర్ ప్లాన్ ఉంటుందని, ఒక వారం రోజుల్లో గద్దెల చుట్టూ ఆధునీకరణ పనులకు సంబంధించి ప్లాన్ను సిద్ధం చేస్తామన్నారు.పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామని, పనుల ప్రతి దశలో పూజారుల అభిప్రాయాలను తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు. వచ్చే జాతర లోపు చేయాల్సిన పనులను ముందస్తుగా చేపడుతామన్నారు. భక్తులు పుణ్య స్నానాలు చేసే జంపన్న వాగు అభివృద్ధి కోసం ఐదు కోట్లు మంజూరు చేశామని కావున జంపన్న వాగు పనులను వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సేవలు, భద్రత, వైద్య సిబ్బంది, పూజారులు, భక్తులకు, మీడియా ప్రతినిధులకు మరిన్ని వస్తువులు కల్పించే విధంగా గుడి చుట్టూ ఏర్పాట్లు చేస్తామన్నారు. మేడారంలో బస చేసే భక్తులకు ఎలాంటి లోటు రాకుండా అన్ని ఏర్పాటు చేస్తామని, కుంభమేళాలో భక్తులకు వసతులు కల్పించిన ఏజెన్సీ లను సంప్రదించి వారి సలహాలు తీసుకుంటామన్నారు.

డెంగ్యూ ప్రబలకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ నగరంలో డెంగ్యూ ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ప్రధాన కార్యాలయంలో హెల్త్ అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్లమ్ లతో పాటు గృహాలు, అపార్ట్మెంట్‌లకు వైద్యాధికారులు స్వయంగా వెళ్లి ప్రజా భాగస్వామ్యంతో మంచి నీరు నిల్వ ఉండి దోమల వృద్ధి చెందే ప్రదేశాలను యాంటీ లార్వా ఆపరేషన్ లు చేపట్టాలన్నారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వచ్చే వారం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి దోమలను వృద్ధి జరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ వసతి గృహంలో ప్రతి వారం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. మూసి, జలాశయాలలో దోమల వృద్ధి జరగకుండా చూసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు యుపిహెచ్ దవాఖానాలను ప్రతిరోజూ సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని ఆయన ఆదేశించారు. డెంగ్యూ నిర్ధారణకు ఎలిసా పరీక్ష తప్పనిసరి, జ్వర పీడితులకు డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు విరివిగా నిర్వహించాలని చెప్పారు. పాథాలజీ ల్యాబ్ రాపిడ్ పరీక్షల ద్వారా డెంగ్యూ గుర్తించడానికి వీలు కేసు తప్పనిసరిగా ల్యాబ్ లను సందర్శించాలని ఆదేశించారు. తిరుగు వైద్యులు ఎలిసా పరీక్ష ద్వారానే డెంగ్యూ నిర్ధారణ చేయాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన కాలనీలను వైద్యులు తప్పనిసరిగా సందర్శించి ఆ కాలనీ ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేయాలన్నారు ఎక్కువ కేసులు నమోదు అయిన పక్షంలో. ఫీవర్ సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. అనుమానితులకు విరివిగా పరీక్షలు చేయడంతో పాటు డ్రైడే యాక్టివిటీస్ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. అనంతరం కమిషనర్ వారం రోజుల క్రితం నగరంలో ప్రారంభించిన రోడ్ సేఫ్టీ డ్రైవ్ పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో గుంతలు పూడ్చడం,క్యాచ్ పిట్స్, సెంట్రల్ మీడియం మరమ్మతు పై వివరాలు అడిగారు. మొత్తం 8 వేల గుంతలు గుర్తించగా 4500 గుంతలను పూడ్చివేశామనీ ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు. వచ్చే వారంలోగా అన్ని పనులను పూర్తి చేయాలని చెప్పారు. అలాగే పెండింగ్ స్టార్మ్ వాటర్ డ్రైన్స్, సిఆర్ఎంపి, వాటర్ లాగింగ్ పాయింట్స్ మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నాలా సర్వే సర్కిల్ ఏ ఈ లు క్రియాశీలంగా వ్యవ హరిస్తాయని 150 వార్డుల వారిగా సర్వే చేసేందుకు కసరత్తు జరుగుతున్నదని భవిష్యత్తు లో నాలా ప్రణాళిక కు ఉపయోగ పడుతున్నారు. మ్యాన్ హెూల్స్, క్యాచ్ పిట్ ల లెక్కలు కూడా

23న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 23న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్య సంస్థల బంద్‌కు సంబందించిన గోడపత్రికను స్థానిక దిల్ సుఖ్ నగర్ సాయి చైతన్య జూనియర్ కళాశాలలో గ్రేటర్ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్, ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ అధ్యక్షులు చైతన్య యాదవ్, పిడిఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మంద నవీన్, పిడిఎస్.యు హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గణేష్, పిడిఎస్.యు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సైదులు హాజరై బంద్‌కు సంబందించిన పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలు తీసుకోడం కారణంగా అధికారాన్ని కోల్పోయింది. కెసిఆర్ ను గద్దె దించే పోరాటల్లో ఈ వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రధాన పాత్ర పోషించాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనా అందిస్తామని అధికారంలోకి వచ్చిన ఈ రేవంత్ రెడ్డి సర్కార్ 2 సంవత్సరలు కావస్తున్న కూడ ఇప్పటి వరకు పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోగ కనీసం విద్య రంగం ఎదురకొంటున్న సమస్యలపై ఒక సమీక్షా నిర్వహించకుండా ఇప్పటివరకు విద్య శాఖ మంత్రిని నియమించకుండా, ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ ప్రవేట్ కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ విచ్చలవిడిగా ప్రవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్రకు తెరలేపుతూన్నా రన్నారు. ప్రజా పాలనా అని మాటల్లో చెపుతూ, ఆచరణలో అప్రజాస్వామ్య పాలనా కొనసాగుతుందన్నారు. కొని ఇచ్చిన హామీలను అమలు చేస్తూ,ఎలాంటి పెండింగ్ బకాయిలు విడుదల చేయకుండా, విద్య రంగంలో ఉన్నా అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తూ, ఫీజు నియంత్రనా చట్టం తీసుకోస్తు, విద్యార్థులందరికి ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, జాతీయ నూతన విద్య విధానాన్ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలనీ డిమాండ్ చేసారు. తెలంగాణ రాష్ట్ర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23 న తలపెట్టిన విద్య సంస్థల బంద్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని బంద్ ను విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నరేష్, ఉదయ్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నాణ్యమైన ఆహారం అందించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే సుచి శుభ్రతతో గల నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న అన్నారు. శనివారం నాంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచనల మేరకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమశాఖ వసతిగృహాల వంట మనుషులకు ఆహార పదార్థాల వండించే అంశం, సూచి, శుభ్రత పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో పాఠశాలలు, వసతి గృహల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థికి కూడా సుచి శుభ్రతతో నాణ్యమైన ఆహార పదార్థాలలో అందించే బాధ్యత ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారుల పై ఉన్నదని ఆయన అన్నారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలతో ఉండాలని వంటలు చేసే సమయంలో వంట మనుషులు పలు జాగ్రత్తలు వహించాలని, వంటగదిని, వంట పాత్రలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. త్రాగునీటి ట్యాంకులను తరచుగా శుభ్రం చేయాలని ముఖ్యంగా నీటితోనే అన్ని ఉత్పన్నమవుతుంటాయని సూచించారు. కాంట్రాక్టర్లు అందించి పరిశీలించాలని, కల్తీని, గడువు తేదీలను గుర్తించాలని సూచించారు. అలాగే వసతి గృహల్లో సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా తనిఖీలు చేస్తూ ఉండాలని అన్నారు. వస్తే గృహాల్లో వంటలు, ఆహార పదార్థాలు వండించే వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని రెసిడెన్షియల్ పాఠశాలలో వసతి గృహాలకు వచ్చే కూరగాయలు పండ్లు గుడ్లు ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. తుదుపరి వంట మనుషులకు కిచెన్‌లో వంట మనుషులకు ఫుడ్ సేఫ్టీ ఇండియా అధికారులు, సిబ్బందితో వంటలు చేపట్టే విధానం, వంట గదిలో శుభ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి, ఇలియాస్ అహ్మద్, టి విజయ్ కుమార్ రిటైర్డ్ డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్, ఖలీల్, ధర్మేందర్ పాల ఫస్ట్ అండ్ ఫుడ్ కంట్రోలర్, వసతి సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వంట మనుషులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాప్రా : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యా శాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాపిత పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ కు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, బంద్ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొంటుందని, ఈ రాష్ట్ర వ్యాపిత బంద్ కు సంబంధించిన గోడ పత్రికను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని అంబేద్కర్ కూడలి వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకు రావాలని అనేక సంవత్సరాలుగా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటాలు చేస్తున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోకడం వల్లనే విద్యారంగం కుంటుపడిందని, దీనికి ప్రధాన కారణం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని వారు ఆరోపించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఇఓ, డీఈఓ, తదితర పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో అవినీతిని, గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల రూపాయల విద్యార్థుల ఉపకార వేతన బకాయిలను, బోధనా రుసుములను లను విడుదల చేయాలని,రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించి, నిధులు కేటాయించాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు విడుదల చేయాలని, విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్ పాస్ సౌకర్యాన్ని కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట ఉద్యోగ క్యాలెండర్ ను విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, యూత్ డిక్లరేషన్ ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ బంద్ కు ఏఐవైఎఫ్ నేతలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పాల్గొంటారని, అదే విధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, విద్యావేత్తలు సహకరించి, పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సాయిలు, రవి, కుమార్, రవళి, ఫాతిమా, అనసూయ పాల్గొన్నారు.

ఉచితంగా ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా భాషా, తెలంగాణ సాంస్కృతిక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ (శాప్) సంయుక్త ఆధ్వర్యములో ఉచితంగా 5వ బ్యాచ్ ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు నిర్వహిస్తున్నామని అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్ వెల్లడించారు. యువత ఫోటోగ్రఫీ నేర్చుకొని, ఉపాధికోసం వృత్తిగా స్వీకరించడానికి ఉత్సాహంగా ఉన్నట్లయితే, వారు ఈ సమగ్ర ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించే ఈ ఆరు నెలల (ఆఫ్ లైన్) ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు లో ప్రవేశానికి ఫోటోగ్రఫీ అభిరుచి గలవారు లేదా వృత్తిగా స్వీకరించేవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్, హిమాయత్ నగర్, సిగ్మా కార్యాలయంలో శనివారం "5వ బ్యాచు" ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు వాల్ పోస్టర్‌ను అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్‌తో కలిసి భాష, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ప్రచార గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ యువత ఫోటోగ్రఫీ నేర్చుకోవడం పట్ల ఉత్సాహంగా ఉన్నట్లయితే, వారు ఈ సమగ్ర ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉపాధి పొందవచ్చునని తెలిపారు. ప్రాథమిక ఫోటోగ్రఫీ తోపాటు వెడ్డింగ్, ఇండస్ట్రియల్, ఫాషన్, పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, అధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్ లలో కలిగిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందని, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గత నాలుగు బ్యాచ్ లలో దాదాపు 1600 మందికి పైగా యువత విజయవంతంగా ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు అభ్యసించారని అన్నారు. ఈ 5వ బ్యాచ్ ఉచిత ఫోటోగ్రఫీ డిప్లొమా కోర్సు 05 ఆగస్టు, 2025వ తేదీ నుండి శిక్షణ తరగతులు ప్రారంభమౌతాయని, ఆసక్తి కల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నంబర్లలో (8008021075 - 7095692175) ఉదయం 9నుండి సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని,ఆన్లైన్ లో రిజిస్టర్ చేసుకునే వారు ఇక్కడ ఇచ్చిన లింక్ ద్వారా చేసుకోవచ్చునని https://sapindia.org/diploma-course ఆఖరు తేదీ 31 జులై, 2025 అని ఎం.సి.శేఖర్ వెల్లడించారు.

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు వర్ష సూచన

విశాలాంధ్ర - హైదరాబాద్ : రానున్న రెండు గంటల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనీ బీరంగూడ, ఆర్‌సీ పురం, మియాపూర్, సెరిలింగంపల్లి, చంద్రాయణగుట్ట, హయత్‌నగర్, బాలాపూర్, షంషాబాద్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో చెదురుమదురుగా ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరిక జారీ చేసింది. మధ్యాహ్నం 2:30 తర్వాత ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిహెచ్ఎంసి ప్రజలకు సూచించింది.

న్యాయవ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : న్యాయవ్యవస్థలో తక్షణమే సంస్కరణలు చేపట్టవలసిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శనివారం బషీబార్ ప్రెస్ క్లబ్లో ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్, గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ఫాస్ట్ జస్టిస్ సంయుక్త ఆధ్వర్యంలో సకాలంలో న్యాయం కోసం న్యాయ సంస్కరణలు అత్యవసరం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓయూ లా పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ అపర్ణ, హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రఘునాథ్‌లు పాల్గొని మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో ప్రవేశపెట్టి చట్టాలే న్యాయవ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. న్యాయవ్యవస్థలో సమూల మార్పులు తేవాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. సత్వరమే న్యాయం జరగాలంటే న్యాయవ్యవస్థలో మార్పులు అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సదస్సులో హైకోర్టు న్యాయవాది నాజీర్ ఖాన్, ఫోరం ఫర్ ఫాస్ట్ జస్టిస్ చైర్మన్ భగవాన్జీ బాయ్ రైయని, కన్వీనర్ ప్రవీణ్ పటేల్, న్యాయవాదులు టీవీ రమేష్, సయ్యద్ ముజీబ్దీన్, తదితర హైకోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆధ్యాత్మికతతో కూడిన క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విశాలాంధ్ర - కాప్రా : ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుండి ఆధ్యాత్మికతతో కూడిన క్రమశిక్షణ అలవర్చుకోవాలని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ కె నవనీతరావు సూచించారు. ఆధ్యాత్మికత పిల్లలలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీస్తుందన్నారు. నాచారం డివిజన్, రాఘవేంద్ర నగర్‌లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నవనీత రావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, కోర్ హెడ్ ఆపరేషన్ కిషోర్ కుమార్ రెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణ అక్కినేని, వైస్ ప్రిన్సిపాల్‌తో కలిసి బోనం సమర్పించారు. కలిసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మనకు చెడుపై మంచి విజయం అనే సందేశం ఇస్తుందన్నారు. విద్యార్థులు బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి, పోతరాజులు వేషాదరణతో పలువురిని అలరించాయి. చిన్నారుల ప్రదర్శనతో పాఠశాల పండగ వాతావరణం సంతరించుకుంది.

గీతంలో సాహితీకి బంగారు పతకం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : తల్లిదండ్రుల కన్న కలలు నెరవేర్చాలని సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశం ప్రేరణతో ఐఏఎస్ దిశగా ముందుకు సాగుతుంది ఓ యువతి. దీనిలో భాగంగానే గీతం విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ పొలిటికల్ సైన్స్ విభాగంలో సాహితీ బంగారు పతకాన్ని సాధించింది. శనివారం గీతం చైర్మన్ భరత్, వైస్ చాన్సలర్ డీఎస్ రావుల చేతుల మీదుగా ఈ పతకాన్ని అందుకుంది. జనగాం జిల్లా ఓబుల్ కేశ్వాపూర్‌కు చెందిన రాఘవరెడ్డి టీవీ 9లో పటాన్ చెరువు నియోజకవర్గం స్ట్రింగర్‌గా పని చేస్తున్నారు. భార్య లక్ష్మి అంగన్వాడీ టీచర్‌గా సేవలందిస్తుంది. వీరికి ఉన్న ఇద్దరు పిల్లల్లో సాహితీ తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ఉన్నతంగా ఎదగాలని కృషి చేస్తుంది. దీనిలో భాగంగానే తాను చదివిన బ్యాచిలర్ ఆర్ట్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశం ప్రేరణతో ప్రజలకు సేవలు అందించేందుకు సివిల్ సర్వీస్‌ను ఎంపిక చేసుకుని దానికి తర్ఫీదు పొందుతుంది. సివిల్స్ కోసం మరింత కష్టపడి తల్లిదండ్రుల ఆశను నెరవేర్చి పేద ప్రజలందరికీ సేవలందిస్తానని సాహితి చెబుతోంది.

నీళ్లు వృథా కానివ్వద్దు

- జల వనరులు కాపాడుకోవాలి
- నీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- రేవంత్, చంద్రబాబుకు నారాయణ సూచనలు

న్యూదిల్లీ: కృష్ణా, గోదావరి నీళ్లు వృథా కానివ్వద్దని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సూచించారు. జల వనరులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జల వివాదం నేపథ్యంలో ఇద్దరు ముఖ్యమంత్రులు దిల్లీ వేదికగా చర్చలు జరపడం స్వాగతించే అంశమని తెలిపారు. నారాయణ శుక్రవారం దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సాధన ఉంటే ఏదైనా సాధించవచ్చని నొక్కి చెప్పారు. కృష్ణా, గోదావరి నది జలాలు సముద్రంలోకి వృథాగా వెళ్లకుండా ఒడిసిపట్టుకోవాల్సిన అవసరం రెండు రాష్ట్రాలకు ఉందన్నారు. మిగులు జలాలు 2000 టీఎంసీలకుపైగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రుల చర్చల అనంతరం నీటి సమస్యల పరిష్కారం దిశగా ఇబ్బందులు ఉన్నాయి కాబట్టే కమిటీ వేశారని, దీనిని నాన్చవద్దని సూచించారు. ఏ ప్రాజెక్టు కట్టాలో ఏది వద్దో ముందే నిర్ణయించాలని సూచన చేశారు. మిగులు జలాలపై అంచనా ఉంటే సమస్యకు పరిష్కారం లభించగలదని నారాయణ అన్నారు. కాళేశ్వరం సమస్య అయినా, సాంకేతిక సమస్య అయినా కేంద్రమే పరిష్కరించాలని నొక్కిచెప్పారు. 1950 నుంచి రాయలసీమ నీరు కోసం పోరాడుతోందని, కమ్యూనిస్టుల అధ్వర్యంలో అనేక పోరాటాలు జరిగాయని, తాను విద్యార్థి నాయకుడి ఉన్నప్పుడు కూడా పోరాటం జరిగిందని నారాయణ చెప్పారు. సెంటిమెంట్లు ఎప్పుడూ పనిచేయవని, వాటిని రెచ్చగొట్టే ప్రయత్నాలను పార్టీలు మానుకోవాలన్నారు. 'ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయినప్పుడు సెంటిమెంట్ వచ్చింది కాబట్టే ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలిచారు. తెలంగాణ సెంటిమెంట్‌పైనే కేసీఆర్ పదేళ్ల పాలన సాగింది. టీఆర్ఎస్ ఎప్పుడైతే బీఆర్ఎస్ అయిందో తెలంగాణ సెంటిమెంట్ పోయింది' అని నారాయణ అన్నారు. కేసీఆర్ కేబినెట్లో 12 మంది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వారున్నట్లు గుర్తుచేశారు. 'తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రస్తుత ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు గురు శిష్యులు లెక్కనే అయిపోయింది. రేవంత్ రెడ్డి తెలంగాణకు అన్యాయం చేయరు. బీఆర్ఎస్ రాజకీయంగా పోరాటం చేయాలి తప్ప విమర్శలతో పబ్బం గడుపుకోవాలని అనుకోవడం తగదు' అని వ్యాఖ్యానించారు. నీళ్లపై రాజకీయం వద్దని ఇద్దరు సీఎంలకు ఆయన మరోసారి సూచించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు సాగునీరు అందించేందుకు కృషి జరగాలన్నారు. నీటి ప్రాజెక్టులకు సీపీఐ ఎప్పుడూ సానుకూలమేనని నారాయణ చెప్పారు. 'రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞాన్ని స్వాగతించాం. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిని మాత్రమే వ్యతిరేకించాం. బనకచర్ల విషయం వచ్చినప్పుడు ముందు నిర్మాణ దశలోని హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని చంద్రబాబుకు సూచించాం. బనకచర్ల ప్రాజెక్టు పేరు తెరపైకి రాగానే రాజకీయ లబ్ధి కోసం అందరూ మాట్లాడుతున్నారు. సీపీఐ మాత్రం ఎప్పుడు ప్రజల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుంది' అని నారాయణ వెల్లడించారు.

రాజ్యాంగ హక్కులకు భంగం కలిగిస్తే
కలిసి బుద్ధి చెబుదాం

- మతతత్వ శక్తుల కుట్రలు తిప్పికొడదాం
- సర్కారు మెడలు వంచేందుకు ఏకమవుదాం
- లౌకికవాదులు, వామపక్షాలకు రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-అమలాపురం: రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ, రాజ్యాంగబద్ధ హక్కులకు భంగం కలిగిస్తే కలిసి కట్టుగా బుద్ధి చెబుదామని లౌకికవాదులు, కార్మికులు, కర్షకులు, వామపక్షాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. మతతత్వశక్తుల కుట్రలను తిప్పికొడదామన్నారు. కార్మిక-కర్షక-ప్రజా వ్యతిరేక... కార్పొరేట్ అనుకూల విధానాలను అసరించే సర్కారు మెడలు వంచేందుకు ఏకమవుదామని పిలుపునిచ్చారు. సీపీఐ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెండవ మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. మహాసభలకు ముఖ్యఅతిథిగా రామకృష్ణ హాజరయ్యారు. రాజ్యాంగాన్ని మార్చే మోదీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. దేశంలో పేదరికం రెండు శాతమే అని మోదీ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోందని, అదే నిజమైతే 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ ఎందుకని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో అన్ని కార్మిక సంఘాలతో కలిసి కేంద్ర ప్రభుత్వంపై సంఘటిత పోరాటం చేస్తామని రామకృష్ణ అన్నారు. విదేశీ బ్యాంకుల్లో మగ్గుతున్న నల్లధనాన్ని వెనక్కి తెచ్చేది ఎప్పుడని ప్రధానిని ప్రశ్నించారు. మోదీ వంటి మోసకారి నాయకుడు మరొకరు ఉండరన్నారు. పారిశ్రామివేత్తలకు, కుబేరులకు దేశ సంపదను దోచి పెట్టి, సంపన్నులకు దేశాన్ని తాకట్టు పెట్టేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోసకారి పాలన సాగిస్తున్నారని, 21సార్లు దిల్లీ వెళ్లారు కానీ రాష్ట్రానికి ఏం తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి ప్రజలను బికారులుగా చేస్తున్నారని చంద్రబాబును రామకృష్ణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ భారత్, పాకిస్థాన్ యుద్ధంలో అమెరికా అధ్యక్షుడి జోక్యాన్ని ప్రశ్నించలేని అసమర్థ ప్రధాని మోదీ విమర్శించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి సత్తిబాబు, రాజేంద్రప్రసాద్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ఉద్యమాలకు సమాయత్తం

21, 22 తేదీలలో దిల్లీలో కిసాన్ సభ జాతీయ సమితి సమావేశాలు: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం అనుసరించే రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఉద్యమాలకు అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) సంసిద్ధమైంది. రైతాంగ సమస్యల పరిష్కారానికి చేసే పోరాటాలు, భవిష్యత్ ఉద్యమాలపై ఈనెల 21, 22 తేదీల్లో జరగబోయే జాతీయ సమితి సమావేశాల్లో తీర్మానిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సమితి సమావేశాలు న్యూదిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో జరుగుతాయన్నారు. తమిళనాడులోని నాగపట్నంలో జరిగిన జాతీయ మహాసభలలో ఆమోదించిన తీర్మానాల అమలు కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం వల్ల దేశ రైతాంగం నష్టపోతుందని, రైతుల ప్రయోజనాలు కాపాడటంపై కేంద్రం దృష్టి లేదని వ్యాఖ్యానించారు. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో మార్కెట్ ధరలు పడిపోయి రైతులు నష్టపోతున్నారని, దిగుమతి సుంకాల తగ్గించడం వల్ల శనగ, మినుము తదితర పంటల ధరలు తగ్గిపోయాయన్నారు. న్యూదిల్లీలో ఆదివారం జరిగే సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జాతీయ సమావేశాలలో రైతాంగ వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు కేవీవీ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్రం నుంచి కిసాన్‌సభ జాతీయ సమితి సభ్యులు పి.జమలయ్య, పి.గంగాభవాని, కె.వీరారెడ్డి, బుడితి అప్పలనాయుడు తదితరులు హాజరవుతారన్నారు.

కగార్ పేరుతో హత్యలు రాజ్యాంగ విరుద్ధం

పౌర, ప్రజాసంఘాల నేతల శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీల హత్యలు ఆపాలని పౌర, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖలో ప్రజా సంఘాల వేదిక అధ్వర్యంలో డాబా గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు శనివారం శాంతి ర్యాలీ జరిగింది. పెద్ద సంఖ్యలో పౌర, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విరసం ప్రతినిధి పినాకపాణి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయి స్టులతో శాంతి చర్చలు జరపాలని మూడు నెలలుగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష, విప్లవ శక్తులు డిమాండ్ చేస్తున్నా యని గుర్తుచేశారు. మార్చి 28న మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణ ప్రకటించి... శాంతి చర్చలకు సిద్ధమని పేర్కొన్నదని, దీనికి కేంద్రం ముందుకు రావడం లేదని తెలిపారు. ఆదివాసి ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 1న ఆపరేషన్ కగార్ ప్రారంభించిందని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఆదివాసీలు అంగీకరించడం లేదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా మావోయిస్టుల అధ్వర్యంలో ఆదివాసీయులు పోరాడుతున్నారని చెప్పారు. దేశాన్ని కార్పొరేట్ ఇండియాగా మార్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అద్భుతమైన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మిక, ప్రజాస్వామ్య శక్తులు పోరాడుతున్నాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో గ్రామసభల అనుమతితోనే కార్యకలాపాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించే అధికారం ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణలో లక్షలాది మంది పారా మిలటరీ బలగాలు, సైన్యాన్ని మోహరించి ఖనిజ సంపద తవ్వకాలకు అడ్డు తొలగించుకోవాలని కేంద్రం ప్రయత్నిస్తోందని చెప్పారు. అనేకమంది మావోయిస్టు పార్టీ అగ్రనేతలను కాల్చి చంపారని చెప్పారు. మావోయిస్టులతో శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చేంత వరకు వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తామని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో మావోయిస్టులను నిర్మూలించి... వేల ఎకరాల అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని కేంద్రం భావిస్తోందని విమర్శించారు. అందుకోసం రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఆదివాసి ప్రాంతాల్లో పోలీసులు హత్యాకాండ సాగిస్తున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్‌తో యుద్ధం విరమించిన కేంద్ర ప్రభుత్వం... మావోయిస్టులతో చర్చలకు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. జీవించే హక్కును కబళించే హక్కు ఎవరికీ లేదన్నారు. సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ పూనుకున్నారన్నారు. అందుకోసం అడవుల్లో ఆదివాసీలు, మావోయిస్టులు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మానవ హక్కుల వేదిక ప్రతినిధి వీఎస్ కృష్ణ మాట్లాడుతూ రాజకీయాలను హింస ద్వారా ఎదుర్కొనే ధోరణి కేంద్రం అనుసరిస్తోందని విమర్శించారు. హత్యలు చేసి మావోయిస్టులను నిర్మూలించాలని భావించడం ప్రజాస్వామ్యం కాదని అన్నారు. మావోయిస్టుల మృతదేహాలకు కుటుంబ సభ్యుల సమక్షంలో వీడియోగ్రఫీతో పోస్టుమార్టం నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ... పోలీసులు ఖాతరు చేయడం లేదని చెప్పారు. మృతదేహాల కోసం మావోయిస్టుల కుటుంబ సభ్యులను ముప్పు తిప్పలు పెడుతున్నారన్నారు. పీఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వై.కొండయ్య, భారత్ బచావో ప్రతినిధి శ్రీనివాస్, ఏఎఫ్‌టీయూ నాయకులు దుర్గాప్రసాద్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, జిల్లా కార్యదర్శి ఎం బేగం, జిల్లా అధ్యక్షురాలు వనజాక్షి, పద్మ, పుష్పలత, జయ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చోడిదాసి సుధాకర్, ప్రముఖ న్యాయవాది సలీం, అమరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధి పద్మ, న్యాయవాది చలం, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు శ్రీరామ్మూర్తి, లీడర్ దినపత్రిక సంపాదకులు వి.రమణ మూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి రెహమాన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ పాల్గొన్నారు. పౌర, ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.

ఆర్టీసీ స్థలాలు లూలూకు కట్టబెట్టొద్దు

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడలో పాత బస్టాండ్, విద్యాధరపురం డిపో వంటి అతి విలువైన ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకు కట్టబెట్టడాన్ని విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విజయవాడలో అత్యంత చారిత్రక నేపథ్యం గల అతి విలువైన పాత బస్టాండ్, విద్యాధరపురం ఆర్టీసీ డిపో వంటి స్థలాలను బహుళజాతి సంస్థ లూలూ గ్రూపునకు అప్పగించాలనుకోవడం తగదు. ఆయా స్థలాల్లో లూలూ ఇంటర్నేషనల్ కంపెనీ కమర్షియల్ మాల్ నిర్మించేందుకు సన్నద్ధమవుతున్నట్లు వార్తలొస్తున్నాయి. దాదాపు రూ.400 కోట్ల విలువైన విజయవాడ పాత బస్టాండ్ స్థలంతోపాటు భారీ విలువగల విద్యాధరపురం డిపో స్థలాన్ని కూడా కార్పొరేట్ సంస్థకు కారుచౌకగా లీజు ప్రాతిపదికన కట్టబెట్టేందుకు చూడడం దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో అతి విలువైన ఆర్టీసీ స్థలాలను కార్పొరేట్ సంస్థలకు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. తక్షణమే ఆ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

కరుణానిధి పెద్ద కుమారుడు, స్టాలిన్ సోదరుడు
ఎంకే ముత్తు కన్నుమూత

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పెద్ద కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోదరుడు, మాజీ నటుడు ఎంకే ముత్తు (77) మృతి చెందారు. ఈ మేరకు స్టాలిన్ శనివారం ప్రకటించారు. ముత్తు... కరుణానిధి మొదటి భార్య పద్మావతి సంతానం. సోదరుడి మరణం తనను కలచివేసిందని ఎక్స్‌లో స్టాలిన్ పేర్కొన్నారు. 'అన్నయ్య ముత్తు ఉదయం మరణించారు. ప్రియమైన సోదరుడిని కోల్పోయిన బాధను వర్ణించలేను. అమ్మానాన్నలతో సమానంగా ప్రేమను అన్నయ్య నాకు పంచారు. ఇప్పుడు ఆయన నాతో లేరు. ఈ బాధ తట్టుకోలేకపోతున్నా' అంటూ సీఎం భావోద్వేగ పోస్టు పెట్టారు. 'ముతువేలర్ జ్ఞాపకంగా అన్నయ్యకు ఎంకే ముత్తు అని పేరు పెట్టాలన్నది కలైంగర్ నిర్ణయం. కలైంగర్‌లానే ముత్తు కూడా ద్రవిడ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. యువకుడిగా ఉన్నప్పుడు నాటకాల ద్వారా ఆయన తన వంతు తోడ్పాటు అందించారు' అని పేర్కొన్నారు. ముత్తు స్వరం మధురమని, ఆయన పాటలు బాగా పాడేవారని స్టాలిన్ గుర్తుచేసుకున్నారు. 'వయస్సు మీద పడిన కారణంగా అన్నయ్య మరణించినప్పటికీ, ఆయన మా హృదయాల్లో చిరకాలం ఉంటారు. ఆయన నటన, పాటలు ప్రజలు మరిచిపోరు. ప్రియమైన సోదరుడికి ప్రేమతో నివాళులర్పిస్తున్నా' అని స్టాలిన్ పేర్కొన్నారు.

పలక బలపం చేతబట్టి
బడిబాట పట్టి...

- మావోయిస్టు ప్రభావిత గ్రామంలో మోగుతున్న బడిగంటలు
- చిన్నారుల అక్షరాభ్యాసం
- స్ఫూర్తిగా మారిన భట్టిగూడ

విశాలాంధ్ర-చింతూరు: ఒకప్పుడు మావోయిస్టు అగ్రనేతలకు రక్షణ ప్రాంతంగాను, శిక్షణా కేంద్రంగాను ఉంటూ నిత్యం బాంబు పేలుళ్లు, తుపాకుల కాల్పులు, బుల్లెట్ల శబ్దాలు వినిపించే మావోయిస్టుల ప్రభావిత గ్రామంలో నేడు చిన్నారులు పలక బలపం పట్టి అక్షరాభ్యాసం చేస్తున్నారు. ఏ బీ సీ డీలు... అ ఆ ఇ ఈ క ఖ గ ఘలు వల్లెవేస్తున్నారు. గంట మోగగానే పాఠశాలకు పరుగులు తీస్తున్నారు. ఇదంతా చూస్తూ చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్ది ప్రపంచానికి పరిచయం చేయాలని కలలుగంటున్నారు. విద్యా కుసుమాల భవిష్యత్‌కు గట్టి పునాది వేయాలని కంకణం కట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఉసుర్‌బ్లాక్‌లోని భట్టిగూడ... నాడు భద్రతాదళాల శిబిరాలతో భయంభయంగా ఉండేది. ఏడాది క్రితం వరకూ బిక్కుబిక్కుమంటూ గ్రామస్థులు జీవించేవారు. ఏక్షణంలో ఏం ఉపద్రవం ముంచుకొస్తుం దోనని భయాందోళనతో కాలం గడిపే వారు. మావోయి స్టుల వ్యతిరేక కార్యకలాపాలు... ఒత్తిడి తగ్గుదల కనిపిస్తుండడంతో స్వతంత్ర భారతదేశంలోనే మొదటిసారిగా 'స్కూల్ ఫిర్ చలో అభియాన్-2025' కింద భట్టిగూడలో కొత్తగా ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. పిల్లలు ఇప్పుడు బహిరంగంగానే గుడిసె కింద చదువుకుంటున్నారు. మొదటి రోజు 65 మంది పిల్లలను చేర్చుకున్నారు. పిల్లలకు స్కూల్ బ్యాగులు, కాపీ పుస్తకాలు, స్పోర్ట్స్ డ్రెస్‌తో సహా మూడు సెట్ల స్కూల్ యూనిఫాం అందజేశారు. అదే ప్రాంతానికి చెందిన యువకుడిని విద్యా రాయబారిగా నియమించారు. కొత్త పాఠశాలలో ఇద్దరు వంటవాళ్లు, ఒక శుభ్రపరిచే కార్మికుడిని కూడా నియమించారు. ప్రస్తుతం ఆ గ్రామంలో 200 మందికి పైగా పిల్లలు ఉన్నారు. భట్టిగూడ చేరుకున్న విద్యాశాఖ బృందం... గ్రామస్థులతో చర్చించి, పెద్ద పిల్లలను సమీపంలోని బాసగూడ, తిమ్మాపూర్ పాఠశాలల్లో చేర్పించాలని సలహా ఇచ్చింది. 200 మందికి పైగా ఉన్న పిల్లలను విద్యతో అనుసంధానించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. నదులు, వాగులు, బురదమయమైన రోడ్ల ద్వారా భట్టిగూడ చేరుకోవడం అంత సులభం కాదు. అయినా... ఏస్పీసీ, బీఈఓ, బీఆర్‌సీ, మండల కోఆర్డినేటర్, క్లస్టర్ కోఆర్డినేటర్... ద్విచక్ర వాహనాలపై బీజాపూర్ నుంచి 85 కి.మీ దూరంలో ఉన్న భట్టిగూడ చేరుకున్నారు. బీజాపూర్- అవపల్లి నుంచి బయలుదేరిన బృందం ముందుగా తారెం చేరుకుంది. అక్కడి నుంచి చిన్నగెల్లూరు, గుండం, చుద్వాయి మీదుగా కొండపల్లి... అక్కడి నుంచి బృందం భట్టిగూడకు చేరుకుంది. భట్టిగూడ ఒకప్పుడు మావోయిస్టు అగ్ర నాయకులకు సురక్షిత ప్రాంతంగా, శిక్షణా కేంద్రంగా ఉండేది. తారెమ్ నుంచి పామెడ్ వరకు 48 కి.మీ. రహదారిని నిర్మించడానికి ఈ ప్రాంతంలో అర డజనుకు పైగా భద్రతా దళాల శిబిరాలను ఏర్పాటు చేశారు. చిన్నగెల్లూరు, చుద్వాయి, గుండం, కొండపల్లి, కవరగట్ట-1, కవరగట్ట-2, జీడ్‌పల్లి-1, జీడ్‌పల్లి-2, ధర్మారం, పామెడ్‌లలో కొత్త శిబిరాలను ప్రారంభించారు. దీంతో మావోయిస్టు ప్రభావం తగ్గడంతో నేడు ప్రాథమిక అవసరాలు ప్రజల వద్దకు చేరుకోవడం జరుగుతోంది. ఇదిలా ఉండగా... ఉసుర్ బ్లాక్ రిసోర్స్ కోఆర్డినేటర్ పి.రామకృష్ణ భాస్కర్ మాట్లాడుతూ... మొదటి రోజే పాఠశాలలో చేరిన పిల్లల సంఖ్య 75 అని, వారిలో 65 మందికి ప్రవేశాలు కల్పించడంతో చదవడం మొదలుపెట్టారని చెప్పారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అర్హత ఉన్న చిట్టచివరి లబ్దిదారుడి వరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని, ఈ పథకంలో రైతు అర్హతను సూచించే వివిధ వేదికల గురించి, టోల్ ఫ్రీ నంబర్లపై మరింత ప్రచారం కల్పించాలని వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు అధికారులను శనివారం ఆదేశించారు. వ్యవసాయ శాఖ రైతులకు వారి అర్హత స్థితిని తెలుసుకునే వివిధ టోల్ ఫ్రీ నంబర్లను, సైట్ అడ్రస్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వివిధ ప్రచార సాధనాల ద్వారా ఈ సమాచారం రైతులకు చేరేలా చేశామన్నారు. వీటి ద్వారా రైతులు వారి అర్హత స్థితిని తెలుసుకుని, తద్వారా వారు ఫిర్యాదుల/గ్రీవెన్స్ స్వీకరణ మాడ్యుల్‌లో సంబంధిత రైతు సేవా కేంద్రాలలో వారి అభ్యర్థనను నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించటంపై మరింత ప్రచారం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించామని చెప్పారు. భూ యజమానులు, అటవీ భూమి సాగుదారుల డేటా పరిశీలన, ధ్రువీకరణ పూర్తయిందని... ఈ పథకంలో రైతుల అర్హతను సూచించే వివిధ వేదికలను డిల్లీ రావు తెలుపుతూ వెబ్‌ల్యాండ్, అటవీ భూమి సాగుదారుల డేటా ఆన్‌లైన్ పరిశీలన కోసం అన్నదాత సుఖీభవ పోర్టల్ గత వారంలో విడుదల చేసినట్లు తెలిపారు. అర్హత తెలుసుకోవడానికి లింక్ annadathasukhibhava.ap.gov.in ద్వారా దూర ప్రాంతాల రైతులు అర్హత, అనర్హత, వాటి కారణాలను తెలుసుకోవచ్చని తెలిపారు. అర్హత గల రైతుల జాబితాలు వారి అర్హత స్థితిని పరిశీలన చేయడానికి సంబంధిత రైతు సేవా కేంద్రాల నోటీస్ బోర్డుల వద్ద ప్రదర్శించినట్లు ఆయన వివరించారు. రైతులు ఫోన్ ద్వారా వారి అర్హత స్థితిని తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ నంబర్ 155251 కు ఫోన్ చేయవచ్చన్నారు. మన మిత్ర వాట్సాప్ ద్వారా కూడా మరొక సదుపాయం కల్పించామన్నారు. వారి ఆధార్ నంబర్‌ను మన మిత్ర వాట్సాప్ నంబరు 9552300009 కు పంపితే వాట్సాప్ ద్వారా అర్హత వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు.

టీఆర్ఎఫ్‌కు పాక్ సమర్థన

ఇస్లామాబాద్: జమ్మూకశ్మీర్, పహల్గాంలో దాడి ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) చేసినట్లు ఆధారాలు ఏవి అని పాకిస్థాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ ప్రశ్నించారు. ఆ దాడి టీఆర్ఎఫ్ పనిగా రుజువులు చూపాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎఫ్‌కు మద్దతు ప్రకటించారు. ఉగ్రవాద సంస్థగా టీఆర్ఎఫ్‌పై అమెరికా ముద్ర వేయడాన్ని ఆక్షేపించారు. ఐరాస ప్రకటనలో నుంచి టీఆర్ఎఫ్ పేరు తొలగించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్‌ను చట్టవ్యతిరేక సంస్థగా తాము పరిగణించడం లేదని, దానిపై ఆరోపణలను అంగీకరించమన్నారు. పహల్గాం దాడి టీఆర్ఎఫ్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయా... ఉంటే చూపించండి అని వ్యాఖ్యానించారు. ఇషాక్ దార్ పార్లమెంటులో మాట్లాడుతూ టీఆర్ఎఫ్‌కు మద్దతు తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్ర దాడి టీఆర్ఎఫ్ చేసినట్లు ఐరాస భద్రతా మండలి ఆక్షేపించడంపై మండలిలో శాశ్వత సభ్యత్వం లేనప్పటికీ పాకిస్థాన్ అభ్యంతరం తెలిపిందని వెల్లడించారు. 'ఐరాస భద్రతా మండలి ప్రకటనలో టీఆర్ఎఫ్‌ను పేర్కొనడాన్ని వ్యతిరేకిస్తున్నాం. గ్లోబల్ కేపిటలిస్టుల నుంచి ఫోన్లు వచ్చాయి కానీ పాకిస్థాన్ అందుకు అంగీకరించదు' అని ఇషాక్ దార్ వెల్లడించారు.

ఓపెన్ ఇంటర్ పాస్ సర్టిఫికెట్లు ఇంటికే...

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు అనుసరించి సార్వత్రిక విద్యాపీఠము (అమరావతి) నిర్వహించిన ఎస్.ఎస్.సీ, ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్-మే 2025 లో ఉత్తీర్ణులయిన అభ్యాసకులందరికీ వారు ఆన్‌లైన్ అడ్మిషన్ సమయంలో నమోదు చేసిన ఇంటి అడ్రస్‌కు స్పీడ్ పోస్టు ద్వారా వారి వారి ఎస్.ఎస్.సి/ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, మైగ్రేషన్... ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ పోస్ట్‌లో పంపినట్లు సంచాలకులు నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యాసకుల సౌకర్యార్థము ట్రాకింగ్ నిమిత్తము స్పీడ్ పోస్టు నంబర్, పాస్ సర్టిఫికెట్ పంపబడిన చిరునామా, ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్ సైట్ www.apopenschool.ap.gov.in లో పొందుపర్చామని, అభ్యాసకులు వివరములను వెబ్ సైట్ నుంచి పొందవచ్చని ఆయన తెలిపారు.

ఆర్ఎస్ఎస్‌తో సీపీఎంకు పోలికా?

రాహుల్ వ్యాఖ్యలపై బేబి ఆగ్రహం

న్యూదిల్లీ: సీపీఎం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను తన సైద్ధాంతిక శత్రువులుగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి బేబీ విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌తో సీపీఎంకు పోలికేమిటని సూటిగా ప్రశ్నించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అలాంటి పోలిక చేయడం దురదృష్టకరమని బేబీ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'సైద్ధాంతికంగా, రాజకీయంగా ఆర్ఎస్ఎస్‌తో పోరాడటంలో సీపీఎం ముందంజలో ఉన్న కేరళలో ఆయన అలాంటి వ్యాఖ్య చేయడం దురదృష్టకరం. అక్కడ వారు సీపీఎంకు చెందిన దాదాపు 100 మంది కార్యకర్తలను చంపారు. కేరళలో ఆర్ఎస్ఎస్‌తో పోరాడటంలో కాంగ్రెస్ రికార్డు గాంధీకి తెలుసో లేదో నాకు తెలియదు. ఒక విధంగా ఆయన సీపీఎం, ఆర్ఎస్ఎస్‌ను సమానం చేయడం కేరళ లేదా భారతదేశంలో సీపీఎం పాత్ర గురించి సరైన అవగాహన లేకపోవడాన్ని సూచిస్తుంది. 2004 ఎన్నికల తర్వాత లోక్‌సభలో కాంగ్రెస్‌కు మెజారిటీ లేకపోవడంతో సీపీఎం, ఇతర వామపక్ష పార్టీల మద్దతు లేకుండా మన్మోహన్ సింగ్ నాడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారని రాహుల్ గుర్తుచేసుకోవాలి' అని పేర్కొన్నారు. 'గాంధీ కేరళలోకి అడుగుపెట్టిన క్షణంలోనే ఆయన వయనాడ్ నుంచి మాజీ ఎంపీ అయినట్లు అనిపిస్తుంది. అక్కడ ఆయన ఆర్ఎస్ఎస్‌తో కాకుండా వామపక్ష అభ్యర్థితో పోరాడాల్సి వచ్చింది' అని బేబీ అన్నారు.

పాక్ 'కిరాణా హిల్స్'పై భారత్ దాడి నిజమే

ఉపగ్రహ ఫొటో నిపుణుడు సైమన్ వెల్లడి

న్యూదిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకుంది. ముందుగా ఉగ్రవాద స్థావరాలను దెబ్బతీసిన భారత్... ఆ తర్వాత పాకిస్థాన్ కవ్వింపులకు దీటైన సమాధానం ఇచ్చింది. పాకిస్థాన్ వైమానికదళానికి చెందిన 11 ఎయిర్ బేస్‌లపై దాడి చేసింది. ఇందులో నూర్‌ఖాన్ ఎయిర్ బేస్, రఫీకీ, సర్గోదా, జకోబాబాద్, స్కర్దు వంటివి ఉన్నాయి. అయితే, ఆ సమయంలో పాకిస్థాన్‌లోని సర్గోద జిల్లాలోని 'కిరాణా హిల్స్' పేరు ప్రముఖంగా వినిపించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు దాచే స్థలంగా పేరున్న ఈ కిరాణా హిల్స్ సమీపంలో భారత్ క్షిపణి దాడి చేసిందని ఊహాగానాలు చెలరేగాయి. అయితే, మీడియా సమావేశాల్లో మాత్రం భారత వైమానిక దళం బహిరంగంగా ఈ వాదనలను ఖండించింది. కానీ, కిరాణా హిల్స్ ప్రాంతంలో క్షిపణి దాడి జరిగిందని ప్రముఖ శాటిలైట్ ఫొటో నిపుణుడు డామియన్ సైమన్ స్పష్టం చేశారు. జూన్ 2025లో తీసిన గూగుల్ ఎర్త్ ఫొటోలను ఆయన విశ్లేషించి ఈ విషయాలు వెల్లడించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.